శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బంద్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ ప్లేట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బంద్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

PRAJAPAKSHAM ★

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 12 | వెల రూ. 5.00

సంపుటి 08, సంచిక: 110 | గురువారం | 20-03-2025 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar**

సంక్షేమం ఘనం

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల సంక్షేమానికి రూ.72,399 కోట్లు

రాష్ట్ర బడ్జెట్ రూ.3,04,965 కోట్లు

- ఆరు గ్యారంటీ పథకాలకు రూ.56,089 కోట్లు
- వ్యవసాయం, పశుసంవర్ధక, నీటిపారుదలకు రూ.49,486 కోట్లు
- శాసనసభలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన డిప్యూటీ సిఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

అభివృద్ధి, సంక్షేమం,సుపరిపాలన లక్ష్యంగా '2025–26వ ఆర్థిక సంవత్సరానికి గాను 'రూ.3,04,965 కోట్ల అంచనాలతో వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రెవెన్యూ వ్యయం రూ. 2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా ప్రతిపాదించారు. ఆరు గ్యారంటీ పథకాలకు రూ.56,084 కోట్లను, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమానికి రూ.72,399 కోట్లను, వ్యవసాయం, పశుసంవర్ధక, నీటిపారదుల శాఖలకు మొత్తం రూ.49,486 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. అత్యధికంగా ఎస్‌సి సంక్షేమ శాఖకు రూ.40,232 కోట్లను ప్రతిపాదించారు. ఈ మేరకు శాసనసభలో బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ''2025–26 వార్షిక ఆర్థిక బడ్జెట్''ను ప్రవేశపెట్టారు. ఉదయం 11:07 గంటలకు మొదలైన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 72 పేజీల బడ్జెట్ ప్రసంగాన్ని మధ్యాహ్నం 12:48 గంటలకు ముగించారు. మరోవైపు శాసనమండలిలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు '2025–26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ఆర్థిక శాఖ రూ.54,008 కోట్లు, వ్యవసాయ, సహకార శాఖలకు

రూ.24,439 కోట్లు, పశు సంవర్ధక, మత్స్య అభివృద్ధి శాఖకు రూ.1,674 కోట్లు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమానికి రూ.72,399 కోట్లను ప్రతిపాదించారు. (బిసి సంక్షేమ శాఖకు రూ.11,405 కోట్లు, ఎస్‌సి సంక్షేమంరూ.40,232 కోట్లు,ఎస్‌టి సంక్షేమ శాఖ రూ.17,169 కోట్లు, ఎస్‌టి సంక్షేమ శాఖకు రూ.3,591 కోట్లు) ప్రతిపాదించారు. అయితే 2023 24 ఆర్థిక సబ్ ప్లాన్ చట్టం తరువాయి 2లో

అభివృద్ధి, సంక్షేమం సుపరిపాలన
తెలంగాణ నమూనా

- బడ్జెట్‌లో ప్రస్తావించిన ప్రణాళికలు ఆర్థిక కేటాయింపులే కాదు.. సమాన అభివృద్ధికి, ఆర్థిక స్థిరత్వానికి, సామాజిక న్యాయానికి మార్గదర్శి • విస్తృత ప్రజాప్రయోజనాలే పరమావధిగా పాలన సాగిస్తున్నాం • ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టీకరణ 03

నిజం కూడా ప్రతిరోజు ప్రచారంలో ఉండాలి, లేదంటే అబద్ధం నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తుంది. దశాబ్ద కాలం పాలనా వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక అరాచకత్వంతో కూడిన పాలనతో భిద్రమైన తెలంగాణ పాలనా ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెడుతూ, తెలంగాణ తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు, లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని తమ ప్రభుత్వం నిరంతరం పని చేస్తున్నది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే గత పాలకులు సృష్టించిన సవాళ్లన్నింటినీ ఎదుర్కొని, తమ ప్రభుత్వం పరిపాలనా సత్తాను చాటుకుంది. అదే సమయంలో లోక్ సభ ఎన్నికలు రావడంతో, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అభివృద్ధి పనులకు కొంత విరామం ఏర్పడింది.

– డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

రెవెన్యూ రాబడి
రూ.2,29,720 కోట్లు

రెవెన్యూ వ్యయం
రూ.2,26,982 కోట్లు

మూలధన వ్యయం
రూ.36,504 కోట్లు

ద్రవ్యలోటు
రూ.54,009 కోట్లు

రెవెన్యూ మిగులు
రూ.2,738 కోట్లు

గొప్పలకు పోకుండా..

ఉన్నంతలోనే కేటాయింపులు : సిపిఐ

భారీ రుణ భారం, సంక్లిష్ట ఆర్థిక పరిస్థితుల మధ్య రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి సాహసోపేతమైన బడ్జెట్ ప్రవేశపెట్టారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు అన్నారు. 2025–26 వార్షిక బడ్జెట్ సంక్షేమం, అభివృద్ధి, హామీల అమలు పట్ల సమతుల్యత కోసం ప్రభుత్వం ప్రయత్నించినట్లు కనిపించిందని ఆయన పేర్కొన్నారు. గొప్పలకు పోయి బడ్జెట్‌ను పెంచకుండా, పన్నుల భారం మోపకుండా, ఉన్నంతలో ప్రవేశపెట్టారని, తొలి పూర్తి స్థాయి బడ్జెట్ తరువాత అనుభవంతో వాస్తవికంగా బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ఈ బడ్జెట్ తీపి, చేదు కలగొలుపు ఉగాది పచ్చడిలాగా ఉన్నదన్నారు. శాసనసభలో బుధవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన 2025–26 వార్షిక బడ్జెట్‌పై కూనంనేని స్పందిస్తూ తరువాయి 2లో

అభివృద్ధికి ఊతం

ప్రజా సంక్షేమమే ధ్యేయం : కాంగ్రెస్

ప్రజాపాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అన్ని రంగాల శ్రేయస్సే పరమావధిగా 2025–26 వార్షిక బడ్జెట్ రూపకల్పన జరిగిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. రైతులు, మహిళలకు లబ్ధి చేకూర్చే విధంగా, యువతకు స్వయం ఉపాధి కల్పించే విధంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ఊతం కల్పించే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. బడ్జెట్‌లో సాగునీటికి, మున్సిపల్ పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి బడ్జెట్ కేటాయింపులు హర్షించదగిన విషయమన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించాలని నిర్ణయించడం, తరువాయి 2లో

హామీలకు పాతర

నిరాశకు గురైన మహిళలు, వృద్ధులు : బిఆర్ఎస్

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఈ బడ్జెట్‌లో పాతరేశారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్ఎ కె.తారకరామారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల గురించి బడ్జెట్‌లో ఎక్కడా నిధులు కేటాయించలేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ చూసిన తర్వాత తెలంగాణ మహిళలు, వృద్ధులు నిరాశకు గురయ్యారని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన తులం బంగారం పథకం, 4000 పింఛన్, మహిళలకు 2500 పథకాలకు ఈ బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదని, కెటిఆర్ మండిపడ్డారు. స్విగ్గి, జొమాటో వర్కర్లకు వర్కర్స్ బోర్డు అన్నారని తరువాయి 2లో

మరోసారి మోసం

ఆశలు వదిలేసుకునేలా పద్దు : బిజెపి

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి విమర్శించారు. అట్టహాసంగా ప్రకటించిన గ్యారెంటీల అమలుపై ప్రజలు ఆశలు వదులుకునేలా పద్దుల రూపకల్పన ఉందని,అంకెల గారడీతో తెలంగాణ ప్రజలను మరోసారి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అగాధంలోకి నెట్టేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు రాష్ట్రాన్ని పెనంపైనుంచి పొయ్యిలోకి పడేసినట్లు చేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో అన్నివర్గాల ప్రజలను అడుగడుగున మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలపై ప్రజలు ఆశలు వదులుకోవాలని తెలంగాణ బడ్జెట్ నిరూపించింది. ప్రభుత్వ తరువాయి 2లో

పొంతనే లేదు

విద్యారంగానికి తగ్గించారు సిపిఐ(ఎం)

రాష్ట్ర ప్రభుత్వం రూ.3,04,855 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మ్యానిఫెస్టో అమలుకు ఎలాంటి పొంతన లేదని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు ఇచ్చిన నిధుల కేటాయింపుల్లో కామారెడ్డి బిసి డిక్లరేషన్, చేవెళ్ళ ఎస్‌సి,ఎస్‌టి డిక్లరేషన్లకు సంబంధం లేకుండా ఈ కేటాయింపులు ఉన్నాయని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టికు టుంబానికి రు.12లక్షలు ఇస్తామని చెప్పారని, ఈ బడ్జెట్లో ఆ ఊసే లేదన్నారు. కామారెడ్డిలో బిసిలకు సబ్ ప్లాన్ అమలు చేస్తామని, ఈ బడ్జెట్లో మాత్రం కేవలం రు.11400 కోట్లు మాత్రమే కేటాయించగా, . మైనారిటీ సంక్షేమానికి కేవలం రు.3వేల కోట్లకు పరిమితం చేశారన్నారు. అతిముఖ్యమైన తరువాయి 2లో

ఉక్రేన్ ఇంధన వనరులపై
దాడుల విరమణ

- తక్షణం సంప్రదింపులు ప్రారంభం
- 30 రోజుల విరామానికి రష్యా అంగీకారం
- వైట్‌హౌస్ ప్రకటన
- ఉక్రేన్‌కు విదేశీ సాయం ఆపితేనే పరిష్కారం : పుతిన్



వాషింగ్టన్ : ఉక్రేన్‌లోని ఇంధన వనరులు, ఇతర మౌలిక సదుపాయాల లక్ష్యాలపై 30 రోజుల పాటు దాడులు ఆపేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ అంగీకరించారు. ఉక్రేన్‌లో కాల్పుల విరమణ, యుద్ధశాంతి తదితర అంశాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, పుతిన్ మధ్య మంగళవారం రాత్రి 90 నిమిషాలసేపు ఫోన్‌లో విస్తృత సంభాషణ జరిగింది. ఉక్రేన్ ఇంధన వనరుల లక్ష్యాలపై 30 రోజులు దాడులు నిలిపివేయాలని సంభాషణ పూర్తయిన వెంటనే పుతిన్ తన ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారని వార్త వెలువడింది. ఉక్రేన్–రష్యాలు 372 మంది సైనికులను బుధవారంనాడు పరస్పరం మార్పిడి చేసుకోవడానికి రంగం సిద్ధమైనట్లు కూడా ట్రంప్‌కు పుతిన్ ఫోన్‌లో చెప్పారు. వైట్‌హౌస్ యంత్రాంగం ఒక ప్రకటన చేస్తూ, తమ ఒత్తిడి మేరకు 30 రోజుల కాల్పుల విరమణకు పుతిన్ అంగీకారం తెలియజేశారనీ, ''శాంతికి ఇది తొలి అడుగు'' అని పేర్కొంది. ఈ చర్యల ప్రాతిపదికపై మధ్య ఆసియాలో తక్షణం సంప్రదింపులు ప్రారంభం అవుతాయని పుర్కొంది. ఈ విషయాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి దీ్మిత్రీ పెస్కోవ్ ధృవీకరించారు. సముద్రతలంపై కూడా కాల్పుల విరమణకు ట్రంప్ ఇచ్చిన తరువాయి 12లో

దివినుంచి భువికి
సురక్షితంగా సునీత

- తిరిగి వచ్చిన మరో ముగ్గురు వ్యోమగాములు
- భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు మైలురాయి



కేప్ కెనవరాల్ : స్పేస్‌ఎక్స్ అంతరిక్ష నౌక నలుగురు వ్యోమగాములతో సురక్షితంగా భూమికి చేరుకుంది. దీంతో యావత్ ప్రపంచం ఉత్కంఠతో ఎదురుచూసిన ఘట్టం విజయవంతంగా పూర్తయింది. 17 గంటల ప్రయాణం తర్వాత బుధవారం తెల్లవారుజామున (అమెరికా కాలం ప్రకారం మంగళవారం సాయంత్రం) ఫ్లోరిడాలోని సముద్ర జలాల్లో అంతరిక్ష నౌక దిగింది. సిబ్బంది వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. బయటకు రాగానే ఆమె చేతులు ఊపుతూ అందరికీ అభివాదాలు తెలియజేశారు. సహాయకుల మద్దతుతో ఆమె కాసేపు లేచి నిలబడగలిగారు. ఈ వ్యోమగాములు నలుగురు కోలుకోవడానికి ఎక్కువ సమయమే పడుతుంది. కోలుకున్నాగానీ అంతరిక్ష సంబంధమైన సమస్యలు వారిని వెంటాడక తప్పదని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. విల్మోర్, విలియమ్స్ ఇద్దరూ 286 రోజులపాటు అంతరిక్షంలో గడిపారు. 4,576 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణం చేశారు. భూమికి 400 కి.మీ ఎత్తులో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి తొమ్మిది నెలల తర్వాత వచ్చిన నలుగురు వ్యోమగాముల ఆరోగ్యాన్ని కాపాడి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు వీలుగా వారిని నాసా తరువాయి 12లో

ఎవరికీ వ్యతిరేకం కాదు

- ఎస్‌సి వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ
- షెడ్యూల్డు కులాలకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) వర్గీకరించి రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, ఇది ఎవరికి వ్యతిరేకంగా చేసిందికాదని, వర్గీకరణ ద్వారా ఎస్‌సిలకు న్యాయం చేయాలనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పదేళ్లలో పరిష్కారం కాని సమస్యకు తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే పరిష్కారం చూపామని పేర్కొన్నారు. ఆనాడు వర్గీకరణ తీర్మానం పెట్టాలని డిమాండ్ చేస్తే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఎస్‌సి ఉపకులాల వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఎస్‌సి సంఘాల నేతలు అసెంబ్లీ కమిటీహాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా వర్గీకరణ తరువాయి 2లో

ఇది ఆరంభం మాత్రమే

నేతన్యాహూ హెచ్చరిక

రెండోరోజు గాజాపై దాడులు
చర్చలకు సిద్ధం : హమాస్

గాజా : గాజాలో ఇజ్రాయెల్ రెండోరోజు బుధవారంనాడు తిరిగి దాడులు చేసింది. ఈ దాడుల్లో 24 మంది పాలస్తీనియన్లు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. పూర్తిశక్తిసామర్థ్యాలో సైన్యాన్ని గాజాలోకి నడిపిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ అన్నారు. ''ఇది ఆరంభం మాత్రమే'' అని హమాస్‌కు హెచ్చరించారు. ఐతే తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని హమాస్ ప్రతినిధులు తాజా ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి హమాస్‌పై ఆరోపణలు చేసి ఇజ్రాయెల్ మంగళవారం తెల్లవారుజామున గాజాపై దాడులు జరిపింది. ఈ దాడుల్లో 400 మంది పైగా మరణించారు. ఈ చర్యలను ప్రపంచదేశాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. పలుచోట్ల నిరసన ప్రదర్శనలు జరిగాయి. గాజాలో ఉన్న బందీలను విడుదల చేయాలనీ, తాము కోరిన విధంగా కాల్పుల ఒప్పందం అమలుకు అంగీకరించాలని డిమాండ్ చేస్తూ ఇజ్రాయెల్ ఈ దాడులను పునరుద్ధరించింది. గతవారం అమెరికా దూత స్టీవ్ విట్‌కాఫ్ సమక్షంలో ఖతార్‌లో హమాస్–ఇజ్రాయెల్ చర్చలు విఫలమయ్యాయి. బందీలందరినీ విడుదల చే యాలని, హమాస్‌ను పూర్తిగా ఓడించాలనీ ఇజ్రాయెల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వైదొలగాలనీ, బందీలను విడుదల చేసేదిలేదని హమాస్ వాదించింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి.

గాజా యుద్ధంలో కీలక ఘట్టాలు

- 2023 అక్టోబరు 07న హమాస్ దాడిః
1200 మంది ఇజ్రాయెలీలు హతం, 251 మంది అపహరణ.
- గాజాలో యుద్ధం ప్రారంభం.
ఇప్పటివరకూ 61,700 మంది మృతి, 1,12,000 మందికి గాయాలు.
- 2025 జనవరి 19న మొదటి విడత 45 రోజుల
కాల్పుల విరమణ ఒప్పందం అమలు ప్రారంభం.
- మార్చి 1న కాల్పుల విరమణ ఒప్పందం పూర్తి.
- 25 మంది బందీలు, 1900 మంది పాలస్తీనా ఖైదీ విడుదల.
- బేషరతుగా మిగిలిన 59 మంది బందీల విడుదలకు ఇజ్రాయెల్ ఒత్తిడి.
- మార్చి 4న కైరోలో అరబ్‌దేశాల అత్యవసర సమావేశం.
- గాజా మేనేజ్‌మెంట్ కమిటీ తాత్కాలికంగా ప్రభుత్వం నడుపుతుందని తీర్మానం.
- గడచిన రెండు వారాలుగా గాజాలోకి మానవతా సహాయం నిలిపివేత.
- మార్చి 18న గాజాపై మళ్ళీ ఇజ్రాయెల్ దాడులు ః 400 మందిపైగా మృతి.

ఇజ్రాయెల్‌ను విధ్వంసం దిశగా నడిపిస్తున్న నేతన్యాహూ

టెల్‌అవీవ్‌లో వేలాదిమంది నిరసన ప్రదర్శన

టెల్‌అవీవ్ : ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూకు వ్యతిరేకంగా రాజధాని టెల్‌అవీవ్‌లో మంగళవారం రాత్రి 40 వేలమంది ప్రజలు భారీ ప్రదర్శన జరిపారు. ప్రధానమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇజ్రాయెల్ గూఢచారి విభాగం ఇజ్రాయెలీ సెక్యూరిటీ ఏజన్సీ (ఐఎస్ఎ) 'షాబెక్' లేదా 'షిన్ బెట్' ప్రధానాధిపతి రోనెన్ బార్‌ను పదవీచ్యుతుణ్ణి చేసేందుకు సిద్ధపడటంతో దేశంలో పెద్ద ఎత్తున నిరసన చెలరేగింది. ఆయనకు మద్దతుగా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. దేశంలో నియంతపాలనను కూల్చివేసేందుకు సమయం ఆసన్నమైందని ప్రదర్శకులు నినాదాలు చేశారు. నేతన్యాహూకు ఖతార్‌కు మధ్య ఉన్న సంబంధాలు, ఆయనకు అందుతున్న సహాయంపై దర్యాప్తు నేపథ్యంలో రోనెన్ బార్‌ను పదవీచ్యుతుణ్ణి చేయాలని నేతన్యాహూ ఆలోచనలు చేస్తున్నారు. పైగా గాజాలో ఉన్న ఇజ్రాయెల్ బందీల ప్రాణాలను పణంగాపెట్టి తిరిగి యుద్ధం ప్రారంభించడాన్ని కూడా ఇజ్రాయెల్‌లో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వేలాదిమంది ప్రజలు రాత్రి టెల్‌అవీవ్‌లోని హబిమా స్క్వేర్ వద్ద గుమిగూడి ప్రధానమంత్రి విధానాలను వ్యతిరేకించారు. ఇటీవలికాలంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇన్నివేలమంది ప్రజలు వీధుల్లోకి రాలేదు. ''నేతన్యాహూ మోసగాడు, అబద్ధాలకోరు, పిరికివాడు, ఇజ్రాయెల్‌ను విధ్వంసంవైపు నడిపిస్తున్నాడు'' అని సీనియర్ భద్రతా అధికారి (మాజీ) తమీర్ పార్డో విమర్శించారు. నేతన్యాహూకు ఇక విశ్రాంతిని ఇచ్చే యుద్ధం మొదలైందని ఆయన హెచ్చరించారు. తీవ్రవాద మిత్రదేశాల మద్దతును కూడగట్టుకునేందుకు నేతన్యాహూ బందీల విడుదలకు సంబంధించిన చర్చలను పణంగా పెట్టారనీ, అదికూడా ఈనెలాఖరులో కీలకమైన బడ్జెట్‌పై ఓటింగ్‌కు ముందుగా ఈ పరిస్థితులు చోటు చేసుకున్నాయనీ ప్రదర్శనలో పాల్గొన్న కొందరు మాజీ అధికారులు విమర్శించారు. ఈ ఆరోపణలను నేతన్యాహూ తిరస్కరించారు.

న్యూయార్క్ , చిలీలలో ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలు

లోయర్‌మన్‌హట్టన్ : శాంతి ఒప్పందాన్ని తిరస్కరించి లేనిపోని ఆరోపణలతో ఇజ్రాయెల్ తిరిగి గాజాలో యుద్ధం ప్రారంభించడాన్ని వ్యతిరేకిస్తూ న్యూయార్క్‌లో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. అదేవిధంగా చిలీదేశంలో కూడా ప్రదర్శకులు పెద్దసంఖ్యలో వీధుల్లోకి వచ్చి ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేశారు. మంగళవారం రాత్రి వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. తక్షణం యుద్ధం ఆపాలని డిమాండ్ చేశారు. మంగళవారంనాడు తెల్లవారుజామున గాజాపై ఇజ్రాయెల్ సైన్యాలు విరుచుకుపడి 400 మందికిపైగా పాలస్తీనియన్లను చంపాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయి. కాల్పుల విరమణ ఉల్లంఘన ప్రపంచ భవితకు ప్రమాదకరమని ప్రదర్శకులు నినాదాలు చేశారు. అదేవిధంగా పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా చిలీలో కూడా నిరసన ప్రదర్శనలు జరిగాయి. గతంలో కూడా పాలస్తీనియన్లకు సంఘీభావం ప్రకటిస్తూ శాంతియాగోలో ప్రజలు నిరసన ప్రదర్శనలు చేశారు. తక్షణం గాజాలో ఊచకోతలు నిలిపివేయాలని వారు కోరారు.



ఎర్రసముద్రంలో హౌతీ దాడులు

సనా: ఎర్రసముద్రంలో అమెరికా నౌకలపై నాలుగోసారి తాము దాడులు చేసినట్లు హౌతీ ఉగ్రవాదులు ప్రకటించారు. ఇప్పటికి నాలుగు రోజులుగా అమెరికా–హౌతీ ఉగ్రవాదుల మధ్య దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నాయి. హ్యారీ ట్రూమన్ నౌకపై గడచి 72 గంటల్లో మరోసారి తాము దాడి చేశామని హౌతీల నాయకుడు ప్రకటించారు. అదేవిధంగా అమెరికా కూడా ఒక ప్రకటన చేస్తూ హౌతీ లక్ష్యాలపై తాము గురిపెట్టి దాడులు చేస్తున్నట్లు పేర్కొంది. డ్రోన్లు, క్షిపణులతో తాము దాడులు చేస్తున్నట్లు హౌతీలు చెప్పారు.

డి.ఆర్.కాంగోలో తక్షణం కాల్పుల విరమణ

డోహా చర్చల్లో రువాండా,కాంగో నేతల అంగీకారం

దోహా : డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డి.ఆర్.కాంగో)లో తక్షణం కాల్పుల విరమణ పాటించాలని నిర్ణయం జరిగింది. ఖతార్ రాజు సమక్షంలో దోహాలో బుధవారం జరిగిన చర్చల్లో డి.ఆర్.కాంగో అధ్యక్షుడు ఫెలిక్స్ త్షిసెకిడి, రువాండా దేశాధ్యక్షుడు పాల్ కగామే మధ్య ఒక అంగీకారం కుదిరింది. నాయకులు ఇద్దరూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమలు చేసేందుకు చిత్తశుద్ధి ప్రకటించారని ఖతార్ విదేశాంగమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.ఖతార్ ఎమిర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ మధ్యవర్తిత్వం వహించి ఈ చర్చల్లో కీలకపాత్ర పోషించారు. రువాండా–కాంగో రెండు ఆఫ్రికా దేశాలకూ గల్ఫ్‌దేశం ఖతార్ కీలకమైన వ్యూహాత్మక మిత్రదేశమని అల్‌థానీ అన్నారు. ఐతే మంగళవారంనాడు నిర్ణీత ప్రకారం అంగోలాలో ఏర్పాటు చేసిన శాంతి చర్చలకు హాజరయ్యేందుకు మొదట అంగీకరించినప్పటికీ చివరి నిమిషంలో చర్చలను బహిష్కరించిన ఎం–23 తిరుగుబాటుదారులు ఈ కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరిస్తారా? లేదా? అనేది ఇప్పటికే సందిగ్ధాంశమే. ఈ ఒప్పందాన్ని ఎలా అమలు చేస్తారు? ఎలా పర్యవేక్షిస్తారు? అనే విషయాలు ఇప్పటికీ మిలియన్ డాలర్ ప్రశ్నలుగానే ఉన్నాయి. మరోవైపు రువాండా అధ్యక్షుడు కగామే విడిగా ఒక ప్రకటన చేస్తూ, ఎం–23, కాంగో ప్రభుత్వ ప్రతినిధులధ్య ప్రత్యక్ష చర్చలు జరిగితేనే ఈ సమస్య మూలకారణానికి పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఎం–23 తిరుగుబాటుదారులకు కాంగో సరిహద్దుల్లో ఉన్న రువాండా ప్రభుత్వం ఆయుధాలు సమకూర్చి ఇంటిజెన్స్ సమాచారం అందజేస్తూ అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందజేస్తోందని మొదటినుండీ డి.ఆర్.కాంగో ప్రభుత్వం తీవ్ర ఆరోపణలు చేస్తూనే ఉంది. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి కూడా ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తూ తమ వద్ద తగిన సాక్ష్యాలు ఉన్నాయని ఇప్పటికే ఒక ప్రకటన కూడా చేసింది. అమెరికా ప్రభుత్వం కూడా రువాండాపై ఇదేవిధమైన ఆరోపణలు, విమర్శలు చేస్తున్నది. రువాండా ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను తిరస్కరిస్తున్నది. డి.ఆర్.కాంగో, దాని మిత్రదేశాల సైన్యం చేస్తున్న దాడుల నుండి తాము ఆత్మరక్షణ చర్యలు మాత్రమే తీసుకుంటున్నామని రువాండా ప్రభుత్వం చెబుతున్నది. ఎం–23 ఉగ్రవాదులతో డి.ఆర్.కాంగో ప్రభుత్వం ప్రత్యక్ష చర్చలు జరపాలని రువాండా డిమాండ్ చేయడంతో గడచిన డిసెంబరులో అంగోలాలో ఏర్పాటు చేసిన శాంతి చర్చలు పూర్తిగా విఫలమయ్యాయి. రువాండాకు సరిహద్దుల్లో ఉన్న డి.ఆర్.కాంగోలోని గోమా, బుకావు ప్రాంతాలను ఎం–23 ఉగ్రవాదులు గడచిన రెండు నెలలుగా చేసిన దాడుల్లో స్వాధీనం చేసుకున్నారు. వేలాదిమందిని హతమార్చి వీధుల్లో రోడ్ల పక్కనే పడేశారు.

పొంతనే లేదు (మొదటి పేజీ తరువాయి)

విద్యారంగానికి గతం కంటే 2 శాతం తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల కోసం నిధుల కేటాయింపులు గత సంవత్సరం కేటాయించిన దానిలో సగం కూడా ఖర్చుపెట్టలేదని, ఈ ఏడాది కూడ అలాంటి పద్ధతిలోనే ప్రతిపాదనలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్‌ను పునఃసమీక్షించి, కీలక రంగాలతోపాటు, సంక్షేమ రంగాలకు కేటాయించిన పద్దులను అవసరానికి అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు.

హామీలకు పాతర

(మొదటి పేజీ తరువాయి)

అదీ కూడా మర్చిపోయారన్నారు. యాదవులకు గొర్రెలు, గౌడ్‌లకు మద్యం దుకాణాల్లో ప్రత్యేక వాటా అని హామీ ఇచ్చి మోసం చేశారని కెటిఆర్ ఆరోపించారు. అశోక్‌నగర్‌లో టీ తాగుతూ 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్‌గాంధీ ఫోజులు కొట్టారని, రాహుల్‌గాంధీ ఇప్పుడు అశోక్‌నగర్‌కు వచ్చి చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణకు కాంగ్రెస్ వైరస్ సోకిందని ఎద్దేవా చేశారు. ఏ ఒక్క ఊరిలో 100 శాతం రైతు రుణ మాఫీ జరిగిందని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎండిపోయిన ప్రతి ఎకరానికి రూ.25 వేల చొప్పున పంటల పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎండని పంటలు ఈ రోజు ఎందుకు ఎండిపోతున్నాయని ఆయన ప్రశ్నించారు. దేవాదులకు పంపుల నిర్వాహణ కోసం రూ.6 కోట్లు ఇవ్వకపోవడం వల్ల రూ.600 కోట్లకు పైగా నష్టం జరిగిందన్నారు. ఈ బడ్జెట్ ద్వారా పదేళ్ల ప్రగతి చక్రానికి పంక్చర్ చేశారని ఆరోపించారు.

ఎవరికీ వ్యతిరేకం కాదు

(మొదటి పేజీ తరువాయి)

పోరాటంలో అమరులైన వారికి నివాళిగా సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంఎల్‌ఎలు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎస్‌సి నేతలను ఉద్దేశించి సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ లేకపోతే వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే శక్తి తనకు వచ్చేదికాదన్నారు. భవిష్యత్‌లో న్యాయపరమైన చిక్కులు ఉండకూడదనే ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఏకసభ్య కమిషన్ 199 పేజీల నివేదిక ఇచ్చిందన్నారు. సుప్రీంకోర్టులో బలంగా వాదనలు వినిపించి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేందుకు కృషి చేశామన్నారు. సుప్రీంకోర్టు తీర్పును దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయలేదని గుర్తు చేశారు. తామే అమలు చేసే ప్రక్రియను మొదలుపెట్టామన్నారు. న్యాయపరమైన హక్కుల సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నామని, ఇప్పుడు సాధించుకున్నామన్నారు. వందేళ్లలో ఎప్పుడూ లేని విధంగా ఉస్మానియా యూనివర్సిటీ విసిగా మాదిగ బిడ్డ కుమార్‌ను నియమించామని, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఖాసీంను నియమించామని తెలిపారు.

ఉచితం (మొదటి పేజీ తరువాయి)

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందనడానికి నిదర్శనం అన్నారు. దావోస్‌లో రూ1.78 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించిన తెలంగాణ పారిశ్రామిక రంగంలో మరింత ప్రోత్సాహానికి రూ.3527 కోట్లు కేటాయించిందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించకుండా కఠినమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్‌సి సంక్షేమానికి పెద్దఎత్తున రూ.40,234 కోట్లు, ఎస్‌టి సంక్షేమానికి రూ.17,169 కోట్లు, వెనుకబడిన తరగతుల శాఖకు రూ.11,405 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.3,591 కోట్లు కేటాయించి బడ్జెట్‌లో బడుగు బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇప్పటికే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్‌సి వర్గీకరణ చేపట్టి తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అని నిరూపించుకున్నామన్నారు.

వ్యవసాయ రంగానికి రూ. 24,439 కోట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వ్యవసాయ – దాని అనుబంధ రంగాలకుగత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం కొంత మేరకు నిధులను ప్రభుత్వం తగ్గించినా రైతుభరోసాకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రూ.18,000 కోట్లను కేటాయించడం గమనార్హం. ఈ శాఖలకు 2024–25 బడ్జెట్‌లో రూ. 49,383 కోట్ల కేటాయించగా ఈ ఏడాది మాత్రం బడ్జెట్ లో రూ. 24,439 కోట్ల రూపాయలను ప్రతిపాదించింది. గత ఏడాది రైతు రుణ మాఫీ చేయాల్సి ఉండడం, రైతుభరోసా తదితరాలకు కలిపి వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు కలిపి మొత్తం రూ.72,659 కోట్లను ప్రభుత్వం కేటాయించగా, ఈ సారి మాత్రం వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 24,439 కోట్లు, సన్న ధ్యానానికి బోనస్‌కు గాను రూ.1,800 కోట్లను ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇదిలా ఉండగా, పశు సంవర్ధక శాఖకు, మత్స అభివృద్ధి శాఖల అభివృద్ధికి ఈ ఏడాది ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టింది. ఈ బడ్జెట్ లో1,674 కోట్లలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ఏడాది పశువులు వ్యాధుల బారినపడకుండా నిరోధించే టీకాలను ఉత్పత్తి చేసే తెలంగాణ పశు వైద్య టీకా ఉత్పత్తి కేంద్రమైన వెటర్నరీ బయోలాజికల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ ని మామిడిపల్లికి తరలించి రూ. 300 కోట్ల రూపాయలతో విస్తరించనున్నట్లు ప్రకటించింది. కొత్త వ్యాక్సీన్ల ఆవిష్కరణకుఅవసరమైన పరిశోధనలు నిమిత్తం రూ.100 కోట్లతో అధునాతన యంత్రాలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో మేలు జాతి పాడిపశువులను వృద్ధి చేయడానికి రంగారెడ్డి జిల్లా కంసాన్ పల్లి లో ఒక క్రొత్త ఫ్రోజెన్ సెమన్ బుల్ స్టేషన్ నురూ.21.06 కోట్లు వ్యయంతో నిర్మించనున్నారు.అదేవిధంగా భారీగా చేపల ఎగుమతిని ప్రోత్సహించడానికి రంగారెడ్డి జిల్లా కొహెడలో రూ. 47 కోట్ల వ్యయంతో చేపల మార్కెట్‌ను నిర్మించాలని ప్రతిపాదించారు.

ప్రజాపంపిణీకి భారీగా నిధులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : నిరుపేదల కడుపు నింపుతున్న ప్రజా పంపిణి వ్యవస్థకు ప్రభుత్వం ఈ ఏడాది భారీగా నిధులను కేటాయించింది. గత ఏడాది బడ్జెట్‌లో పౌర సరఫరాల శాఖకు ప్రభుత్వం రూ.3836 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ సంవత్సరం పౌర సరఫరా శాఖకు మొత్తం రూ.5,734 కోట్లను ప్రతిపాదించింది. తద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం కోనుగోళు చేసిన వెంటనే నిధులు చెల్లించేందుకు మార్గం సుగమం చేసింది.రాష్ట్రంలో వరి ధాన్యం దిగుబడి రికార్డు స్థాయిలో వస్తుండడం దీనికి తోడు సన్న ధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 చోప్పున బోనస్ ప్రకటించిన నేపథ్యంలో సన్న వరి సాగు పెరిగిన నేపథ్యంలో నిధులను పెంచింది. అదేవిధంగా ఈ ఏడాది రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇందుకు తగ్గట్లుగానే నిధులను కేటాయించింది. గత ఏడాదితో పోల్చిదే ఈ సంవత్సరం రూ.1,898 కోట్లను అదనంగా కేటాయించింది.

సంక్షేమం ఘనం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం ఎస్‌సి సంక్షేమానికి రూ. 13,617 కోట్లను, ఎస్‌టిలకు రూ.1317 కోట్ల నిధులను ఖర్చు చేయలేదు. ఈ నిధులను కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ప్రతిపాదించారు. విద్యాశాఖకు రూ.23,108 కోట్లు, విద్యుత్ శాఖకు రూ. 21,221 కోట్లు, అడవులు, పర్యావరణ, సైన్స్, టెక్నాలజీ శాఖకు రూ.1,023 కోట్లు, పౌర సరఫరాల శాఖకు రూ.5,734 కోట్లు, సాధారణ పరిపాలన శాఖకు రూ.1,112 కోట్లు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖరూ.12,393 కోట్లు,హోం శాఖకు రూ.10,188 కోట్లు, కార్మిక ఉపాధికల్పన కు రూ.900 కోట్లు , పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి రూ.31,605 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి రూ.2,862 కోట్లు, చేనేత రంగానికి రూ.371 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ.3,527 కోట్లు, ఐటి శాఖకు రూ.774 కోట్లు, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు రూ.17,677 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.23,373 కోట్లు, దేవాదాయ శాఖకు రూ. 190 కోట్లు, క్రీడా శాఖకు రూ.465 కోట్లు, పర్యాటక శాఖకు రూ.775 కోట్లు, రోడ్లు భవనాల శాఖకు రూ.5,907 కోట్లు, దేవాదాయ శాఖకు రూ. 190 కోట్లను బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రానున్న ఐదేళ్లలో ఎంఎస్‌ఎంఇ అభివృద్ధి కోసం రూ.4 వేల కోట్లను ఖర్చు చేసి, 25 వేల పైచిలుకు కొత్త ఎంఎస్‌ఎంఇ పరిశ్రమలను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, స్వయం సహాయక బృందాలు ఎంఎస్‌ఎంఇలుగా మారేందుకు అన్ని దశల్లో సహాయం అందిస్తామని ప్రభుత్వం ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రకటించింది.

స్థూల ఉత్పత్తిలో వృద్ధి రేటు 10.1 శాతం

2024–25 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి) ప్రస్తుత ధరల ప్రకారం రూ.16,12,579 కోట్లు, గత సంత్సరంతో (2023–24) పోలిస్తే వృద్ధి రేటు 10.1 శాతం నమోదైంది. కాగా దేశ జిడిపి రూ.3,31,03,215 కోట్లు ఉండగా, వృద్ధి రేటు 9.9 శాతంగా ఉన్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,79,751, ఉండగా, వృద్ధిరేటు 9.6 శాతంగా నమోదైంది. దేశ తలసరి ఆదాయం రూ.2,05,579 కాగా వృద్ధి రేటు 8.8 శాతంతో దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,74,172, అంటే 1.8 రెట్లు అధికంగా నమోదైంది. అయితే రాష్ట్రంలోని పరిశ్రమలు 22.5 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో స్థూల విలువలో సేవా రంగం 66.3 శాతం, పారిశ్రామిక రంగం 16.4 శాతం, వ్యవసాయ, అనుబంధ రంగాలు 17.3 శాతం వాటాను కలిగి ఉన్నది. వ్యవసాయ, అనుబంధ రంగాలు జిఎస్‌డిపిలో తక్కువ వాటా కలిగి ఉన్నప్పటికీ రాష్ట్రం మొత్తం శ్రామిక రంగంలో 42.7 శాతంగా ఉన్నది. శ్రామిక శక్తి 68.7 ఉండగా, దేశీయ సగటు 64.3 శాతం నమోదు కాగా, ఇందులో మహిళల ఉపాధి శాతం 52.7 శాతంగా ఉన్నది. ఇది దేశ సగటు 45.2 శాతం కంటే అధికం.

గొప్పలకు పోకుండా..

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం పథకాలకు లక్ష కోట్ల రూపాయలు ఉండగా, అందులో ఆరు వాగ్దానాలకు అమలుకు రూ.56 వేల కోట్లు సహా, సంక్షేమ పథకాలకు రూ.1.04 లక్షల కోట్లు కేటాయించడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. వారసత్వంగా వచ్చిన అప్పులతో పాటు, తిరిగి చెల్లించేందుకు చేస్తున్న అప్పులు, బడ్జెట్ యేతర రుణాలు కలిపి అప్పులు రూ.8 లక్షల కోట్లకు చేరుకోవడం, జిఎస్‌డిపిలో రుణ నిష్పత్తి పరిమితి మించి 28.1 శాతానికి చేరడం కొంత ఆందోళనకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి ద్వారా ఆర్థిక వనరులను కేంద్రీకృతం చేసిన ప్రభావం రాష్ట్ర బడ్జెట్‌లపై పడుతున్నదన్నారు. నిధుల సమీకరణకు భూముల విక్రయం, మద్యం ద్వారా సుమారు రూ.60 వేల కోట్లు సమీకరించాలని భావించడం సమంజసం కాదని సాంబశివరావు అన్నారు. నీటిపారుదలకు రూ.23,354 కోట్లు మాత్రమే కేటాయించారని, ఆ నిధులు ఏమాత్రం సరిపోవన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పునర్‌నిర్మాణం చేయాలంటే ఇంకా ఎక్కువ నిధులు అవసరం అవుతాయన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు రూ.2900 కోట్లు మాత్రమే కేటాయించారని, వాస్తవానికి రూ.11,600 పెట్టాలని, వైద్య రంగానికి 4.5 శాతం, విద్యా రంగానికి 7.5 శాతం మాత్రమే కేటాయించారని, ఆ శాఖలకు నిధులను ఇంకా పెంచాల్సిన అవసరముందన్నారు. కనీస బడ్జెట్ విద్యా, వైద్యరంగాలకు ఇంకా 20 శాతం వరకు కేటాయింపులు చేయవచ్చన్నారు. జర్నలిస్టులకు పని భద్రత లేదని, ప్రతి వర్గానికి ఆర్థికంగా, ఉద్యోగ భద్రత ప్రభుత్వం కల్పించాలని ఆయన సూచించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల భద్రత, వేతనాల పెంపుదల ప్రస్తావన లేదన్నారు. ఉన్నంతవరకు ఇది మంచి బడ్జెట్ అని, ఈ స్థితిలో ఇంతకంటే సాధ్యం కాదని సాంబశివరావు పేర్కొన్నారు.

మరోసారి మోసం

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయం, రాబడిపై కనీస అవగాహన లేకుండా అంచనాలు రూపొందించారని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

బడ్జెట్ మొత్తం డొల్ల ః కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పూర్తిగా డొల్ల అని తెలిపోయిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. గత బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను పరిశీలిస్తే పొంతనే లేదని, అయినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు పెంచి తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారిదారుణంగా మోసం చేసిందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొన్న హామీలను పూర్తిగా గాలికొదిలేసినట్లు ఈ బడ్జెట్ తో తేటతెల్లమైంది. మహిళలకు నెలనెలా రూ.2,500లు, తులం బంగారం, స్కూటీ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ గత బడ్జెట్ లోనూ నయాపైసా కేటాయించలేదు. ఈ బడ్జెట్ లోనూ ఆ ప్రస్తావన తీసుకురాకపోవడం దుర్మార్గం. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు నెలనెలా రూ.4 వేల నిరుద్యోగ భ్రుతి ఇచ్చే అంశంపై బడ్జెట్ లో కేటాయింపులు జరపకపోవడం సిగ్గు చేటాన్నారు.గత(2024–25) ఆర్థిక సంవత్సరంలో రూ.2 లక్షల 91 వేల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆచరణలోకి వచ్చేసరికి రూ.2 లక్షల కోట్లు కూడా ఖర్చయిన దాఖలాలు లేవన్నారు. కోతలు కోయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్‌ఎస్ సర్కార్ ను మించిపోయిందని విమర్శించారు.

నిరుద్యోగులకు మొండిచేయి : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

రాష్ట్రాన్ని దివాళా తీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ ఉన్నదని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఇది పసలేని బడ్జెట్ అని, హామీల ఎగవేత బడ్జెట్ అని పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద బుధవారం బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ నిరుద్యోగులకు మొండి చేయి చూపేలా బడ్జెట్ ఉన్నదన్నారు. ప్రతి మహిళకు నెలవారీగా రూ.2,500 చొప్పున ఇస్తామని మొండిచేయి చూపారన్నారు. ఇది రైతాంగాన్ని మోసం చేసే బడ్జెట్ అన్నారు. విద్యారంగానికి 15 శాతం నిధులివ్వకపోడం బాధాకరమన్నారు. బిసి డిక్లరేషన్ ప్రకారం నిధులు కేటాయించలేదన్నారు. మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ ప్రకారం బిసిలకు రూ.16 వేల కోట్లు కేటాయించాలని కోరారు. అంబేద్కర్ అభయహస్తం, ఎస్‌సి, ఎస్‌టిలకు నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం మోసం చేస్తున్నదని తెలిపారు. పెన్షనర్లకు, సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు సరిపోవన్నారు. ఆదాయం రూ.2 లక్షల కోట్లకు మించదని, ఈ సారి కూడా రూ.50 వేల కోట్ల లోటు ఖాయమన్నారు. ఈ గ్యాప్‌ను పూడ్చడానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణకు 'హెచ్–సిటీ' ప్రణాళికలు

హైదరాబాద్‌లో ప్రధాన మౌలిక సదుపాయాలతో పాటు నగరంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు హెచ్‌సిటీ ప్రణాళికను అమలు చేయనున్నట్లు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రూ. 7.32 కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్ట్‌లో 31 ఫ్లైఓవర్లు, 17 అండర్ పాసెస్, పది రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే రూ.150 కోట్లతో సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌లో వరద నీటిని నివారించేందుకు రూ.5,942 కోట్ల వ్యయంతో సమగ్ర వరద నీరు పారుదల ప్రాజెక్ట్‌కు మంజూరు చేశామని, పట్టణాలలో వరద సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర నీటిపారుదల వ్యవస్థను అభివృద్ధి చేస్తోందని స్పష్టం చేసింది. మూసీ ప్రక్షాళనలో భాగంగా గోదావరి తాగు నీటి సరఫరా పథకం కింద గోదావరి జలాలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, జలాశయాలను నింపి, వాటిని పునరుజ్జీవింప చేసేందుకు అవసరమైన పనులు చేపడుతున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

స్పీడ్ ప్రాజెక్ట్‌లో 'మూసీ, మెట్రో రైలు'

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 19 ప్రాజెక్టలను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసేందుకు 'స్పీడ్'(స్మార్ట్, ప్రోయాక్టివ్, ఎఫిషియేంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) పరిధిలో పెట్టింది. ఇందులో మూసీ ప్రాజెక్ట్, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం, నూతన ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణం, మాదకద్రవ్యాల నిరోధక వ్యూహాల అమలు లాంటి ప్రాజెక్టలను 'స్పీడ్'లో చేర్చింది.

2025-26 బడ్జెట్, వివిధ శాఖలకు నిధుల కేటాయింపు ప్రతిపాదనలు	
రాష్ట్ర వార్షిక బడ్జెట్	రూ.3,04,965 కోట్లు
పన్ను ఆదాయం	రూ.1,45,419 కోట్లు
పన్ను యేతర ఆదాయం	రూ.31,618 కోట్లు
కేంద్ర పన్నుల్లో వాటా	రూ.29,899 కోట్లు
కేంద్రం గ్రాంట్లు	22,782 కోట్లు
శాఖలు	**కేటాయించిన నిధులు**
వ్యవసాయ, సహకార శాఖలు	రూ.24,439 కోట్లు
పశు సంవర్ధక, మత్స్య అభివృద్ధి శాఖ	రూ.1,674 కోట్లు
వెనుకబడిన తరగతుల (బిసి)సంక్షేమ శాఖ	రూ.11,405 కోట్లు
విద్యుత్ శాఖ	రూ.21,221 కోట్లు
అడవులు, పర్యావరణ, సైన్స్, టెక్నాలజీ శాఖ	రూ. 1,023 కోట్లు
ఆర్థిక శాఖ	రూ.54,008 కోట్లు
ఆహార, పౌరసరఫరాల శాఖ	రూ.5,734 కోట్లు
సాధారణ పరిపాలన శాఖ	రూ. 1,112 కోట్లు
వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ	రూ.12,393 కోట్లు
విద్యాశాఖ	రూ.23,108 కోట్లు
హోం శాఖ	రూ.10,188 కోట్లు
గృహ నిర్మాణం శాఖ	రూ.14,154 కోట్లు
పరిశ్రమలు, వాణిజ్య శాఖ	రూ.3,898 కోట్లు
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) శాఖ	రూ.774 కోట్లు
నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ	రూ.23,373 కోట్లు
కార్మిక, ఉపాధికల్పన శాఖ	రూ.900 కోట్లు
న్యాయ శాఖ	రూ.2,453 కోట్లు
మైనారిటీ సంక్షేమం శాఖ	రూ.3,591 కోట్లు
మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ	రూ.17,677 కోట్లు
పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ	రూ.31,605 కోట్లు
ప్రణాళిక శాఖ	రూ.3,863 కోట్లు
రెవెన్యూ శాఖ	రూ.2,369 కోట్లు
షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) సంక్షేమ శాఖ	రూ.40,234 కోట్లు
షెడ్యూల్ తెగలు (ఎస్‌టి) సంక్షేమ శాఖ	రూ.17,169 కోట్లు
రవాణా శాఖ	రూ. 4,485 కోట్లు
రోడ్లు, భవనాల శాఖ	రూ. 5,907 కోట్లు
మహిళా శిశు సంక్షేమ శాఖ	రూ.2,862 కోట్లు
దేవాదాయ శాఖ	రూ. 190 కోట్లు
క్రీడా శాఖ	రూ.465 కోట్లు
పర్యాటక శాఖ	రూ. 775 కోట్లు
చేనేత	రూ.371 కోట్లు

అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన
తెలంగాణ నమూనా

● బడ్జెట్‌లో ప్రస్తావించిన ప్రణాళికలు ఆర్థిక కేటాయింపులే కాదు ● సమాన అభివృద్ధికి, ఆర్థిక స్థిరత్వానికి, సామాజిక న్యాయానికి మార్గదర్శి ● విస్తృత ప్రజాప్రయోజనాలే పరమావధిగా పాలన సాగిస్తున్నాం ● ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : అభివృద్ధి, సంక్షేమం, సుపరి పాలన అనే మూడు అంశాలతో 'తెలంగాణ నమూనా' నేడు దేశం మొత్తానికే ఆదర్శంగా నిలిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బడ్జెట్‌లో ప్రస్తావించిన ప్రణాళికలు కేవలం ఆర్థిక కేటాయింపులు మాత్రమే కాదని, ఇవి సమాన అభివృద్ధికి, ఆర్థిక స్థిరత్వానికి, సామాజిక న్యాయానికి మార్గదర్శిగా నిలుస్తుందని చెప్పారు. సామాజిక న్యాయం, అభివృద్ధి,సంక్షేమ సమ్మిళిత విధానాలతో ప్రగతివైపు అడుగులు వేసేందుకు తమ ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తున్నదన్నారు. గత దశాబ్ద కాలంగా రాష్ట్రం ఎదుర్కొన్న అనేక సవాళ్లను అధిగమించి, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటలో కొనసాగుతోందన్నారు. శాసనసభలో ''2025 26 ఆర్థిక వార్షిక బడ్జెట్‌ను భట్టి విక్రమార్క మల్లు బుధవారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమను నమ్మి కట్టబెట్టిన అధికారాన్ని, తాము ఎవరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టకుండా, అధికార పీఠాన్ని హోదాగా భావించకుండా, ప్రజల జీవన స్థితిగతులను పెంచుతూ, మార్పు తీసుకొచ్చే బాధ్యతగా భావిస్తూ, వినమ్రంగా ప్రజలకు నిత్యం జవాబుదారీతనంతో ఉంటూ,విస్తృత ప్రజా ప్రయోజనాలే పరమావధిగా పాలనను సాగిస్తున్నామని వివరించారు. దశాబ్ద కాలం పాలనా వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక అరాచకత్వంతో కూడిన పాలనతో ఛిద్రమైన తెలంగాణ పాలనా ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెడుతూ,తెలంగాణ తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు, లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని తమ ప్రభుత్వం నిరంతరం పని చేస్తున్నదన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే గత పాలకులు సృష్టించిన సవాళ్లన్నింటినీ ఎదుర్కొని, తమ ప్రభుత్వం పరిపాలనా సత్తాను చాటుకుందని, అదే సమయంలో లోక్ సభ ఎన్నికలు రావడంతో, ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున అభివృద్ధి పనులకు కొంత విరామం ఏర్పడిందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణం 200 బిలియన్ డాలర్లు అని, రాబోయే పదేళ్ల కాలంలో దీనిని ఐదు రెట్లు అభివృద్ధి చేసి 1000 బిలియన్ డాలర్ (ట్రిలియన్‌డాలర్) వ్యవస్థగా రూపాంతరం చెందే దిశగా తమ కార్యాచరణ ఉంటుందన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ,తెలంగాణ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సినీ,టివి, నాటక కళారంగానికి ప్రతిష్టాత్మకంగా ఇచ్చే గద్దర్ ఫిలీం అవార్డులను వచ్చే నెలలోనే ఇవ్వబోతున్నామన్నారు. లోతుగా చర్చించి, విశ్లేషించి, ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకని నిర్ణయాలు తీసుకోవాలని, నేటి మన విధానాలే రేపటి తెలంగాణ నిర్మాణానికి ఉపకరిస్తాయని, లౌకిక విలువలను స్ఫూర్తిగా నమ్మిన కాంగ్రెస్ ప్రభుత్వం కుల, మత భేదం లేకుండా అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి వనరుల పంపకం జరగాలని, తద్వారా సమాజంలో అసమానతలు లేని వ్యవస్థ స్థాపన లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించామని వివరించారు. సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా పథకాన్ని అందిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా, అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేసి, గ్రామ సభలలో ధృవీకరించి, సాగుకు యోగ్యంకాని భూమిని గుర్తిస్తామని, తద్వారా వృధాను అరికట్టామని తెలిపారు.

పన్నుల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచండి

తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలకు పన్నుల పంపిణీలో వాటా తగ్గుతోందని భట్టి విక్రమార్క మల్లు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి 14వ ఆర్థిక సంఘం ద్వారా 2.437 శాతం నిధుల పంపిణీ జరిగితే, 15వ ఆర్థిక సంఘం కాలంలో ఇది 2.102 శాతానికి తగ్గిందని, అభివృద్ధిలో ముందున్న రాష్ట్రాలకు తక్కువ నిధులు కేటాయించడం అన్యాయమని, దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించే విధంగా పన్నుల పంపిణీ విధానాన్ని మరింత హేతుబద్ధంగా మార్చాలని, 16వ ఆర్థిక సంఘానికి ప్రతిపాదించిన విషయాన్ని భట్టి వివరించారు. కేంద్ర పన్నుల పంపిణీలో రాష్ట్రాలకు న్యాయమైన వాటాను కల్పించాలని, అలాగే రుణ స్థిరత్వం, మౌలిక సదుపాయాల అభివృద్ధి,సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు మరింత ఆర్థిక సహాయం అందించాలని ఆర్థిక సంఘానికి సమగ్ర నివేదికను సమర్పించామన్నారు. కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న సెస్సులు, అదనపు చార్జీలతో రాష్ట్రాలకు వస్తున్న ఆదాయం గణనీయంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రాలకు ఇస్తున్న 41 శాతం పన్నుల వాటాను 50 శాతానికి పెంచాలన్నారు. సమాంతర పన్నుల పంపిణీ సూత్రంలో సంస్కరణలు తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న 'తలసరి ఆదాయ దూరం' అనే ప్రాతిపదిక ప్రాధాన్యతను తగ్గించి,డిఎస్‌డిపి కి 50 శాతం వెయిటేజి ఇవ్వాలని కోరారు. దేశ ఆర్థిక వృద్ధికి గణనీయంగా సహకరిస్తున్న రాష్ట్రాలకుమరింత హేతుబద్ధంగా వనరులను అందించడం ద్వారా దేశ అభివృద్ధిని ప్రోత్సహించినట్టుగా ఉంటుందన్నారు.

కృష్ణా నీటిని వాడుకోవాలని గత ప్రభుత్వమే ఏపికి చెప్పింది

పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కృష్ణా,గోదావరి నీటి కేటాయింపులల్లో రాష్ట్రానికి రావాల్సిన న్యాయమైన వాటాను గత ప్రభుత్వం ఎటువంటి కార్యచరణ చేపట్టలేదని భట్టి విక్రమార్క మల్లు ఆరోపించారు. కృష్ణా జలాల్లోని 811 టిఎంసిలో 511 టిఎంసి నీటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వాడుకోవాలని గత పాలకులు అధికారికంగా చెప్పారని, తద్వారా తెలంగాణ రైతాంగానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ తక్కువ కేటాయింపులతో ఎక్కువ నీటిని వినియోగిస్తున్న విషయాన్ని తాము ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేందుకు ప్రాధాన్యత క్రమంలో ఎ, బి కేటగిరీలుగా విభజించామని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టును సేద్యంలోకి తీసుకురావాల్సి ఉన్నదని, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు నీటిని అందించేందుకు వీలుగా ఉదయ సముద్రం బ్రాహ్మణ వెలమల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించామని, ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి 6.70 టిఎంసిల నీటిని బ్రాహ్మణ వెలమల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు లిఫ్ట్ చేయబడుతుందని, ఈ ప్రాజెక్ట్ ద్వారా,94 గ్రామాల్లో లక్ష ఎకరాలకు సాగు నీటిని, ఫ్లోరైడ్ సమస్య ఉన్న 107 గ్రామాలకు తాగునీటిని అందిస్తామని వివరించారు. ఎస్. జైపాల్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా కెపి లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్నిప్రభుత్వం సత్వరం చేపడుతుందని, మూసీ ప్రాజెక్ట్ పరిధిలోని బునాదిగాని కాలువ పునరుద్ధరణ పనులకు రూ.266.65 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేశామని వివరించారు.

వాస్తవాలు ప్రచారంలో లేకపోతే అబద్ధమే నిజంగా మారుతుంది

వాస్తవాలను ప్రతి రోజూ ప్రచారంలో ఉండాలని, లేదంటే అబద్ధం కూడా నిజంగా మారి, రాష్ట్రాన్ని, దేశంతో పాటు ప్రపంచాన్ని కూడానాశనం చేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం చేసేప్రతి చర్యనూ శంకిస్తూ, నిరాధారమైన విమర్శలు చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారని, సోషల్ మీడియాలో, సొంత పత్రికలలో అబద్ధపు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి విమర్శలను సమర్థవంతంగా తిప్పికొడుతూ, వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం తమ బాధ్యత అని అన్నారు. నిజాన్ని ప్రజలకు చెప్పకపోతే, స్వార్థపరులు ప్రచారం చేసే అబద్ధాలే నిజాలుగా భ్రమించే ప్రమాదం ఉన్నదని, అందుకే, ఎప్పటికప్పుడు సత్యాలను ప్రజల ముందు పెడుతూ ముందుకు సాగుతున్నామన్నారు.

బడ్జెట్ హామీలకు అనుగుణంగా లేదు

ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలలో రెండు, మూడు తప్ప మిగిలిన వాటి ఊసు, ప్రస్తావన ఈ బడ్జెట్ లో కనిపించలేదని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు.రూ. 3 ,04 689 కోట్ల భారీ అంచనాల తో రాష్ట్ర ప్రభుత్వం తరపున మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెలు, కేటాయింపులు ఘనంగానే కనిపించినా.... పాత బడ్జెట్ తరహా లోనే కొత్త మాటలతో వున్నదని అభిప్రాయపడ్డారు. అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ లకు అనుగుణంగా బడ్జెట్ లేదన్నారు.నిరుద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించిన విషయం కూడా బడ్జెట్‌లో లేదన్నారు.

– సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా)

ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో రూ.56,084 కోట్లు

ప్రజాపక్షం / హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలకు 2025–26 బడ్జెట్‌లో రూ.56,084 కోట్లను కేటాయించింది. ఇప్పటివరకు పథకాల వారీగా నిధులను విడుదల చేసిన ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో ఆరు పథకాలకు నిధుల కేటాయింపులో స్పష్టతనిచ్చింది. వ్యవసాయ రంగంలో అత్యంత కీలకమైన రైతులకు ప్రభుత్వం భరోసాను ఇస్తూ 'రైతు భరోసా' పథకానికి అత్యధికంగా రూ.18 వేల కోట్లు, వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళల పెన్షన్ పథకమైన 'చేయూత' పథకానికి రూ.14,861 కోట్లను, సొంత ఇళ్లు లేని పేదలకు ఇళ్ల నిర్మాణానికి గాను 'ఇందిరమ్మ' పథకానికి రూ.12,571 కోట్లను ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. ఆర్‌టిసి బస్సులలో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన 'మహాలక్ష్మి' పతకానికి రూ.4305 కోట్లను, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాకు 'గృహజ్యోతి' పథకానికి రూ.2,080 కోట్లు, రైతులు పండిస్తున్న సన్న రకం ధాన్యానికి ఎకరాకు రూ.500 బోనస్ కోసం రూ.1,800 కోట్లు, పేదలకు ఉచిత వైద్యం అందించే 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకానికి రూ.1,143 కోట్లు, 'మహాలక్ష్మి పథకం' కింద ఎల్‌పిజి గ్యాస్ సబ్సిడీ చెల్లింపు కోసం రూ. 723 కోట్లు, భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఉద్దేశించిన 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకానికి రూ.600 కోట్లను ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఈ మేరకు శాసనసభలో బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క బడ్జెట్‌లో నిధులను ప్రతిపాదించారు.

బిసిలను నిరాశపరిచిన బడ్జెట్

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు బిసిలను నిరాశపరిచిందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. రూ. 3లక్షల 4 వేల 965 కోట్ల బడ్జెట్లో 56 శాతానికి పైగా ఉన్న బిసిల సంక్షేమానికి కేవలం రూ.11, 405 కోట్లు మాత్రమే ప్రతిపాదించడం అన్యాయమన్నారు. బిసిలకు స్థానిక సంస్థలలో, విద్యా ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ బిల్లులు శాసనసభలో చేసి బిసిల విశ్వాసాన్ని చూరగొని అభినందనలు అందుకున్న ప్రభుత్వం బడ్జెట్లో తగిన విధంగా నిధులు కేటాయిస్తుందని ఆశించడం జరిగిందన్నారు.చేనేత, గీత,మత్స్య, రజక, క్షౌర, గొర్రెల పెంపకం దారుల,వడ్రంగి,కమ్మరి, కుమ్మరి మొదలైన వారికి తగిన విధంగా బడ్జెట్ లో కేటాయింపులు పెంచాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

– తాటిపాముల వెంకట్రాములు

బడ్జెట్లో పెన్షనర్లు, ఉద్యోగస్తుల ఊసే లేదు!

బడ్జెట్లో పెన్షనర్ల, ఉద్యోగస్తుల ఊసే లేకపోవడం శోచనీయమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు ఎ. రాజేంద్ర బాబు, ప్రధానకార్యదర్శి ఎం.వి. నర్సింగరావు, ఆర్థిక కార్యదర్శి బి.నర్సయ్య ఒక పత్రికా ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. మూడు నాలుగు దశాబ్దాలు ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లి లబ్ధి చేకూర్చిన పెన్షనర్ల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం విడ్డూరం అని వారు ఆ పత్రికా ప్రకటనలో తమ ఆవేదన వ్యక్తపరిచారు. బడ్జెట్లో రాజకీయపరమైన విభేదాల మార్పు ఏమీ కనిపించలేదని, గత ప్రభుత్వాల మాదిరిగానే ఆలోచనాధార కొనసాగిందని వారు విమర్శించారు. ప్రభుత్వం చేసే పనులను ప్రజల వద్దకు తీసుకువెళ్లి ప్రచార కార్యక్రమం నిర్వహించే పెన్షనర్ల మద్దతు పొందే విధంగా ప్రభుత్వం తన విధానం మార్చుకోవాలని వారు సూచించారు.

– రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ

27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి...

తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం నూతన టూరిజం పాలసీని ప్రవేశపెట్టింది. సుమారు రూ.775 కోట్ల కేటాయింపులతో జిఎస్‌డిపిలో పర్యాటక రంగం వాటాను 10 శాతానికి పెంచడం, రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 3 లక్షల ఉద్యోగాలను సృష్టించడంతో పాటు, 2030 నాటికి 10 కోట్ల దేశీయ పర్యాటకులు, 5 లక్షల అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడం ఈ పాలసీ ప్రధాన ఉద్దేశ్యమని ప్రకటించింది. ఈ పాలసీలో భాగంగా రాష్ట్రంలో 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు, గోదావరి, కృష్ణా నదులపై జెట్టీలు, లాంచి స్టేషన్లు, వాటర్ స్పోర్ట్స్ హౌస్ బోట్లు, నదీ ఉత్సవాలను ప్రోత్సహిస్తూ, పర్యాటక రంగంలో పెట్టుబడులకు మూలధన సబ్సిడీలు, భూమి వినియోగ మార్పిడికి సంబంధించిన రాయితీలు ఇవ్వబడుతాయి. నల్లమలలో పర్యాటక ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.242 కోట్లతో పనులు చేపట్టింది

– బడ్జెట్‌లో టూరిజం పాలసీ

గిరిజనులకు తిలోధకాలు

అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలకు తిలోదకాలు ఇచ్చారని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో అధికారంలోకి రావడానికి చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. సమ్మక్క సారక్క పథకం కింద ప్రతి గిరిజన తండా, గూడెం పంచాయితీలకు రూ.25 లక్షలు ఇస్తామన్నారు అయితే ఈ బడ్జెట్లో దాని ఊసేలేదన్నారు. అంబేద్కర్ అభహస్తం కింద ప్రతి ఎస్‌టి కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామి కూడా తుంగలో తొక్కారని తెలిపారు. గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం గిరిజన సబ్ ప్లాన్‌కు రూ. 22,6 98 కోట్లు న్యాయంగా నిధులు రావాల్సి ఉండగా కేవలం 17, 169 కోట్లు మాత్ర మే కేటాయించి గొప్పగా కేటాయించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గారడి అంకెలు సంఖ్యలే తప్ప గిరిజనుల అభివృద్ధికి ఏ మాత్రం ఖర్చు కావని, గతేడాది బడ్జెట్లో 17, 065 కోట్లు కేటాయించగా ఈ ఏడాది కేవలం 104 కోట్లు మాత్రమే పెంచడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

– రమావత్ అంజయ నాయక్

యువజన రంగానికి అన్యాయం

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో యువజన రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలి ఉల్లాఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఎన్నికల మేనిఫెస్టలో ప్రకటించిన నిరుద్యోగ భృతి రూ. 4 వేలు ఇస్తామని ప్రకటించిందని, విద్యా, ఉపాధి కల్పనకు యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడం యువతలో ఆందోళన కలిగిస్తోందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. ఉపాధి రంగానికి కేవలం రూ. 900 కోట్ల నిధులు కేటాయించడం సరికాదన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల సత్వర భర్తీతో పాటు ఇతర రంగాలలో ఉపాధి కల్పించే దిశగా, ముఖ్యంగా మహిళలు, వెనుకబడిన వర్గాల యువత కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పి, బడ్జెట్‌లో కేవలం రూ. 465 కోట్లు మాత్రమే కేటాయించడం క్రీడల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. అంకెల గారడీతో మోసం చేస్తే ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుందన్నారు.

– ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలి ఉల్లాఖాద్రీ, ధర్మేంద్ర

విద్యారంగానికి బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. ప్రభుత్వం 3,04,965 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా, విద్యారంగానికి కేవలం 23,108 కోట్లు మాత్రమే కేటాయింపులు జరిపారని, 7.5 శాతం నిధులు మాత్రమే విద్యారంగానికి ప్రభుత్వం కేటాయించిందన్నారు. గత బడ్జెట్‌కి ఈ బడ్జెట్‌కి కేవలం 0.2 శాతం నిధులు కేవలం 1816 కోట్లు మాత్రమే పెంచారని, ఈ నిధులు విద్యారంగ అభివృద్ధికి ఏ మేరకు సరిపోవని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో విద్యాకు 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండో బడ్జెట్ కేటాయింపులో కూడా ఆ హామీ మేరకు అయిన నిధులు కేటాయించకపోవడం సరికాదన్నారు. బడ్జెట్ ప్రసంగంలో ఉన్నత విద్యా బలోపేతం, ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి ఊసేలేదన్నారు.

– ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

హోంశాఖకు రూ.10,188 కోట్లు

మంచిరేవులలో పోలీసు రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్ : అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో హోంశాఖకు ప్రభుత్వం రూ.10,188 కోట్లు ప్రతిపాదించింది. పోలీసు ఉద్యోగులు తమ పిల్లల చదువుల విషయంలో నిశ్చింతగా ఉండడానికి గాను సైనిక్ స్కూళ్ల మాదిరిగా రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామం లో యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ పాఠశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలతో,క్రీడా ప్రాంగణాలతో వసతీ సౌకర్యాలతోఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో పోలీసుల పిల్లలతో పాటు, పోలీస్ అమరవీరులు, అగ్నిమాపక, ఎక్సైజ్, స్పెషల్ ప్రొటెక్షన్, జైళ్ల విభాగాలలో పని చేసే వారి పిల్లలకు కూడా ప్రవేశం కల్పిస్తారు. క్షేత్ర స్థాయిలో అత్యంత కీలకమైన హోంగార్డుల రోజువారి వేతనాన్ని 921 రూపాయల నుండి 1,000రూపాయలకి పెంచారు. సహజ మరణం లేదా విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతిచెందిన హోం గార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందజేస్తారు. దీని ద్వారా, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్గుతుంది.

డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం 'మిత్రా యాప్'

డ్రగ్స్ రహిత తెలంగాణ సాధించే కార్యచరణలో భాగంగా, రాష్ట్ర ఐటి శాఖ, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టిజిఎన్‌బి) ల భాగస్వామ్యంతోమిత్ర యాప్‌ను రూపొందించారు. మాదక ద్రవ్యాలను వినియోగించే విద్యార్థులలో కనిపించే ప్రవర్తన లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఈ యాప్ సహాయ పడుతుంది. ఇది కృత్రిమ మేథఆధారంగా పని చేస్తుంది. ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాలలో ఉన్న 1,000 పాఠశాలలకు దీని ద్వారా సేవలు అందుతున్నాయి. త్వరలోనే దీనిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేస్తారు.

చేవెళ్ల డిక్లరేషన్ కేటాయింపుల్లేవు

ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్ అమలుకు బడ్జెట్‌లో కేటాయింపు జరగలేదని, అంబేద్కర్ అభయహస్తానికి ఏటా 750 కోట్ల రూపాయలు కేటాయిస్తామన్న వాగ్దానం నిలబెట్టుకోలేకపోయిందని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పేర్కొన్నారు. బడ్జెట్‌ను సవరించి దళితుల జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి వారి ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. 2023 24 బడ్జెట్లో 13,617 కోట్ల రూపాయలు ఖర్చు చేయలేదని ఆర్థిక మంత్రి శాసనసభలో ప్రకటించడం విడ్డురంగా ఉందన్నారు. కాగితాల్లో అంకెలుపెద్ద మొత్తాలలో పెంచుతున్నారని అవి ఖర్చు చేయని నిధులను సబ్ ప్లాన్ చట్టం ప్రకారంగా వచ్చే ఏడాది బడ్జెట్లో ఖర్చు చేయాలని చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని చెప్పారు.

– మారుపాక అనిల్ కుమార్

ప్రజాపక్షం
గురువారం, మార్చి 20

సమతౌల్యంతో కూడిన బడ్జెట్

కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం శాసనసభకు సమర్పించిన 2025–26 సంవత్సర బడ్జెట్ ప్రాధాన్యతల్లో, కేటాయింపుల్లో సమతూకాన్ని పాటించిందనవచ్చు. ఎన్నికల్లో వాగ్దానం చేసిన ఆరుగ్యారంటీలను అంచెలంచెలుగా అమలు చేయటానికి 'రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శక్తి' మేరకు ప్రయత్నిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ రెండవ బడ్జెట్‌లో సంక్షేమం – అభివృద్ధి మధ్య సమతౌల్యం పాటిస్తూ సమాజంలోని అన్ని విభాగాలకు లబ్ధి చేకూర్చేందుకు కసరత్తు చేసింది. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను వక్కాణిస్తూ ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క యావద్దేశానికి ఉత్తేజదాయకమైన తెలంగాణా నమూనాను నెలకొల్పేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని ఉద్ఘాటించారు. 'తెలంగాణ రైజింగ్ 2050' దార్శనికతతో నిలకడైన, మన్నికగల అభివృద్ధి సాధనకు తమ ప్రభుత్వం పాటుపడుతున్నదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ 'వికసిత్ భారత్, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్–2047తో ఈ ప్రభుత్వ విజన్ పోటీ పడుతున్నది. పుష్కరకాలం క్రితం 'గుజరాత్ మోడల్' అంటూ బహుళ ప్రచారంతో కేంద్రంలో అందలమెక్కిన బిజెపి ప్రధాని నరేంద్రమోదీ తమది కార్పొరేట్ అనుకూల ప్రభుత్వమని ఆచరణలో రుజువు చేసుకున్నారు. అయితే హిందుత్వ వాగాడంబరంతో, పథకాలకు అందమైన పేర్లతో దిగువస్థాయిలోని సామాజిక తరగతుల్లో ఆశలు రగుల్చుతూ అధికారం నిలుపుకుంటున్నారు. అందువల్ల, కాంగ్రెస్ ప్రభుత్వ 'తెలంగాణ రైజింగ్ 2050' అది ప్రకటించుకున్న పేదల అనుకూల ఇందిరమ్మరాజ్యం లక్ష్యంనుండి పక్కకు మరలకుండా అభివృద్ధి–సంక్షేమాలను సమపాళ్లలో మేళవించి, ఫలితాలను అర్హులకు అందించటంలో సఫలం కావాలని ఆశించుదాం. మొత్తం రూ.3,04, 965కోట్ల వ్యయం అంచనాతో ప్రతిపాదించిన బడ్జెట్‌లో రూ.2,26,982 కోట్లు రెవెన్యూ వ్యయం, రూ.36,504కోట్లు పెట్టుబడి (మూలధన) వ్యయం. ఒకప్పుడు బడ్జెట్లలో మూలధన వ్యయం గణనీయంగా ఉండేది. అయితే 1990వ దశకం తదుపరి దేశ ఆర్థికాభివృద్ధి నమూనా ప్రైవేటు పెట్టుబడిపై ఆధారపడుతున్నది. ప్రభుత్వాలు పారిశ్రామిక వేత్తలకు పోటీపడి రాయితీలిస్తూ, తామేమో సంక్షేమంపై కేంద్రీకరిస్తున్నాయి. ఇటీవల సంవత్సరాల్లో రాజకీయ పార్టీలు అధికారమే పరమావధిగా నగదు బదిలీ పథకాలను, ఉచితాలను పెంచుతున్నాయి. అది నేటి లక్షణం.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కులగణన సమగ్ర సర్వేను విజయవంతంగా నిర్వహించి, వెనుకబడిన తరగతులకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల రాజకీయాధికారంలో 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు, అలాగే సమన్యాయం దృష్టితో ఎస్‌సి రిజర్వేషన్‌లను వర్గీకరించే బిల్లుకు శాసనసభ, మండలి ఆమోదం పొంది కేంద్రం ఆమోదం కోసం పంపుతున్న నేపథ్యంలో ఈ వార్షిక బడ్జెట్ కూడా వనరుల పంపిణీలో సమన్యాయం కోసం ప్రయత్నించింది. మౌలిక రంగాలైన వ్యవసాయం, ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి, విద్య, వైద్యం, మౌలికవసతుల కల్పన గ్రామీణ, పట్టణాభివృద్ధి వగైరా రంగాలకు తగినంత మొత్తాలను కేటాయిస్తూనే సంక్షేమానికి పెద్ద పీట వేసింది. ఎస్‌సిల సంక్షేమానికి రూ.40,232కోట్లు, ఎస్‌టిల సంక్షేమానికి రూ.17,169కోట్లు, బిసిల సంక్షేమ డిపార్టుమెంటుకు రూ.11,405కోట్లు, మైనారిటీ సంక్షేమ డిపార్టుమెంటుకు రూ.3591 కోట్లు – వెరసి రూ.72,397కోట్లు కేటాయించింది.

యంగ్ ఇండియా సమగ్ర ఆశ్రమ పాఠశాలలు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ, రాజీవ్ యువ వికాసం (స్వయం ఉపాధి), రాజీవ్ యూత్ డెవలప్‌మెంట్ స్కీం, 119 నియోజకవర్గాల్లో అంబేద్కర్ నాలెడ్జి కేంద్రాలు, స్వయం సహాయక సంఘాలకు ఇస్తున్న ప్రోత్సాహం ప్రత్యేకించి ఎన్నదగినవి. అలాగే నీటిపారుదల రంగంలో నిర్మాణంలో ఉండి, గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిన ప్రాజెక్టులను త్వరితంగా పూర్తిచేసి రైతులకు ప్రయోజనం చేకూర్చే విధానం ప్రశంసనీయం.

అంతర్గత శక్తులతోనే హిందూమతానికి ప్రమాదం

డాక్టర్ అరుణ్ మిత్రా

విభిన్న విశ్వాసాలు, సంప్రదాయాలు సహజీవనం చేసే మన దేశంలో, హేతుబద్ధమైన ఆలోచన, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడం అత్యంత ప్రధానం. మూఢనమ్మకాలు, గుడ్డి ఆచారాలు, కర్మకాండలు అభివృద్ధి మార్గానికి ఆటంకం కలిగిస్తాయి. శాస్త్రీయ దృక్పథం కేవలం విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం మాత్రమే కాదు, సంఘటనలను హేతుబద్ధంగా విశ్లేషించే విధానం, లోతైన అవగాహన కోసం అన్వేషణ. కాబట్టి, పురోగతి కోసం ఏదైనా సమాజం జిజ్ఞాస సమ్మిళితం, అనుసరణీయంగా ఉండటం అవసరం. శాస్త్రీయ దృక్పథం మన దేశ రాజ్యాంగంలో 1976లో 42వ సవరణలో ప్రాథమిక విధుల కింద చేర్చబడింది. శాస్త్రీయ దృక్పథం, మానవతావాదం, ప్రశ్నించేతత్వం, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించడం 'భారతదేశంలోని ప్రతి పౌరుడి విధి' అని అది పేర్కొంది.

గత కొన్ని సంవత్సరాలుగా, ప్రశ్నించకూడదు లేదా విశ్లేషించకూడదు, కానీ గుడ్డి విశ్వాసంతో అనుసరించాలనే ధోరణిని పెంపొందించడానికి ప్రభుత్వం ఒక కథనాన్ని నిర్మిస్తోంది. అధికారిక గణాంకాలను విశ్వసిస్తే, ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాలో 50 కోట్లమంది అధిక కాలుష్యం తో కూడిన నీటిలో స్నానం చేయడమే కాకుండా, దానిని తాగారు. సీసాలలో నింపుకొని, ఇతరులకు 'చరణామృతం' గా తీసుకువెళ్ళి, వారి ఇళ్లలో చల్లారు, చుట్టు పక్కల వారికి ఇచ్చారు. ప్రభుత్వ సంస్థలు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి), సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) ఈ నీరు అధిక కాలుష్యంతో కూడుకున్నదని, స్నానానికి కూడా తగినది కాదని, తాగడానికి గురించి చెప్పనవసరం లేదని హెచ్చరించినా ఇవన్నీ జరిగాయి. బిహార్ కాలుష్య నియంత్రణ మండలి కూడా ఇలాంటి నివేదికను సమర్పించింది, బిహార్‌లోని గంగానదిలో చాలా చోట్ల స్నానానికి నీరు పనికిరాదని తెలిపింది.

'హిందూ' అనే పదం వాస్తవానికి ప్రాచీన కాలంలో ఇండస్ నది (సింధు నది) దాటిన భూమి, ప్రజలుగా గ్రీకులు, పర్షియన్‌లు పేర్కొనేవారు. పర్షియన్లు 'ఎస్' అని ఉచ్చరించలేకపోయేవారని, కాబట్టి వారు దానిని 'హెచ్' అని పలికారని చెబుతారు. కాబట్టి 'హిందూ' అనే పదం పర్షియనీకరించబడిన సింధు నది (ఇండస్‌నది) పేరు. 'హిందూయిజం' అనే పదం 19వ శతాబ్దంలో సాధారణ వాడుకలోకి వచ్చింది.

ఈ హెచ్చరికలు ఉన్నప్పటికీ, ప్రజలు విశ్వాసం పేరుతో, పరలోక లాభాలను పొందడానికి మలం, మూత్రంతో కలుషితమైన నీటిని ఆనందంగా సేవించటాన్ని కొనసాగించారు. ఇది గంగా నదిని శుభ్రం చేయడం గురించి ప్రభుత్వం చేసిన వాదనలను బహిర్గతం చేయడమే కాకుండా, అధికారంలో ఉన్న వ్యక్తులు వ్యాప్తి చేసే పురాణాలు, అశాస్త్రీయ ఆలోచనలతో మన సమాజం ఎంతగా ప్రభావితమవుతుందో కూడా తెలియజేసింది. ప్రజలు ఎంత అసహేతుకంగా, మందబుద్ధులుగా మారగలరనేది ఆందోళన కలిగించే విషయం.

కుంభమేళాలో ప్రజలు లోతుగా మునుగుతున్న సమయంలో మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే గంగా నది పరిశుభ్రత గురించి ప్రశ్నలు లేవనెత్తారు. ఆయన సామాజిక, రాజకీయ విశ్వాసాలు అందరికీ తెలిసినవే. అలాంటి వ్యక్తి నదిలో పవిత్ర స్నానం చేయడానికి నిరాకరించారు. 'మూఢనమ్మకం నుండి బయట పడండి.మీ మెదళ్లను సరిగ్గా ఉపయోగించండి' అని ఠాక్రే ప్రజలను కోరారు. ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా నుండి ఎంఎన్ఎస్ పార్టీ నాయకుడు బాలా నందగావ్కర్ తెచ్చిన పవిత్ర జలాన్ని తాగడానికి ఆయన నిరాకరించారు.

హిందూమతం ప్రమాదంలో ఉందని నేను ఏనాడూ భావించలేదు. ఎందుకంటే అది సర్వసమ్మిళితం, సంభాషణ ద్వారా దేన్నయినా తనలో ఇముడ్చుకోవటానికి అది సిద్ధంగా ఉంటుంది. కానీ కుంభమేళా తర్వాత, హిందూమతం చాలా లోతైన సంక్షోభంలోకి ప్రవేశిస్తుందనే భయం నాలో కలిగింది.

మానవ నాగరికత నీటి వనరుల చుట్టూ అభివృద్ధి చెందింది. అవి వారికి జీవనాధారం. అందుకే ప్రజలు కృతజ్ఞత వ్యక్తీకరణగా వివిధ ప్రదేశాలలో వివిధ రూపాల్లో నీటి వనరులకు విధేయత చూపారు. కుంభమేళా మొదట వివిధ విశ్వాసాల ప్రజలు, కరుణ, త్యాగంతో కలయికకు కేంద్రంగా ఉండేది. సముద్ర మథనానికి సంబంధించిన కుంభమేళా గురించి పౌరాణిక వర్ణన ఉన్నప్పటికీ, త్రివేణిలో స్నానంచేసే ఆచారాన్ని క్రమం తప్పకుండా నిర్వహించిన రాజు హర్షవర్ధనుడు. చైనా యాత్రికుడు హ్యూయెన్ త్సాంగ్ ఈ సంఘటనలను నమోదు చేసి, 606 నుండి 647 సిఇ మధ్య త్రివేణి సంగమంలో ప్రతి ఐదేళ్ళకు ఒకసారి పెద్ద మతపరమైన సమావేశాన్ని నిర్వహించిన హర్షవర్ధనుడి దాతృత్వం, భక్తిని వివరించాడు. 'ఇందులో విభిన్న అభిప్రాయాలు,విశ్వాసాలు కలిగిన ప్రజలు పాల్గొన్నారు. ఆయన తన వ్యక్తిగత సంపద, దుస్తులు, ఆభరణాలతో సహా, పేదలకు మరియు మతపరమైన సంస్థలకు విరాళంగా ఇచ్చాడు. అందువలన ఈ సంఘటన త్యాగం, కరుణకు ప్రతిబింబం.'

కానీ ఈసారి 'మహా కుంభమేళా'ను ఇతర మత సమూహాలపై, ముఖ్యంగా ముస్లింలపై అపోహలు, ద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రభుత్వం ఉపయోగించుకుంది. కుంభమేళా సమయంలో చాలా మంది ముస్లింలను వారి దుకాణాలను మూసివేయమన్నారు. అయినప్పటికీ హిందూ యాత్రికులకు స్థలం కల్పించడానికి వారిలో చాలా మంది మసీదులను తెరిచారనే వార్తలు వచ్చాయి. కాబట్టి వసుధైవ కుటుంబం, ప్రపంచ శాంతి గురించి మాట్లాడే హిందూ తత్వశాస్త్ర సారాంశం అబద్ధంగా మారిపోయింది.

'హిందూ' అనే పదం వాస్తవానికి ప్రాచీన కాలంలో ఇండస్ నది (సింధు నది) దాటిన భూమి, ప్రజలుగా గ్రీకులు, పర్షియన్‌లు పేర్కొనేవారు. పర్షియన్లు 'ఎస్' అని ఉచ్చరించలేకపోయేవారని, కాబట్టి వారు దానిని 'హెచ్' అని పలికారని చెబుతారు. కాబట్టి 'హిందూ' అనే పదం పర్షియనీకరించబడిన సింధు నది (ఇండస్ నది) పేరు. 'హిందూయిజం' అనే పదం 19వ శతాబ్దంలో సాధారణ వాడుకలోకి వచ్చింది. మొదట హిందువుల 'తత్వాన్ని' వివరించడానికి బయటి వ్యక్తులు ఆ పదాన్ని ఉపయోగించారు. చివరికి, ముస్లింలు, ఇతరుల నుండి తమను తాము వేరు చేసుకునేందుకు ఆ పదాన్ని హిందువులు ఉపయోగించారు. 'హిందూయిజం' అనే పదాన్నిఉపయోగించిన మొదటి భారతీయుడు 1816–17 లో రాజా రామ్ మోహన్ రాయ్ అయి ఉండవచ్చు. 1830 ప్రాంతంలో, కొంతమంది భారతీయులు తమను తాము 'హిందువు' అని పిలుచుకుంటూ 'హిందూయిజం'ను తమ మతంగా పిలవడం ప్రారంభించారు.

రాజా రామ్ మోహన్ రాయ్ పై డాక్టర్ రీతూ ఖోస్లా రాసిన వ్యాసంలో గుడ్డి విశ్వాసం, మూఢనమ్మకాలు, ఆచారాలకు అసలు హిందూ మతంలో తావు లేదని రాయ్ నిరూపించాలనుకున్నారని పేర్కొన్నారు. రాయ్ ప్రకారం, క్షీణిస్తున్న రాజకీయ, సామాజిక వాతావరణానికి కారణమైన మరొక అంశం భారతీయ సమాజ సామాజిక క్షీణత. సహనం, సానుభూతి, కారణం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలను గౌరవించే కొత్త భారతీయ సమాజాన్ని నిర్మించాలని ఆయన కోరుకున్నారు. (https://ebooks.inflibnet.ac.in/psp07/chapter/raja ram mohanroy the first modern/).

'హిందువుల భావజాలం, ఆచారాలలో చాలా వైవిధ్యం ఉంది. వారిలో ప్రకృతి ఆరాధకులు, విగ్రహారాధకులు, ఏ దైవిక శక్తిని నమ్మని వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. కానీ వీరందరూ ఒకరికొకరు వ్యతిరేకంగా ఎన్నడూ లేరు, ఇంకా చెప్పాలంటే సామరస్యంగా జీవించారు. వారు దూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల ఆలోచనలను కూడా అనుసరించారు, ఎప్పటికప్పుడు తమను తాము సుసంపన్నం చేసుకున్నారు. హిందూమతం ప్రేమ, కరుణను బోధించే, సమ్మిళితమైన బలమైన మతంగా అభివృద్ధి చెందింది. కానీ దీనికి ఒక బలహీనత కూడా ఉంది. అది సమాజాన్ని ఉన్నత, అగ్ర కులాలుగా విభజించడం. ఈ కారణంగా దాదాపు జనాభాలో నాలుగవ వంతు అణచివేయబడ్డారు.వారు కనీస మానవ హక్కులను కూడా కోల్పోయారు. ఈ హింస ఉన్నప్పటికీ, ఈ 25% జనాభాలో కొంతమంది ఇస్లాం, క్రైస్తవ మతం లేదా బౌద్ధమతం వంటి ఇతర మతాలను స్వీకరించినప్పటికీ, హిందూమతాన్ని ఆదరించడం కొనసాగిస్తున్నారు. డాక్టర్ అంబేద్కర్ కూడా తన చివరి రోజుల్లో బౌద్ధమతాన్ని స్వీకరించారు. కానీ ఆయన అనుచరులందరూ అతనితో చేరలేదు.'

అధికారంలో ఉన్న ప్రభుత్వం పదేపదే అశాస్త్రీయ కథనాలను నిర్మించడం, వ్యాప్తి చేయడం ద్వారా ప్రజలను కల్పనలలో నిమగ్నం చేసేందుకు కపటోపాయ ప్రయత్నం చేస్తోంది. ఇది హిందువుల మనస్తత్వాన్ని మధ్యయుగాల కాలానికి నెట్టివేస్తుంది. అందువల్ల, హిందూమతం బాహ్య శక్తుల వల్ల కాకుండా, ఛాందసభావాలను వ్యాప్తిచేస్తూ ఉండే అంతర్గత శక్తుల కారణంగా ప్రమాదంలో పడింది. వారి పథకాలను అర్థం చేసుకుని సైద్ధాంతిక పోరాటానికి ప్రణాళిక వేయవలసిన సమయం ఇది. ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రభు త్వం, వారి ఇతర సంస్థలు అటువంటి ఛాందసభావాల ను పెంపొందించడానికి, ప్రజలు ఆలోచించకుండా, వారి మెదడును తార్కికంగా ఉపయోగించకుండా చేయడానికి తొందరపడుతున్నాయి. ఆర్ఎస్ఎస్ బోధిస్తున్నది హిందూతత్వం కాదు, మతోన్మాదం, మూఢనమ్మకాలు, ఛాందసవాదం, హింస, ద్వేషం. ఇది హిందూమతం కాదు, దాని విలువలు, ఆచారాల తిరస్కరణ. వారి ప్రచారాన్ని సవాలు చేయాలి, లేనట్లయితే అతి ఎక్కువగా నష్టపోయేది హిందువులే. ***(ఐపిఎ సర్వీస్)***

నోటి అపరిశుభ్రతతో పలు అనారోగ్యాలు

ప్రపంచవ్యాప్తంగా 3.5 బిలియన్ల ప్రజలు నోటి సంబంధ అనారోగ్యాలతో సతమతం అవుతున్నారని, దంత సమస్యలు ప్రధానమైనవి తెలుస్తున్నది. నేటి ఆధునిక మానవ జీవితంలో నోటి శుభ్రతకు ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోతున్నది. తీవ్రమైన నోటి అపరిశుభ్రత కారణంగా గుండె జబ్బులు, మధుమేహం, శ్వాస సంబంధ వ్యాధులు కలుగుతున్నాయి. దంతాలు, చిగుర్ల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రజలకు అవసరమైన సరళ జీవనశైలి మార్పుల గూర్చి అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 20 మార్చి రోజున ప్రపంచ నోటి ఆరోగ్య లేదా శుభ్రత దినం (వరల్డ్ ఓరల్ హెల్త్ డే) నిర్వహించడం ఆనవాయితీగా మారిం ది.

నోటి శుభ్రతతో సంతోషకరమైన మెదడు:

2025 ప్రపంచ నోటి శుభ్రత దినం ఇతివృత్తంగా నోటి శుభ్రతతో సంతోషకరమైన మెదడు (ఏ హ్యాపీ మౌత్ ఈజ్ ఏ హ్యాపీ మైండ్) అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నోటి శుభ్రతను అశ్రద్ధ చేసినపుడు చిగుర్ల వ్యాధులు, క్యావిటీలు ఏర్పడడం, దంతాలు ఊడిపోవడం జరగడంతో నోటి దుర్వాసన వల్ల నవ్వుతూ మాట్లాడకపోవడం, సమాజంలో భయంతో గడపడం, ఆత్మవిశ్వాసం తగ్గడం, మానసిక ఆరోగ్యానికి అడ్డుపడడం జరుగుతుంది. నోటి అనారోగ్యాలు దీర్ఘకాలం కొనసాగితే ఆందోళన, ఒత్తిడి కలుగుతూ జీవన నాణ్యత కొరవడడం జరుగుతుంది.

నోటి ఆరోగ్యంతో దంత వ్యాధుల కట్టడి, గుండె జబ్బులు/మధుమేహం/శ్వాస వ్యాధుల కట్టడి, జీర్ణ క్రియ పెరగడం లాంటి విలువైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. నోటి శుభ్రత కోసం ప్రతి రోజు రెండుసార్లు బ్రష్ చేసుకోవడం, దంతాల్లో ఆహారం ఇరుక్కోకుండా జాగ్రత్త పడడం, తిన్నపుడు లేదా తాగినపుడు మౌత్ వాష్ చేసుకోవడం, చక్కెరలు/అమ్ల ఆహారాలను తగ్గించుకోవడం, సాఫ్ట్ బ్రష్‌లను వాడడం, సదా హైడ్రేట్ కావడం, తరుచుగా దంత వైద్యులను సంప్రదించడం లాంటి దినచర్యను పాటించాలి. ఈ విషయాల గూర్చి ఇతరులకు అవగాహన కల్పించడంవల్ల నోటి ఆరోగ్య భాగ్యాలు సిద్ధించి చిరునవ్వులతో జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.

(20 మార్చి ప్రపంచ నోటి శుభ్రత దినం సందర్భంగా)

జనక మోహన రావు దుంగ
8247045230

ఉపగ్రహ అంతర్జాలం ప్రయోజనకరమేనా?

మన దేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ అందించడానికి ఈ మధ్య కాలంలో జియో, ఎయిర్టెల్, టెలికాం సంస్థలు ఎలోన్ మస్క్ కంపెనీకి చెందిన స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నాయనే వార్తల నేపథ్యంలో అసలు ఈ ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ అంటే ఏమిటి? దీని ఉపయోగాలు, సవాళ్లు గురించి పరిశీలిద్దాం.

ఉపగ్రహ ఇంటర్నెట్: డిజిటల్ యుగంలో పట్టణ, మారుమూల కొండ ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి ఇంటర్నెట్ కీలకపాత్ర పోషిస్తుంది. మారుమూల ప్రాంతానికి సాంప్రదాయ ఇంటర్నెట్ అందించడం సాధ్యం కాదు. ఇటువంటి ప్రాంతాలకు అంతర్జాలం అందుబాటులోకి తేవడానికి ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ అవకాశాన్ని కల్పిస్తుంది. ఇది వినియోగదారులకు ఇంటర్నెట్ సేవలను అందించడానికి భూమి చుట్టూ తిరుగుతున్న ఉపగ్రహాలపై ఆధారపడే ఒక రకమైన ఇంటర్నెట్ కనెక్షన్. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు అంతరిక్షంలో ఉన్న ఉపగ్రహానికి ఇంటర్నెట్ సిగ్నల్‌ను పంపుతారు. ఈ ఉపగ్రహం భూమిపై నెట్‌వర్క్ ఆపరేషన్స్ సెంటర్ (నాక్) అని పిలువబడే ప్రదేశానికి డేటాను ప్రసారం చేయడానికి, స్వీకరించడానికి బాధ్యత వహిస్తుంది. నాక్ అనేది ఇంటర్నెట్ లేదా ప్రైవేట్ నెట్‌వర్క్‌కు అనుసంధానించబడి ఉంటుంది. ఒక కాంపాక్ట్ డిష్ ద్వారా డేటా ట్రాన్స్‌మిషన్, రిసెప్షన్‌ను అనుమతిస్తుంది. ఇది భూమధ్యరేఖకు 22,300 మైళ్ల ఎత్తు లో ఉన్న జియోస్టేషనరీ ఉపగ్రహంతో కమ్యూనికేట్ చేస్తుంది. ఈ సంకేతాలు వినియోగదారుల వద్ద ఏర్పాటు చేయబడ్డ డిష్ ద్వారా మోడెమ్ నుండి కంప్యూటర్‌కు ఇంటర్నెట్ సిగ్నల్స్ అందుతాయి. ఈ ప్రక్రియ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్‌కు తిరిగి వెళ్లి ప్రతిసారీ పునరావృతమవుతుంది. తద్వారా ఇంటర్నెట్‌కు చేరుకునే ముందు ఉపగ్రహ డిష్ అనేది కక్ష్యలో ఉన్న ఉపగ్రహం మధ్య కమ్యూనికేషన్‌లకు మధ్యవర్తిగా పనిచేస్తుంది.

ఉపగ్రహాల పాత్ర: ఉపగ్రహ ఇంటర్నెట్ సేవ సాధారణంగా వ్యక్తిగత వినియోగదారులకు భూస్థిర ఉపగ్రహాల ద్వారా అందించబడు తుంది. ఇవి సాపేక్షంగా అధిక డేటా వేగాన్ని అందిస్తాయి. కొత్త ఉపగ్రహాలు సెకనుకు 506 మెగాబిట్స్ వరకు డౌన్ స్ట్రీమ్ డేటా వేగాన్ని సాధించడానికి 'క్యు' (కెయు) బ్యాండ్‌ని ఉపయోగిస్తాయి. అంతరిక్షంలో ఒక నిర్దిష్ట బిందువు వద్ద ఉపగ్రహాన్ని భూమి నుండి కదలకుండా కనిపించే కక్ష్యలో ఉంచుతారు. దీని ఫలితంగా ఉపగ్రహం భూమి చుట్టూ ఒక కక్ష్యను ఖచ్చితంగా 24 గంటల్లో లేదా ఒక రోజులో పూర్తి చేస్తుంది. భూస్థిర ఉపగ్రహాలు ప్రత్యేకంగా భూమి యొక్క భూమధ్యరేఖకు నేరుగా 22,300మైళ్ల ఎత్తులో ఉంచబడతాయి. ఉపగ్రహం ద్వారా పంపబడిన సమాచారం కాంతి వేగంతో కదులుతుంది. ఇది సెకనుకు 1,86,000 మైళ్ళు. అయితే కక్ష్యలో ఉన్న ఉపగ్రహం భూమి నుండి ఉండే ఈ దూరాన్ని నాలుగు సార్లు ప్రయాణించాలి. అంటే కంప్యూటర్ నుండి ఉపగ్రహానికి, ఉపగ్రహం నుండి నాక్ లేదా ఇంటర్నెట్‌కు, అక్కడ నుండి ఉపగ్రహానికి, చివరకు ఉపగ్రహం నుండి కంప్యూటర్‌కు తిరిగి వెళ్ళాలి. ఈ మొత్తం ప్రయాణాన్ని పూర్తి చేయడానికి పట్టే సమయాన్ని జాప్యం అంటారు. ఇది దాదాపు అర సెకను.

ప్రయోజనాలు: సాంప్రదాయ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు అందుబాటులో లేని ప్రాంతాలకు చేరుకోవడం ద్వారా ప్రపంచ ఇంటర్నెట్ కనెక్టివిటీకి మద్దతు ఇచ్చే శక్తివంతమైన సాంకేతికతగా మారింది. స్థిర ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలు లేకుండా తరచుగా ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్లేవారికి, వ్యాపారాలు, ప్రభుత్వ సంస్థలు, హై స్పీడ్ ఇంటర్నెట్ యాక్సెస్ అవసరమయ్యే వ్యక్తులకు, సమాచార ప్రసారానికి, ప్రభుత్వ సంస్థలను అనుసంధానించడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సవాలుతో కూడిన వాతావరణాలలో, అత్యవసర సమయాల్లో కూడా నిరంతరాయంగా ఇంటర్నెట్ సదుపాయాన్ని ఆస్వాదించవచ్చు. ఆర్థిక అభివృద్ధి, విద్య, కమ్యూనికేషన్ ను ప్రోత్సహించడంలో సహాయపడతాయి. స్థిరమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ అవసరమైన సముద్ర, విమానయాన పరిశ్రమలలో కూడా ఉపగ్రహ ఇంటర్నెట్ ఉపయోగపడుతుంది.

సవాళ్లు–పరిమితులు: ఉపగ్రహ ఇంటర్నెట్ ప్రధాన లోపాలలో ఒకటి జాప్యం. ఇది వినియోగదారు పరికరం అంతరిక్షంలో ఉపగ్రహం మధ్య డేటా సిగ్నల్‌లను ప్రసారం చేయడంలో ఆలస్యాన్ని సూచిస్తుంది. ఇది భూసంబంధమైన నెట్‌వర్క్‌లతో పోలిస్తే నెమ్మదిగా కనెక్షన్ వేగానికి దారితీస్తుంది. ఇది ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్ లేదా వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి రియల్‌టైమ్ కమ్యూనికేషన్ అవసరమయ్యే కార్యకలాపాలపై ప్రభావం చూపుతుంది. పరికరాలు, సేవా ప్రణాళికల ఖర్చు, సెటప్ చేయడానికి సాధారణంగా ఉపగ్రహ డిష్ పరికరాలు, ఇన్‌స్టాలేషన్ ఫీజులు, నెలవారీ సబ్‌స్క్రిప్షన్, ఖర్చులలో ప్రారంభ పెట్టుబడి అవసరం. ఇది మన దేశంలో చాలా ఖరీదైనది కావచ్చు. బ్యాండ్‌విడ్త్ పరిమితులు, జాప్యం సమస్యలు, వాతావరణ జోక్యం, సిగ్నల్ అంతరాయాలు, వేగ వైవిధ్యాలు, భద్రతా సమస్యలు, గోప్యతా ప్రమాదాలు ఉపగ్రహ ఇంటర్నెట్ యొక్క కీలక సవాళ్లు. ఈ అడ్డంకులు సజావుగా కనెక్టివిటీకి ఆటంకం కలిగిస్తాయి. సంకేతాలు భూమి, ఉపగ్రహాల మధ్య చాలా దూరం ప్రయాణించాలి. ముఖ్యంగా జియో స్టేషనరీ ఎర్త్ ఆర్బిట్ (జియో) ఉపగ్రహాలతో గుర్తించదగిన జాప్యాలు ఏర్పడతాయి. బ్యాండ్‌విడ్త్ పరిమితులు ఇంటర్నెట్ కనెక్షన్ సామర్థ్యం, వేగాన్ని ప్రభావితం చేస్తాయి. వర్షం, మంచు, ఇతర వాతావరణ పరిస్థితులు సిగ్నల్ ప్రసారానికి అంతరాయం కలిగించవచ్చు. ఉపగ్రహ ఇంటర్నెట్‌కు అవసరమైన పరికరాలు, ఉపగ్రహ డిష్ సంస్థాపనతో సహా ఖరీదైనవి కావచ్చు. ఉపగ్రహాలకు స్పష్టమైన లైన్‌ఆఫ్‌సైట్ ఉన్న ప్రాంతాలలో ఉపగ్రహ ఇంటర్నెట్ అత్యంత ప్రభావవంతంగా ఉంటుంది. ఇంటర్నెట్‌కోసం వేలాది ఉపగ్రహాలను ప్రయోగించడం వల్ల అంతరిక్ష శిథిలాల గురించి ఢీకొనే అవకా శం గురించి ఆందోళనలు తలెత్తుతున్నాయి. ఉపగ్రహాలు జామింగ్, హ్యాకింగ్, ఇతర సైబర్ దాడులకు గురవుతా యి. ఇవి ఇంటర్నెట్ కమ్యూనికేషన్‌కు అంతరాయం కలిగిస్తాయి.

ఉపగ్రహ ఇంటర్నెట్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి, అమలు చేయడానికి అయ్యే అధిక వ్యయం కొన్ని కంపెనీల ప్రవేశానికి అడ్డంకిగా ఉంటుంది. ఇవన్నీ వినియోగదారు అనుభవాన్ని ప్రభావితం చేస్తాయి. కార్యాచరణ అడ్డంకులను కలిగిస్తాయి. వీటిని అధిగమించడానికి ఉపగ్రహ ఇంటర్నెట్ యాక్సెస్‌ను మెరుగుపరచడానికి డిజిటల్ అంతరాన్ని సమర్థవంతంగా తగ్గించడానికి వినూత్న పరిష్కారాలు, నియంత్రణ అమరిక సాంకేతిక పురోగతులు అవసరం.

ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలకు పూర్వవైభవం

ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలైన డైట్, బి.ఎడ్ ఐఎఎస్ఇ, సిటిఇ, ఎన్‌సిఇఆర్టీలలో 30 శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ కోసం నోటిఫికేషన్ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్సీ) ద్వారా వెలువరించనున్నట్లు ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయం. గత పది సంవత్సరాల నుండి పదవీ విరమణలు జరుగుతున్నాయనే తప్ప నూతనంగా ఉపాధ్యాయుల, ఉపన్యాసకుల, ఆచార్యుల పోస్టులు భర్తీ కావడం లేదు.

తెలంగాణ రాష్ట్రంలోని పూర్వ పది జిల్లాలలో పది డైట్ కళాశాలలు ఉన్నాయి. అన్ని డైట్ కళాశాలల్లో 90 శాతం ఉపాధ్యాయుల, ఉపన్యాసకులు (లెక్చరర్స్), సీనియర్ లెక్చరర్స్, ప్రొఫెసర్(ఆచార్యుల) పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడానికి ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. గత దశాబ్దకాలంగా ప్రతి సంవత్సరం డైట్ కళాశాలల్లో, బి.ఎడ్ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేయడం ఎంతోమంది ఉపాధ్యాయ ఉద్యోగం కోసం ఎన్నో ఆశలతో దరఖాస్తు చేయడం, ప్రవేశ పరీక్ష నిర్వహించి అడ్మిషన్లు పూర్తిచేయడం చేస్తున్నారు. వారికి నామమాత్రపు శిక్షణ, కొన్ని కళాశాలల్లో అసలే శిక్షణ లేకుండా పరీక్షలను నిర్వహించి సర్టిఫికెట్‌లు జారీ చేస్తున్నారు. డైట్ కళాశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించడం, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను డిప్యూటేషన్ మీద తీసుకొని నామమాత్రపు శిక్షణ ఇచ్చి ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థులకు బోధించడానికి ఎస్జీటీ ఉపాధ్యాయులుగా నియమిస్తున్నారు. గతంలో బి.ఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్రాథమిక పాఠశాలల్లో అంటే ఒకటి నుంచి ఐదవ తరగతులకు బోధించడానికి ఎస్జీటీ ఉపాధ్యాయులుగా నియమించేవారు. కొంతమంది డైట్ కళాశాలల్లో డైట్ శిక్షణ తీసుకున్న అభ్యర్థులు ప్రాథమిక పాఠశాలలలో బి.ఎడ్ చేసిన వారికి అవకాశం ఇవ్వడంతో తమకు అవకాశం రావడం లేదని తెలంగాణ ఉన్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించి ప్రాథమిక పాఠశాలల్లో డైట్ కళాశాలల్లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని కేసు వేయడం జరిగింది. తెలంగాణ ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ప్రాథమిక పాఠశాలలలో డైట్ కళాశాలల్లో శిక్షణ తీసుకున్న ఛాత్రోపాధ్యాయులను మాత్ర మే నియమించాలని బి.ఎడ్ చేసిన ఛాత్రోపాధ్యాయులకు అవకాశం ఇవ్వరాదని ఉత్తర్వులు జారీ చేసింది. బి.ఎడ్ చేసిన అనేకమంది ఛాత్రోపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలలలో అవకాశం ఇవ్వకపోవడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని మన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టును ఆశ్రయించడం జరిగింది. సుప్రీంకోర్టులో వాద వివాదాలు జరిగిన తర్వాత ప్రాథమిక పాఠశాలల్లో, డైట్ కళాశాలల్లో శిక్షణ తీసుకున్న ఛాత్రోపాధ్యాయులకు మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలని జడ్జిమెంట్ ఇవ్వడం జరిగింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డైట్ కళాశాలల్లో మిగతా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో 30 శాతం డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రకటించడంతో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ

చేయాలనే నిబంధనలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డైట్ కళాశాలల్లో, మిగతా ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయుల భర్తీకోసం నోటిఫికేషన్ విడుదల చేసేముందు ఇన్ సర్వీస్ లో ఉన్న అనేక మంది ఉపాధ్యాయులు పి.జి లు, పిహెచ్.డి లు, ఎం.ఎడ్‌లు,స్లెట్, నెట్, జెఆర్ఎఫ్ అన్ని అర్హతలు కలిగి పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ డైట్ కళాశాలల్లో, ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా 30 శాతం పోస్టుల భర్తీ కంటే ముందు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులతో 70 శాతం పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను పేద, బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల విద్యార్థులకు అందించడానికి బడ్జెట్‌లో కోట్ల రూపాయలను మంజూరు చేస్తుంది. ఉపాధ్యాయులకు శిక్షణ లేకపోతే నాణ్యమైన విద్యను అందించలేకపోవడమే కాకుండా కొన్ని తరాల వరకు విద్యార్థులకు విద్య రాకుండా పోతుంది. గత దశాబ్ద కాలంగా తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయులను ఉపన్యాసకులను ఆచార్యులను నియమించకపోవడమే దీనికి కారణమని చెప్పవచ్చు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ, ఎస్సీఈ ఆర్టీ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాలలలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు, ఉన్నత పాఠశాలలలో బోధించే స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లలో ఒక్క రోజు శిక్షణ పేరుతో శిక్ష వేస్తున్నారు. పుండు ఒక దగ్గర ఉంటే మందు మరోచోట పెట్టినట్లు ఉందని అనేక మంది విద్యారంగ నిపుణులు అంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ వీలైనంత త్వరగా డైట్ కళాశాలల్లో, ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో 70 శాతం ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నూతన విద్యా విధానం న్యూ ఎడ్యుకేషన్ ఫాలసి 2020 (ఎన్ఇపి 2020) అమలు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర కేబినెట్ మంత్రులు కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. న్యూ ఎడ్యుకేషన్ పాలసి 2020 (ఎన్. ఇపి 2020) ప్రకారం 5+3+3+4 ప్రకారం శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డైట్ కళాశాలల్లో ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయులను, ఉపన్యాసకులను, ఆచార్యులను పదోన్నతుల ద్వారా, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీచేసి ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు కోరుతున్నారు.

సాహెబ్ జాదా శేఖర్(ఎస్.ఎస్)
9290826988

అభివృద్ధి కోసం అధిక తలసరి వృద్ధిని చూపిస్తారా?

రాష్ట్రాల తీరుపై సుప్రీంకోర్టు విస్మయం
నిజమైన లబ్ధిదారులకే ప్రభుత్వ సబ్సిడీ ప్రయోజనాలు చేరాలి
ప్రస్తుతం రేషన్‌కార్డు 'పాప్‌లారిటీ కార్డు'గా మారిపోయిందని
జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్య

న్యూఢిల్లీ : ప్రభుత్వ సబ్సిడీ ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే చేరాలని బుధ వారం సుప్రీంకోర్టు రాష్ట్రాలకు హితవు పలికింది. అభివృద్ధి సూచికను హైలెట్ చేయమని అడిగిన ప్పుడు రాష్ట్రాలు అధిక తలసరి వృద్ధిని చూపిం చాయి కానీ, సబ్సిడీల విషయానికి వస్తే వారి జనాభాలో 75శాతం మంది దారిద్ర్య రేఖకు దిగు వన (బిపిఎల్) ఉన్నారని సుప్రీంకోర్టు తెలియజే సింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌లతో కూడిన ద్విసభ ధర్మాసనం మాట్లాడుతూ రాష్ట్రా లకు ఈ హితబోధ చేసింది. 'అర్హతలేని వారి నుండి నిజమైన పేదలకు ప్రయోజనం చేకూరు తుందా అనేది మా ఆందోళన. రేషన్‌కార్డు ఇప్పుడు పాపులారిటీ కార్డుగా మారింది' అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ రేషన్‌కార్డులను మేం చాలా జారీచేశాం. కొన్ని రాష్ట్రాలు ఏవైతే ఉన్నాయో వారి అభివృద్ధిని చూపిస్తూ వారు మా తలసరి ఆదాయం పెరుగుతున్నదని చెబుతున్నారు. 'మేం ఎప్పుడైతే దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి గురించి మాట్లాడినప్పుడు ఈ సంఘర్షణ శాశ్వత లక్షణం కలిగి ఉన్నదిగా కనిపిస్తున్నది. వాస్తవా లను చెప్పండి. నిజమైన లబ్ధిదారులకు ప్రయోజ నాలు చేకూరుతున్నాయని మేం నిశ్చయించగల గాలి' అని ధర్మాసనం పేర్కొంది. కోవిడ్ 19 విప త్కర సమయంలో వలస కార్మికుల కష్టాలను పరి ష్కరించడానికి ప్రారంభించిన సుమోటో కేసుకు సంబంధించిన విచారణ ఇది. న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ కొంతమంది పిటిషనర్ల తరపున హాజరై తన వాదనలు వినిపిస్తూ ఈ అంశం ప్రజల ఆదాయంలో అసమానతల నుంచి అసా ధారణంగా ఉద్భవించింది అని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

ఇతర జనాభా ఆదాయ గణాంకాలతో పోలిస్తే రాష్ట్రం మొత్తం ఆదాయం సగటున ఉన్న కొద్ది మందికి మాత్రమే భారీ సంపద ఉన్నది. ధనవం తులు మరింత ధనవంతులుగా మారుతూనే ఉన్నా పేదవారు మాత్రం మరింత పేదలుగానే ఇప్పటికీ మిగిలిపోతున్నారు' అని జస్టిస్ సూర్య కాంత్ చెప్పారు. ప్రభుత్వానికి సంబంధించిన 'ఈ శ్రమ్'పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మి కుల సంఖ్య దాదాపు 8 కోట్లమంది ఉన్నారని, వారందరికీ ఉచిత రేషన్ ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాస నానికి విన్నవించారు. దీనిపై స్పందించిన జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ 'రేషన్ కార్డుల జారీలో రాజకీయ అంశాల జోక్యం ఉండకూడ దని మేం ఆశిస్తున్నాం. నేను నా మూలాలను కోల్పోలేదు. నేనెప్పుడూ ఎల్లప్పుడూ పేదలుగానే మిగిలిపోతున్న వారి కష్టాల గురించి తెలుసుకో వాలని మాత్రం కోరుకుంటాను' అని ఆయన తన ఆవేదనను స్పష్టం చేశారు. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ 2011 జనాభా లెక్కలపైనే కేంద్రం ఆధారపడి కొనసాగుతోందని, ఉచిత రేషన్ అవసరమని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కేటగిరీలకు దూరంగా ఉన్నందువల్లే కేంద్రం 2021 జనాభా లెక్కలను నిర్వహించలేదనే వాదన వినిపించారు.

కేంద్రం తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్‌ఎఫ్ఎస్ఎ) కింద దాదాపు 81.35 కోట్లమంది ప్రజలకు ప్రభుత్వం ఉచిత రేషన్ అందజేస్తున్నదని చెప్పారు. మరో 11కోట్ల మందికి కూడా ఈ స్కీమ్‌ను వర్తింపజేయ నున్నదని ధర్మాసనానికి తెలియజేశారు. పేద ప్రజలకు ఉచిత రేషన్ పంపిణీపై కేంద్రం తన స్పందన తెలియజేస్తూ ప్రస్తుత స్థితిని ఫైల్ చేయా లని కోరుతూ ఈ అంశంపై విచారణను వాయిదా వేసింది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద 81కోట్లమంది ప్రజలకు ఉచిత, సబ్సిడీ రేషన్ అందజేస్తున్నామని కేంద్రం తెలియజేసినప్పుడు సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

అసోంలో కొత్త యూరియా ప్లాంట్

మహారాష్ట్ర జెఎన్‌పిటి పోర్టుతో అనుసంధానికి ఆరు లేన్ల నిర్మాణం
చార్జీ రహిత రూ.2వేల లోపు యుపిఐ లావాదేవీలకు ఆమోదం
కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ : అసోంలో రూ.10,601.4 కోట్ల అంచనా వ్యయంతో యూరియా ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.4,500 కోట్ల పెట్టుబడితో జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ (జెఎన్‌పిటి) పోర్టుతో అనుసం ధానం చేసేలా ఆరు లేన్ల హైవే ప్రాజెక్టుకు అంగీక రించింది. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్ మెంట్ (ఎన్‌పిడిడి) పునఃపరిశీలనకు ఒప్పుకు న్నది. చిరువర్తకుల కోసం తక్కువ విలువగల యుపిఐ లావాదేవీలను ప్రోత్సహించేలా ఇన్‌సెం టివ్ పథకాన్ని, పశుసంవర్ధక రంగంలో వృద్ధిని పెంపొందించేలా పునఃపరిశీలించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జిఎం)ను కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం భేటీ అయింది. అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది.

నామ్‌రూప్‌లో కొత్త యూరియా కాంప్లెక్స్ :
యూరియా ఉత్పత్తిలో దేశాన్ని స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడం కోసం నామ్‌రూప్ అసోంలోని బ్రహ్మ పుత్ర వ్యాలీ ఫెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ (బివి ఎఫ్‌సిఎల్) ఆవరణలోనే కొత్తగా బ్రౌన్‌ఫీల్డ్ అమో నియా యూరియన్ కాంపెక్స్ ఏర్పాటునకూ కేబి నెట్ ఆమోదించింది. దీని వార్షిక సామర్థ్యం 12.7లక్షల మెట్రిక్ టన్నులు. నామ్‌రూప్4 ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చేందుకు 48 నెలల సమయాన్ని కేటాయించినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (డిపిఇ) మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత పరిమిత లకు అనుకూలంగా 18 శాతం మినహాయింపుతో నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్‌ఎఫ్ఎల్) వాటాలో భాగాస్వామ్యాన్ని కూడా కేబినెట్ ఆమో దించింది. ఉమ్మడి వెంచర్‌లో అసోం ప్రభుత్వం వాటా 40 శాతంగా ఉంటే, బివిఎఫ్‌సిఎల్‌కు 11 శాతం, హిందుస్థాన్ ఉర్వారక్ రసాయన్ లిమి టెడ్ (హెచ్‌యుఆర్ఎల్)కు 13 శాతం, ఎన్ఎఫ్ఎ ల్‌కు 18 శాతం, ఆయిల్ ఇండియా లిమిటెడ్‌కు 18 శాతం చొప్పున భాగస్వామ్యం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా దేశీయంగా యూరియన్ ఉత్పత్తి పెరుగుతుందని, ఈశాన్యం, బీహార్, పశ్చిమ బెంగాల్, తూర్పు యుపి, జార్ఖండ్ అవసరాలు తీరుతాయని ప్రకటన వెల్లడించింది.

రూ.4,500 కోట్లతో ఆరు లేన్ల హైవే :
మహారాష్ట్ర జెఎన్‌పిటి పోర్టు (పగోటే)ను చౌక్ (29,219 కిమీలు) అనుసంధానం చేసేలా గ్రీన్ ఫీల్డ్ హై స్పీడ్ నేషనల్ హైవే ఆధ్వర్యంలో ఆరు లేన్ల నిర్మాణానికి కేంద్ర కేబినెట్ పచ్చ జెండా ఊపింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.4,500.62 కోట్లు అని అధికారిక ప్రకటన తెలిపింది. జెఎన్‌పిటి పోర్టులో కంటైనర్లు పెర గడం, నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి క్రమంలో ఆరు లేన్ల నిర్మాణం అనివార్య మైనట్లు పేర్కొంది. ప్రస్తుతానికి పోర్టు నుంచి ఎన్ హెచ్ 48 జిక్యూ సెక్షన్‌కు, ముంబైపూనే ఎక్స్‌ప్రె స్‌వే వెళ్లేందుకు 23గంటల సమయం పడుతుంది. పలాస్పే ఫటా, డి పాయింట్, కలంబోలి జంక్షన్, పన్వేల్‌లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం. ఈ మార్గాల మధ్య ప్రయాణ సమ యాన్ని తగ్గించేలా కొత్త ప్రాజెక్టు దోహదమవు తుంది. జెఎన్‌పిటి పోర్టు (ఎన్‌హెచ్ 348) పగోటే గ్రామం నుంచి మొదలయ్యే ఈ ప్రాజెక్టు ముంబై పూనే హైవే (ఎన్‌హెచ్ 48) వద్ద ముగుస్తుంది. మధ్యలో ముంబై పూనే ఎక్స్‌ప్రెస్ వే, ముంబైగోవా ఎన్‌హెచ్ 66ను కలుపుతుంది.

డెయిరీ ఆధునికీకరణకు ఎన్‌డిడి
కేంద్ర పథకంగా రివైజ్డ్ నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ (ఎన్‌పిడిడి)కి కేబినెట్ ఆమోదం లభించింది. 15వ ఆర్థిక కమిషన్ చక్రంలో (2021–22 నుంచి 2025–26 వరకు) రూ.2,790 కోట్ల బడ్జెట్‌తో దీనిని అమలు చేస్తారు. డెయిరీ మౌలిక వసతుల ఆధునికీకరణ, విస్తరణకు, ఈ రంగ సుస్థిరాభివృద్ధిపై దృష్టితోనే ఈ పథకాన్ని చేపట్టనున్నారు. ఈ పథకం వల్ల గ్రామీణ జీవనోపాధి మెరుగు కాగలదని, ఉద్యో గాల సృష్టి సాధ్యమవుతుందని, మరింత పటిష్ఠ, స్వయంసమృద్ధి డెయిరీ రంగం అభివృద్ధి కాగ లదు. కోట్లాది మంది రైతులకు లబ్ధి చేకూరు తుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెల్లడిం చింది. అలాగే, పశుసంవర్ధక రంగానికి ఊతమి చ్చేలా రివైజ్డ్ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌కు కేబినెట్ ఆమోదం లభించింది.

పి2ఎంకు ఆమోదం :
2024–25 ఆర్థిక సంవత్సరం కోసం 'ఇన్‌సెంటివ్ స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్‌లో వాల్యూ బీమ్ యుపిఐ ట్రాన్సాక్షన్స్ పర్సన్ టు మర్చెంట్ (పి2 ఎం)నూ కేంద్ర కేబినెట్ ఆమోదించింది. ఈ పథకం కింద చిరు వర్తకుల కోసం రూ.2000 లోపు యుపిఐ లావాదేవీలు జరుపవచ్చు. అద నపు వ్యయం లేకుండా యుపిఐ సేవలను చిరువర్తకులు వినియోగించేందుకు ఇది దోహద మవుతుంది. యుపిఐ లావాదేవీలు రూ. 210 లక్షల కోట్లకు చేరుకున్నాయని అధికారిక ప్రకటన తెలిపింది. రూ.2వేల కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీలకు ఎలాంటి చార్జీ లేదని వెల్లడించింది. ప్రస్తుత యుపిఐ విధానంలో కస్టమర్ బ్యాంక్, ఫిన్ టెక్ సంస్థ, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్, యాప్ సంస్థ ద్వారా 4 అంచెల్లో లావాదేవీలు జరుగుతు న్నాయని పేర్కొంది. రూ.1,500 కోట్లు ఇన్సెంటివ్ రూపంలో చిన్న లావాదేవీలకు చార్జి లేకుండా చేస్తామని ప్రకటన వెల్లడించింది.

నిఘా వైఫల్యంతోనే హింస

మహారాష్ట్ర సర్కార్‌పై విపక్షాల ధ్వజం

ముంబై: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై బుధ వారం ప్రతిపక్ష పార్టీలు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. నిఘా వైఫల్యం కారణంగా నాగ్‌పూ ర్‌లో హింసను నిరోధించలేకపోయారని ధ్వజమె త్తాయి. ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో ఉన్న ఔరం గజేబ్ సమాధిని తొలగించాలని కోరుతూ విశ్వ హిందూపరిషత్ చేపట్టిన ఆందోళన సందర్భంగా ఒక వర్గానికి చెందిన పవిత్ర గ్రంథాన్ని దహనం చేశా రనే వదంతుల నడుమ సోమవారం రాత్రి నాగ్‌పూర్ నగరంలో పోలీసులపై రాళ్లు రువ్వడంతో హింస జరి గింది. రాష్ట్ర శాసన సభలో ప్రతిపక్ష నాయకుడు విజయ్ వాడేట్టివార్ మాట్లాడుతూ నాగ్‌పూర్ ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్వస్థలమని అన్నారు. 'అ క్కడ నిప్పు పెట్టింది ఎవరు?... హింస ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగితే, నిఘా వైఫల్యం వల్లే జరి గింది. హింస చెలరేగిన తర్వాత గంటన్నర పాటు పోలీసులు ఎక్కడా కనిపించలేదు' అని ఆయన అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో హోం శాఖ బడ్జెట్ డిమాండ్లపై ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి రెచ్చగొట్టే ప్రకటనలు చేసినప్పటికీ అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని వాడేట్టివార్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'ఆయనను రాజీనామా చేయమని ఎందుకు అడగరు?' అని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించాడు. అంతకుముందు, నాగ్‌పూర్ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎమ్మెల్యే ప్రవీణ్ దాట్కే, హింస సమయంలో మహిళా కానిస్టేబుళ్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డా రని సభలో ఒక సమాచార పాయింట్ ద్వారా చెప్పారు. చర్చలో పాల్గొన్న శివసేన (యుబిటి) నాయకుడు భాస్కర్ జాదవ్ రాష్ట్రంలో శాంతిభద్ర తల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'కిడ్నాప్, లైంగిక వేధింపుల కేసులు పెరిగాయి. శివసేన మాజీ కార్పొరేటర్ అభిషేక్ ఘోసల్కర్‌ను పట్టపగలు హత్య చేశారు. మాజీ మంత్రి బాబా సిద్దిక్‌ను కూడా కాల్చి చంపారు' అని ఆయన అన్నారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన సిఎం ఫడ్నవీస్, నాగ్‌పూర్‌లో జరిగిన హింస ముందస్తు ప్రణాళికతో జరిగిన కుట్రగా కనిపిస్తోందని, ఆ గుంపు నిర్దిష్ట ఇళ్లు, సంస్థ లను లక్ష్యంగా చేసుకున్నదని అన్నారు.

మణిపూర్‌లో ఘర్షణలు గాల్లోకి కాల్పులు

ఇంఫాల్ : మణిపూర్‌లో ఉద్రిక్తతలు కొన సాగుతున్నాయి. తాజాగా చురాచంద్ పూర్ జిల్లాలో రెండు వర్గాలు రాళ్లు రువ్వు కున్నాయి. కాల్పులకు దిగాయి. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవా యువు ప్రయోగించడంతో పాటు గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో కొంత మందికి తీవ్రగాయాలైనట్లు సీనియర్ అధి కారి ఒకరు బుధవారం తెలిపారు. మణి పూర్‌లోని చురాచంద్‌పూర్ జిల్లాలో మంగ ళవారం రాత్రి జోమి కౌన్సిల్, హార్ ఇన్పురు తెగల మధ్య శాంతి ఒప్పందం కుదిరిన కొన్నిగంటల తర్వాత... రెండు వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. జోమి సంస్థకు చెందిన జెండాను కొందరు దుండ గులు కూల్చివేసేందుకు యత్నించారు. ఆగ్రహించిన జోమి వర్గం హార్ వర్గంపై కర్రలతో దాడికి దిగింది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

నాగపూర్ హింస... ఒకరి అరెస్టు
10 పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ

నాగపూర్/ముంబై : నాగపూర్ హింసకు సంబంధించి ప్రధాన నిందితుడిగా భావిస్తున్న ఫహీమ్ ఖాన్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ అల్లర్ల వెనుక హింసను 'ప్రేరేపించిన' వ్యక్తి ఫహీమ్ ఖాన్ అని వారు తెలిపారు. మైనా రిటీ డెమొక్రటిక్ పార్టీకి చెందిన స్థానిక రాజకీయ నాయకుడు ఖాన్ శుక్రవారం వరకు కస్టడీలో ఉంటాడు. హింసకు సంబంధించి ఇప్పటివరకు 60 మందిని అరెస్టు చేశారు. కాగా, పోలీసులు ఈ హింస ఒక వ్యక్తి లేదా సంస్థ ద్వారా జరిగిందా అనే అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు ఆరు కేసులు నమోదు చేసి 1,200 మందిపై ఫిర్యాదులు నమోదు చేశారు. మిగిలిన వారి కోసం వెతుకుతున్నారు. ఔరంగజేబ్ సమాధికి వ్యతిరేకంగా నిరసనల కారణంగా నగరంలో జరిగిన హింసాకాండ తర్వాత 50 మందికి పైగా వ్యక్తు లను అదుపులోకి తీసుకున్న తర్వాత బుధవారం నాగపూర్‌లోని 10 పోలీసు స్టేషన్ల పరిధిలో వరుసగా రెండవ రోజు కర్ఫ్యూ విధించారు. ఇటువంటి సంఘ టనలను అదుపులో ఉంచడానికి, రాష్ట్రంలో కలహాలకు దారితీసే చిన్న సంఘ టనలను కూడా తీవ్రంగా పరిగణించి, వాటిని మొగ్గలోనే తుంచివేయాలని మహారాష్ట్ర డిజిపి రష్మీశుక్లా జిల్లా ఎస్పీలను కోరారు. రాష్ట్ర పోలీసు చీఫ్ కూడా పోలీసు సిబ్బందిని వీధుల్లో ఎక్కువ మంది పోలీసులు కనిపించేలా చూసుకోవాలని, సరైన బందోబస్తు నిర్వహించాలని కోరారు. కాగా, నాగపూ ర్‌లోని పాత నగర ప్రాంతంలో సోమవారం జరిగిన హింసలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి విధుల్లో ఉన్న మహిళా పోలీసు అధికారిని అనుచితంగా తాకినట్లు ఆరోపణలు వచ్చాయి. హింసకు సంబంధించి ఒక ఏరియా పోలీస్ స్టేషన్‌లో దాఖలయిన మొదటి సమాచార నివేదిక (ఎఫ్ఐ ఆర్) ఈ విషయాన్ని పేర్కొంది. నాగపూర్ హింస నిందితుడు, మార్చి 17న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ప్రారంభమై రాత్రి 11.30 గంటల వరకు కొనసాగిన ఈ సంఘటనలో పోలీసు సిబ్బందితో సహా మరికొందరు మహిళ లతో కూడా అసభ్యకరమైన హావభావాలు ప్రదర్శించాడని, అసభ్యంగా ప్రవ ర్తించాడని వెల్లడించింది. ఎఫ్ఐఆర్, నంబర్ 0115, మార్చి 18న సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విధుల్లో ఉన్న గణేష్‌పేట్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జితేంద్ర బాబూరావు గాడ్గే నమోదు చేశారు.

ఫారం - VI
(ఉప నియమం (1) యొక్క నియమం -19ప్రకారం)
మరియు సెక్షన్ 11(1) యొక్క చట్టం -30/2013)
తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ
కలెక్టర్ /జాయింట్ కలెక్టర్ / స్పెషల్ కలెక్టర్ (భూ సేకరణ) / స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ)
ప్రాథమిక ప్రకటన

గెజిట్ నెం. 18/2025 — తేది : 07.03.2025
నెం. జి /196/2025 — తేది : 07.03.2025
నెం: ఎఫ్/ 776/2025 — తేది : 07.03.2025

ప్రజాప్రయోజనము నిమిత్తం అనగా నారాయణపేట కొండంగల్ లిఫ్టు ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా ప్రెసర్ మైన్‌నిర్మాణం కొరకు నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, దామరగిద్ద గ్రామం పరిదిలో మొత్తం **ఎ.4.18 గుంటలు** భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.
అందువలన పై తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, దామరగిద్ద గ్రామం యొక్క మొత్తం **ఎ.4.18 గుంటలు** విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెల్పిన విధంగా వివరణాత్మక వివరం ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

క్ర. సం.	సర్వే నెం.	భూమి స్వభావం	భూమి రకం	సేకరించవలసిన భూమి విస్తీర్ణం	ఆసక్తిగల వ్యక్తుల పేర్లు	సరిహద్దులు ఉ	తూ	ప	ద	చెట్లు రకం	సంఖ్య	కట్టడాలు రకం	విస్తీర్ణం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	110/1/1/1	పట్టా	తరి	0.02	ప్రభాకర్ గౌడ్ తండ్రి యం. అంజనేయులు గౌడ్	110	110	110	110	-	-	పైప్‌లైన్	-
2	110/2 3/2	పట్టా	తరి	0.06	సంజనోళ్ల గజలప్ప తండ్రి పెద్ద నర్సప్ప	110	110	110	110	-	-	-	-
3	110/2 3/1	పట్టా	తరి	0.07	సంజనోళ్ల అంజమ్మ భర్త సంజనోళ్ల చిన్న చంద్రప్ప	110	110	110	110	తుమ్మ	1	-	-
4	110/అ ఆ ఇ /2	పట్టా	తరి	0.19	సంజనోళ్ల రేణుక భర్త హన్మంతు	110	110	110	110	-	-	-	-
5	107/5 అ	పట్టా	మెట్ట	0.05	గొల్ల హుసేనప్ప తండ్రి యల్లప్ప	107	107	107	107	తుమ్మ	1	-	-
6	107/5ఈ	పట్టా	మెట్ట	0.05	జి.బుజ్జప్ప తండ్రి యల్లప్ప	107	107	107	107	-	-	-	-
7	107/ఋ 1	పట్టా	మెట్ట	0.04	గడ్డమీది నర్సప్ప తండ్రి ఎల్లప్ప	107	107	107	107	-	-	-	-
8	107/ఏ 1	పట్టా	మెట్ట	0.05	గడ్డమీది గొల్ల ఆశప్ప తండ్రి యల్లప్ప	107	107	107	107	-	-	-	-
9	106/అ/1	పట్టా	మెట్ట	0.29	మొగులమ్మ భర్త వెంకటప్ప	106	106	106	106	-	-	బోర్(2)	-
10	106	పటా	మెట్ట	0.02	R & B రోడ్	75	75	75	75	-	-	-	-
11	75/2/ 1/1/3	పట్టా	మెట్ట	0.24	నంబి అంజిలమ్మ భర్త రాములు	75	75	75	75	తుమ్మ టేకు	4 19	బోర్	-
12	75/2/2	పట్టా	మెట్ట	0.09	దేవరి ఆశప్ప తండ్రి దేవరి రాములు	75	75	75	75	వరి	-	-	-
13	75/1/2	పట్టా	మెట్ట	0.07	బర్ల లాలప్ప తండ్రి బాలప్ప	75	75	75	75	-	-	-	-
14	75/2/3	పట్టా	మెట్ట	0.08	డి.సాయికుమార్ తండ్రి వెంకటప్ప	75	75	75	75	-	-	-	-
15	74/3/ఉ ఋ	పట్టా	మెట్ట	0.08	దేవరి గొల్ల రాములు తండ్రి కనకప్ప	74	74	74	74	టేకు	3	-	-
16	74/1 ఆ /1	పట్టా	మెట్ట	0.03	పుట్టిచిన్న నర్సప్ప తండ్రి తిమ్మన్న	74	74	74	74	నీలగిరి	1	-	-
17	74/1అ /2	పట్టా	మెట్ట	0.03	ఈదప్ప తండ్రి నాగప్ప	74	74	74	74	వేప	1	-	-
18	74/అ 1/2	పట్టా	మెట్ట	0.02	వంశరాజ్ మల్లప్ప తండ్రి వంశరాజ్ నర్సప్ప	74	74	74	74	-	-	-	-
19	74/2/అ	పట్టా	మెట్ట	0.17	ద్యావరి తిప్పన్న తండ్రి ఆశప్ప	74	74	74	74	-	-	-	-
20	74/2/1	పట్టా	మెట్ట	0.08	ద్యావరి నర్సప్ప తండ్రి కనకప్ప	74	74	74	74	-	-	-	-
21	51/1	పట్టా	మెట్ట	0.02	వెంకట్ రాములు తండ్రి తిపన్న	75	51	51	51	టేకు మామిడి ఎర్ర చందనం	50 15 25	Water drip & stone fencing	-
22	51/1 ఆ	పట్టా	మెట్ట	0.01	నీలి సురేఖ భర్త మానిక్యప్ప	75	51	51	51	వేప	2	-	-
మొత్తం: ఎ.4.18 గుంటలు													

భూసేకరణ, పునరావాసం మరియు పునరావాస చట్టం 2013 (కేంద్ర చట్టము నెం. 30/2013) లో న్యాయమైన నష్టము పరిహారం మరియు పారదర్శక హక్కు యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనల ప్రకారం వారందరికి ఈ ప్రకటన రూపొందించబడింది.
భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, నారాయణపేట మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, నారాయణపేట భూ సేకరణ వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్ కం సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేపట్టుట కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు &భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సరిగా చేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తుపల్లాలు తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు అతని సిబ్బందిని అధికారిగా అధికారమిచ్చుటకు.
చట్టం సెక్షన్ 11 (4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా ఈ ప్రకటన ప్రమరించిన తేది నుండి భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకాలు/ కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూముల పై ఏవేని ఋణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవి ఏ వ్యక్తి చేయరాదు.
పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్మెంట్ కొరకు ఆసక్తి / ప్రభావితమయే వ్యక్తులందరి నుండి క్లెయింలు మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటె భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేది. నుండి 60 (అరువది) రోజుల లోపల భూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కలెక్టర్ / అధికృత సమక్షంలో సమర్పించవచ్చు.

సం/- భూసేకరణ అధికారి & రాజస్వ మండలాధికారి నారాయణపేట
సం/- అదనపు కలెక్టర్(రెవిన్యూ) నారాయణపేట
సం/- జిల్లా కలెక్టర్ నారాయణపేట
DIPR RO NO. 806 /LA/PP/Advt/Pub/2024-25

ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

కేరళకు న్యాయం చేయాలి
రాజ్యసభలో సిపిఐ ఎంపి సునీర్

న్యూఢిల్లీ : మోదీ ప్రభుత్వం ప్రజారోగ్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని సిపిఐ ఎంపి పి.సునీర్ విమర్శించారు. ఆరోగ్య సంరక్షణ సేవల కోసం అరకొర కేటాయింపులను దుయ్యబట్టారు. జిడిపి నుంచి కేవలం 2.1శాతమే ఆరోగ్య రంగానికి 2024–25 బడ్జెట్‌లో కేటాయించారని, ఇది అభివృద్ధి చెందు తున్న దేశాల కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) సిఫార్సు చేసిన దానికంటే ఐదు శాతం తక్కువని అన్నారు. సునీర్ బుధవారం రాజ్యసభలో మాట్లా డుతూ మోదీ ప్రభుత్వం తీరును తీవ్రస్థాయిలో ఆక్షేపిం చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కేంద్రం ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని గుర్తుచేశారు. పెరుగు తున్న వైద్య ఖర్చులు పౌరులకు భారంగా మారుతున్నా యని ఆందోళన వ్యక్తంచేశారు. మానసిక ఆరోగ్య సంర క్షణ కోసం కనీస కేటాయింపులు లేవన్నారు. తద్వారా లక్షలాది మందికి తగిన మద్దతు అందే పరిస్థితి లేదని అన్నారు. దేశానికి కేరళలోని ఆరోగ్య సంరక్షణ నమూనా ఆదర్శనీయమని సునీర్ చెప్పారు. కేరళ రాష్ట్రంలో ప్రజారోగ్య మౌలిక వసతులు, రోగాల నియంత్రణకు చర్యలు పటిష్ఠంగా ఉన్నాయని, కోవిడ్ 19ని కట్టడి చేసి ప్రపంచ మన్ననలను కేరళ పొందింద న్నారు. కేరళ విజయం దేశమంతటా ప్రతిధ్వనించా ల్సింది పోయి ఆ రాష్ట్రంపై కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. న్యాయంగా రావా ల్సిన రూ.600కోట్లను ఇవ్వకుండా కేరళను కేంద్రం ఇబ్బందిపెడుతోందని, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను గాడి తప్పించాలని చూస్తోందని దుయ్యబట్టారు. కోజి కోడ్‌లో ఎయిమ్స్ కోసం కేరళ దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తుంటే కేంద్రం పట్టించుకోవడంలేదని, ఇది రాష్ట్రంపై బిజెపి రాజకీయ కక్షసాధింపునకు నిదర్శనమని సునీర్ వ్యాఖ్యానించారు. ఎన్ని అవరోధాలు వచ్చినాగానీ కేర ళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ధైర్యంగా ముందుకు సాగు తోందని ప్రశంసించారు. గ్రామీణ ఆరోగ్య రంగానికి వెన్నుదన్నుగా ఉన్న ఆశా వర్కర్లకు దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.10వేల నుంచి రూ.13వేల వరకు వేతనాలు చెల్లిస్తోందన్నారు.

ఫ్రంట్‌లైన్ వర్కర్లకు సముచిత గౌరవం ఇస్తోందన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనూ ఆశా వర్కర్లకు కేరళ స్థాయి వేతనాలు లేవని అన్నారు. కేరళకు రావాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సునీర్ డిమాండ్ చేశారు. మరింత జాప్యం జరగ కుండా కోజికోడ్‌లో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆరోగ్య సంరక్షణ... పౌరుల ప్రాథమిక హక్కు... దీనిని రాజకీయం కోసం కాలరాయొద్దు అని కేంద్రానికి సునీర్ హితవు పలికారు.

'వయనాడ్'లో ప్రతి అనాథకూ రూ.10లక్షలు విద్యకోసం
కేరళ ప్రభుత్వం ఆర్థికసాయం

తిరువనంతపురం : వయనాడ్‌లో 2024, జులైలో కొండచరియలు విరిగిపడి తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల చదువు బాధ్యతను కేరళ ప్రభుత్వం తీసుకుంది. వారి విద్యకు అయ్యే ఖర్చును భరించేందుకు సిద్ధమైంది. ప్రతి అనాథకు రూ.10లక్షలు చొప్పున ఆర్థిక సాయాన్ని బుధవారం ప్రకటించింది. 'మెప్పాడి గ్రామంలో తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన ఏడుగురు పిల్లలు ఉండగా, తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు 14 మంది ఉన్నారు. వీరందరి విద్య కోసం రూ.10 లక్షలు చొప్పున కేరళ ప్రభుత్వం అందజేయనుంది' అని సిఎంఒ పేర్కొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేబినెట్ ఈమేరకు నిర్ణయించినట్లు తెలిపింది. సిఎండిఆర్ఎఫ్ ద్వారా ఈ సాయాన్ని అందిస్తారని, పిల్లలకు 18 ఏళ్లు వచ్చేంత వరకు ఆ డబ్బు విత్‌డ్రా చేసేందుకు అనుమతి లేదని స్పష్టంచేసింది. ఇప్పటికే మహిళ, శిశు సంక్షేమ శాఖ కొంత సాయాన్ని అందించినట్లు గుర్తుచేసింది. అయితే సంబంధిత పిల్లల సరక్షకులకు నెలసరి వడ్డీని చెల్లించడం, ఆ డబ్బును సదరు ఖాతాల్లో జమ చేసే బాధ్యతలను వయనాడ్ కలెక్టర్‌కు అప్పగించినట్లు సిఎంఒ తెలిపింది. వయనాడ్‌లోని ముండక్కాయ్, చురల్మాలాలో కొండచరియలు విరిగిపడి నప్పుడు బాధితులకు పునరావాసం కోసం జరిగిన భూసేకరణకు భూములు ఇచ్చిన వారికి పరిహారం ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.26.56 కోట్లను సిఎండిఎంఆర్ఎఫ్ ద్వారా సమకూర్చనున్నట్లు సిఎంఒ వెల్లడించింది. అదే సమయంలో ప్రతిపాదిత టౌన్‌షిప్ ప్రాజెక్టు అమలునకు కొత్త పోస్టుల కేటాయింపు దిశగా కసరత్తు జరుగుతున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది.

పాక్‌కు రక్షణ సమాచారం
ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి అరెస్టు

లక్నో: పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐకు దేశ రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచా రాన్ని చేరవేస్తున్నాడన్న ఆరోపణ లపై కాన్పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగిని ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం అధికారులు అరెస్ట్ చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జూని యర్ వర్క్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కుమార్ వికాస్ పాకి స్థాన్‌కు చెందిన ఏజెంట్‌తో కలిసి కుట్ర పన్నుతున్నట్లు సమాచారం అందడంతో ఈ చర్యలు తీసుకు న్నట్లు పేర్కొన్నారు. 2025 జనవ రిలో ఓ మహిళా పాకిస్థాన్ ఏజెం ట్‌తో అతడికి ఫేస్‌బుక్‌లో పరి చయం ఏర్పడిందని, ఆమె తనను భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటె డ్‌లో ఉద్యోగం చేసే నేహాశర్మగా పరిచయం చేసుకుందని అన్నారు. అనంతరం ఫ్యాక్టరీకి సంబంధిం చిన సున్నితమైన విషయాలను అందించాలని, అందుకు డబ్బులి స్తానని ఆశ చూపింది. అనంతరం అతడికి వలపు వల విసిరింది. దీంతో అతడు లూడో గేమ్ యాప్‌ను ఉపయోగించి సంస్థకు చెందిన సున్నితమైన పత్రాలు, పరి కరాల వివరాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తికి సంబంధించిన డేటా, ఉద్యోగుల సమాచారం వంటివి ఆమెకు చేరవేశాడు. లీక్ అయిన సమాచారం వల్ల భారత దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌ మత్వం తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.

దేశ రక్షణ రంగానికి సంబంధిం చిన రహస్య సమాచారాన్ని ఇదే పాక్ ఏజెంట్ నేహా శర్మకు లీక్ చేస్తున్న ఫిరోజాబాద్‌లో హజ్రత్ పూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెకానిక్ రవీంద్ర కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మొదట స్నేహం పేరుతో అతడికి ఫేస్‌బుక్‌లో పరిచ యమైన ఆమె అనంతరం అతడికి వలపు వల విసిరి...రక్షణ రంగా నికి సంబంధించిన రహస్య సమా చారాన్ని, లేఖలను తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివ రాలు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

భూమికి ఉద్యోగాల కుంభకోణం
ఈడీ విచారణకు లాలు

పాట్నా : రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) ముందు హాజరయ్యారు. భూమి కోసం ఉద్యోగాల కుంభకో ణంపై దర్యాప్తునకు సంబంధించి ఆయనకు సమన్లు జారీ అయ్యాయి. అనారోగ్యంతో బాధపడుతున్న 70 ఏళ్ల వ్యక్తి ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పాట్నాలోని ఈడి బ్యాంక్ రోడ్ కార్యాలయానికి చేరుకుని దాదాపు నాలుగు గంటల పాటు విచా రణ తర్వాత ఆ ప్రాంగణం నుంచి వెళ్లి పోయారు. పాటలీపుత్ర నుంచి ఆర్‌జెడి ఎంపి అయిన ప్రసాద్ పెద్ద కుమార్తె మీసా భారతి తన తండ్రితో కలిసి వెళ్లారు. ఈడి కార్యాలయానికి వెళ్లే వీధిలో పెద్ద సంఖ్యలో గుమిగూ డిన ఆర్‌జెడి కార్యకర్తలు ప్రసాద్‌ను ప్రశంసిస్తూ నినాదాలు చేస్తూనే ఉన్నారు. అయితే, తన సరదా ప్రతిభకు పేరుగాంచిన ప్రసాద్, జర్నలిస్టుల నుంచి వచ్చిన ఎటువంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. కారు లోపల నుంచి నిశ్శబ్దంగా వారి వైపు ఊపుతూ కనిపించాడు. మంగళ వారం ఈ కేసులో సహ నిందితులుగా పేర్కొనబడిన ప్రసాద్ భార్య రబ్రీదేవి, పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఈడి దాదాపు నాలుగు గంటల పాటు ప్రశ్నించింది. ఇదిలా ఉండగా, లాలూ చిన్న కుమారుడు, వారసుడు తేజస్వి యాదవ్ మరోచోట విలేకరు లతో మాట్లాడుతూ 'మమ్మల్ని ఎంత ఎక్కువగా వేధిస్తే, మేము అంత బలంగా మారతాం. రాజకీయాల్లో లేకుంటే, నన్ను ఇందులోకి లాగేవారు కాదు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత దర్యాప్తు సంస్థలు ఇప్పుడు బీహార్ వైపు దష్టి సారిస్తాయని నేను ఊహించాను' అని చెప్పారు. జెడి(యు) ఎమ్మెల్సీ, ఆ పార్టీ ప్రతినిధి నీరజ్ కుమార్ మాట్లా డుతూ 'లాలూప్రసాద్ తాను విత్తిన పంటనే కోసుకున్నారు. అప్పటి బీహార్ ముఖ్యమంత్రిగా, ఆయన దాణా కుంభకోణంలో పాల్గొన్నారు. ఆయన కోర్టు ద్వారా దోషిగా నిర్ధారించబడి ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హు డిగా ఉన్నారు. రాజకీయ ప్రతీకార ఆరోపణ నకిలీది. దాణా కుంభకో ణంలో సిబిఐ చార్జిషీట్ ఇందర్ కుమార్ గుజ్రాల్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు దాఖలయింది. ఆయనతో ఆర్జేడీ అధినేత అద్భుతమైన సంబం ధాలు పంచుకున్నారు' అని తెలిపారు. భూమికి ఉద్యోగాల కుంభకోణం కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వ మొదటి పదవీ కాలంలో ఆర్‌జెడి అధినేత రైల్వే మంత్రిగా ఉన్న కాలానికి సంబంధించినది.

హింస సమాజానికి మంచిది కాదు
ఆర్ఎస్ఎస్

న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని ఖుల్తాబాద్‌లో ఉన్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ సమాధిని కూల్చివేయాలనే డిమాండ్లపై కొనసాగుతున్న వివాదం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) బుధవారం స్పందించింది. దాని ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సునీల్ అంబేకర్ మాట్లా డుతూ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన హింసను ఖండించారు. ఏ రక మైన హింస అయినా సమాజ ఆరోగ్యానికి హానికరం అని అన్నారు. ఇది ఔరంగజేబ్‌కు సంబంధించి జరిగినది కాదని తాను భావిస్తున్నట్లు చెప్పారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
'e'NIT No. 12/J1/IT/GHMC/2024-25 ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్స్) తేది: 19.03.2025
పని పేరు: జిహెచ్ఎంసి, ప్రధాన కార్యాలయంకి యాక్సెసరీస్‌తోపాటు 17 మొబైల్ ఫోన్ల సరఫరా మరియు డెలివరీ, **అంచనా విలువ / ఇసివి:** రూ.28,29,463/-, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 19.03.2025న మ.02.30గం.ల నుండి, ఆఖరి తేది: 20.03.2025న మ.02.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** అడిషనల్ కమిషనర్ (ఐటి) కార్యాలయం, 3వ అంతస్తు, సిసి కాంప్లెక్స్ బిల్డింగ్, జిహెచ్ఎంసి, లిబర్టీ సర్కిల్, హైదరాబాద్ - 500063. ఫోన్: 6309999458. వివరాలకు ghmc@gov.in లో చూడవచ్చు.
సం/- అడిషనల్ కమిషనర్ (ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ), జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 11670-PP/CL/ADVT/1/2024-25, Date: 18-03-2025

శ్రీ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానము, వేములవాడ, రాజన్న సిరిసిల్లా జిల్లా.
Notice in Rc.No. B4/1600-7/2024, ఇ-టెండర్ - పేపరు టెండర్ కం బహిరంగ వేలము ప్రకటన తేది: 19.03.2025
దేవస్థానమునకు, చెందిన ఈ క్రింది అంశములకు స్వాధీనపరచిన తేది నుండి 2 సం.ల కాలపరిమితన లీజు / లైసెన్స్ హక్కు కొరకు ఇ-టెండర్ - కం - పేపరు టెండర్ - కం - బహిరంగవేలము నిర్వహించ బడుచున్నది.
1. భీమేశ్వర సదన్ గ్రౌండ్ ఫ్లోర్ నందు క్యాంటీన్ నిర్వాహణ, **2.** శంకర పురం ధర్మశాల దుకాణములు నం. (23, 27,), **3.** శ్రీ వేణుగోపాల స్వామి ఆలయమునకు సమీపమునయున్న దుకాణములు నం.(2,3,4,5,6), **4.** సంస్కృత కళాశాల దుకాణము నం. (7), **5.** కరీంనగర్ పట్టణ టవర్ సర్కిల్ నుండి గాంధీ రోడ్ దుకాణ సముదాయం మండలి దుకాణములు - (03, 05, 06, 15, 22, 29/A.), **6.** శ్రీ స్వామి వారి మెట్లప్రక్కన దుకాణము నం. (03), **7.** శివపురం ధర్మశాల దుకాణ సముదాయము నందు దుకాణము నం. (06), **8.** శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, నాంపల్లి నందు క్యాంటీన్ నిర్వాహణ.
పై అంశములకు తేది: 29.03.2025 రోజున దేవస్థానము కార్యాలయము ముందు భాగము నందు గల ఓపెన్ హాల్ నందు ఉదయము 11-00 గంటలకు బహిరంగవేలము నిర్వహించి తదనంతరము సీల్డ్ టెండరు. పిమ్మట ఇ - టెండరు ఓపెన్ చేయబడును. ఇట్టి ఇ-టెండర్ లేదా పేపరు టెండర్ లేదా బహిరంగవేలము నందు లేదా https://tender.telangana.gov.in నకు లాగ్ అన్ అయ్యి మోర్ ఆప్షన్ పై క్లిక్ చేసి, ఎండోమెంట్స్ డిపార్టుమెంటు మార్కెటింగ్ సెలెక్టు చేసి దేవాలయము పేరుపై క్లిక్ చేసిన ఎడల పూర్తి వివరములు లభ్యమగును. ఇతర వివరములకై 9948288354, 8333997623 & 8333997610.
DIPR R.O. No. : 11706-PP/CL/ADVT/1/2024-25, Date: 19-03-2025 సం/- కార్యనిర్వహణాధికారి

రాష్ట్ర బడ్జెట్ సంతృప్తికరం

సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/నల్లగొండ : తెలంగాణ అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్ర మార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్ని రంగాల ప్రజలు సంతృప్తి చెందే విధంగా ఉందని నల్ల గొండ సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు అమలు చేయడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగపడుతుందని అభి ప్రాయపడ్డారు. బడ్జెట్లో ప్రధానగా వ్యవసాయ రంగానికి శాఖకు రూ. 24.439 కోట్లు రైతులకు పెట్టుబడి సాయం కోసం రైతు భరోసా పథకంకు రూ. 18.000 కోట్లు కేటాయించి వ్యవసాయ రంగాన్ని మరింత బలో పేతం చేయడం కోసం బడ్జెట్‌లోనిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.అదేవిదంగా నీటిపారుదలకు 23,373 కోట్లు కేటాయిం చడం జరిగిందని ఈ బడ్జెట్ ద్వార ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెడింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులైన ఎస్ఎల్ బిసి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు తోపాటు పిల్లాయి పల్లి,ధర్మారెడ్డి ,బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేయడం కోసం నిధులు కేటాయించి త్వరితరగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

ప్రతి జాబ్ కార్డుకూ 100రోజులు పని

జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు

ప్రజాపక్షం/సూర్యాపేట(ఆత్మకూర్(ఎస్): మహాత్మగాంధీ ఉపాధి హామీ పనులకు అర్హులైన ప్రతి జాబ్‌కార్డుదారుడికి 100 రోజుల పనులు కల్పిం చాలని సంబందిత అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు ఆదే శించారు. బుధవారం మండలంలోని నెమ్మికల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. పనులు చేస్తున్న వారి హాజరు వివరాలను పరిశీలించారు. గ్రామంలో 120 మంది పనులకు రావడంతో పనులపై అవగాహన కల్పించారు. భూమి లేని నిరుపేదలైన జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరు పనులు చేయాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులైన వారందరు పనులకు హాజరయ్యేలా అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉండ దంతో ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు పనులు ముగించాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఇంటి పన్నుల వసూ ళ్ళపై గ్రామ పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 79శాతం వసూళ్లు పూర్తి అయినట్లు వారు చెప్పగా నూరుశాతం వసూళ్లు చేయాలని ఆదేశించారు. దీనికి ముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగు తున్న ఇంటర్ పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ హసీం, ఎంపిఓ ఈశ్వర్, ఈసి అరుణజ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

పది పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు : ఎస్పి

ప్రజాపక్షం/సూర్యాపేట: ఈనెల 21 నుండి జిల్లాలో జరిగే పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పి కె నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67పరీక్ష కేంద్రాల్లో 11912 మమంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్ష కేంద్రాలకు 200మీటర్ల దూరం వరకు ఐదు గురికి మించి గుంపులుగా ఉండరాదని, ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డిజెలు, ఊరేగింపులు, ప్రదర్శనలు, ప్రచారాలు నిర్వ హించవద్దని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని ఇంట ర్నెట్, జిరాక్స్, స్టేషనరీ దుకాణాలను మూసివేయాలని పేర్కొన్నారు. పరీ క్షల సమయంలో విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్‌ను మలు చేస్తు న్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సమయానికి కంటే ముందుగానే చేరుకోవాలని, రోడ్డు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏవరమైన నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్ప్రెడ్ ఇండియా, సువెన్ సహకారంతో

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్: స్ప్రెడ్ ఇండియా, సువెన్ సహకారంతో బాలెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని రాష్ట పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బాలెంల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఫ్యాడ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, స్టడిమెటిరియల్ పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ స్ప్రెడ్ ఇండియా చైర్మన్ పటేల్ శ్రీధర్ రెడ్డి పాఠశాలలో టివి, డిజిటల్ క్లాస్ రూంలు, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, మిన రల్ వాటర్ ప్లాంట్ స్టాఫ్‌కు విద్యార్థులకు ప్రత్యేక మరుగుదొడ్లు నిర్మిమిం చారని చెప్పారు. స్టడిసెంటర్‌ను నెలకొల్పి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కల్పి స్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ఇమాంపేట కెజిబివి, మోడల్ స్కూల్, చివ్వెంల గురుకుల కళాశాలలను దత్తత తీకొని మౌళిక వసతులు, మెరు గైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పదవ తరగతి విద్యార్థు లకు హాల్ టికెట్‌లను అందేశారు. సువెన్ ఫార్మసుటికల్ బృందం, ప్రధానో పాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల వలన వరి పంట పూర్తి స్థాయిలో ఎండిపోందని పంట ఎండి పోవడం ద్వారా పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షాలు సరిగ్గా పడకపోవడంతో పూర్తి స్థాయిలో ఎండిపోవడం జరిగిందని, మండల వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న దేవాదుల కాల్వలను పూర్తి చేయడం ద్వారా రైతులకు సకాలంలో సాగు నీరు పంటలకు అంది పంట నష్టపోయే పరిస్థితి నెలకొనేది కాదని ఆయన అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీరు లేక ఎండిపోవడంతో అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన పంట తీర కొతకు వచ్చే సమయానికి ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు. గత ప్రభుత్వంతో పాటు నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దేవాదుల ద్వారా నీటిని అందించి రైతులకు మేలు చేస్తామని మాటలు చెప్పారే తప్పా ఇప్పటికి రైతులకు సాగు నీరు అందించలేదని ఎద్దేవా చేశారు.

ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు

త్రిపురారం మండల కేంద్రంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి తనిఖీ

ప్రజాపక్షం/ నల్లగొండ (త్రిపురారం): ప్రాథ మిక వైద్య ఆరోగ్య కేంద్రం స్థాయిలో సాధారణ ప్రసవాలను చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ త్రిపాఠి ఆక స్మిక తనిఖీలు చేశారు.ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టరు, ఓపి రిజిస్టర్, స్టేరిలై జేషన్ రిజిస్టర్ లను పరిశీలించి సిబ్బంది నూటికి నూరు శాతం హాజరు ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఓపిని పెంచాలని, వచ్చిన ప్రతి పేషెంట్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కొత్తగా పెళ్లయిన వారికి ,గర్భిణీ స్త్రీలకు వారు తీసుకునే పౌష్టికా హారంపై అవగాహన కల్పించే విధంగా ఆశలకు శిక్షణ ఇవ్వాలన్నారు. త్రిపురారం పిహెచ్‌సి పరిధిలో ఎలాంటి మాతా మరణాలు లేవని డాక్టర్ కలెక్టర్ కు తెలిపారు. ఎన్సిడి, పిసిడి కేసులు,అంబులెన్స్ ఇతర సౌకర్యాలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా త్రిపురారం పిహెచ్ సి పాతబడిపోయినందున మరమ్మ తులు లేదా కొత్త బిల్డింగ్ మంజూరు చేయాలని వైద్యాధికారి కోరగా తప్పనిసరిగా మంజూరు చేస్తామని తెలిపారు.అదేవిదంగా తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రేషన్ కార్డుల కోసం కొత్తగా వచ్చిన దరఖాస్తుల అప్లోడింగ్ ను కంప్యూటర్ ద్వారా ఆన్లైన్లో పరిశీలించారు. 135 దరఖాస్తుల కొత్తగా వచ్చాయని ,వాటిలో 5 దరఖాస్తులు అప్లోడ్ చేయడం జరిగిందని, 75 దరఖాస్తులు పరిశీలన పూర్తి చేశామని తహ సీల్దార్ ప్రమీల జిల్లా కలెక్టర్ కు వివరించారు. పెద్దదేవులపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో అబార్షన్ కేసులు ఎక్కువ గా ఉన్నా యని గమనించిన జిల్లా కలెక్టర్ ఒక అబర్షన్ పేసెంటు కే మనిషాతో ఫోన్లో మాట్లాడి రెండు సార్లు అబార్షన్ చేయించుకునేందుకు ఉన్న కారణాలను అడిగి తెలుసుకున్నారు. మ రో సారి అబార్షన్ చేయించుకోవద్దని అవసరమై తే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకో వాలని సూచించారు. పిహెచ్‌సి పరిధిలో యాం టివీనం, ఏఆర్ వి ,విటమిన్ కె వ్యాక్సిన్ లను అందుబాటులో ఉంచుకోవాలని డాక్టర్లకు సూ చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రాథ మిక వైద్య ఆరోగ్య కేంద్రం పనితీరు పట్ల సం తృప్తి వ్యక్తం చేసి డాక్టర్లను అభినందించారు.

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 67పరీక్ష కేంద్రాలు

పది పరీక్షలకు అంతా రెడీ : అదనపు కలెక్టర్ పి రాంబాబు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: పదవ తరగతి పరీక్షలకు అంతా సిద్ధం చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తెలిపారు. బుధవారం కలెక్ట రేట్ సమావేశ మందిరంలో ఈనెల 21నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్న పది పరీక్షల నిర్వహణపై చీఫ్ సూప రింటెండెంట్, శాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభ మవుతాయని విద్యార్థులు 8గంటల వరకు పరీక్ష కేంద్రాలకు హాజరు కావాల న్నారు. ఐదు నిమిషాలు ఆలస్యయమైన పరీక్షకు విద్యార్థులను అనుమతిస్తారని చెప్పారు. విద్యార్థులు తాము పరీక్ష రాసే కేంద్రం ఎక్కడ ఉన్నదో ముందే తెలుసు కోవాలన్నారు. దీంతో సమయం ఆదా అవుతుందని చెప్పారు. ఓఎంఆర్ పత్రాన్ని విద్యార్థులు పరిశీంచాలని, ఏదైన సందేహాలు ఉంటే ఇన్వీజిలెటర్ల దృష్టికి తేవాల న్నారు. ఓఎంఆర్ పత్రంపై జవాబులు బ్రాకెట్‌లో సిరియల్ నెంబర్ తప్పనిసరిగ్గా రాయాలన్నారు. మోబైల్స్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని చెప్పారు. సైన్స్ ఈ పరీక్షల్లో వేర్వేరు రోజుల్లో భౌతిక శాస్త్రం, జీవ శాస్త్రం నిర్వహిం చనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్‌టిసి సంస్థవారు విద్యార్థుల కోసం బస్సులను ఆయా రూట్లలో సమయానుకులంగా నడపాలన్నారు. పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరం పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. సిసికెమెరాల నిఘా నడుమ పరీక్షలు నిర్వ హణ ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ పి రాంబాబు తెలిపారు. మొత్తం 11,912 మంది విద్యార్థులు పరీ క్షలు రాయనున్నారని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు 4 ఫ్లైన్ స్క్వాడ్స్, 67 సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, డిఈఓ అశోక్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం, డిపిఓ యాదయ్య పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

వలిగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విధులకు హాజరు కాని సీనియర్ అసిస్టెంట్, ఫార్మసిస్టలకు షోకాజ్ నోటీసు జారీ

ప్రజాపక్షం/వలిగొండ : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రభు త్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం వలిగొండ మండ లంలో గల ప్రైమరీ హెల్త్ సెంటర్‌ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభు త్వ హాస్పిటల్ పట్ల ప్రజలలో నమ్మకాన్ని పెంపొందించుకునేలా అంకిత భావంతో పని చేయాలన్నారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఓపి రిజిస్టర్‌ని పరిశీలించారు. ప్రతిరోజు ఎంతమంది పేషెంట్లు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీని యర్ అసిస్టెంట్ మానస విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ అసిస్టెంట్ కి షోకాజ్ నోటీసు జారీ చేయడం జరిగింది. జగదీష్ ఫార్మసిస్ట్ విధులకు హాజరు కాకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మసిస్ట్‌కి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అత్యవసర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. హాస్పటల్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశిం చారు. ఆసుపత్రికి వచ్చిన వారిని ప్రైవేట్ ల్యాబ్‌కి పంపిస్తే చర్యలు తీసు కుంటా మని హెచ్చరించారు. మార్చి నెలలో 18 ఈడీడీలు ఉండగా ఒక్క డెలివరీలు మాత్రమే చేశారని ప్రసవాల సంఖ్య పెంచాలని డాక్టర్లకు సూచించారు. సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయా లని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబా టులో ఉండేలా చూడాలన్నారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు కావాల్సిన భూములను సేకరించాలి : కలెక్టర్

ప్రజాపక్షం/యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్ కోసం, రైల్వే, ప్యాకేజీ 14కు సంబంధించిన పిల్ల కాలువలకు కావలిసిన ప్రభుత్వ భూములను సేకరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి సర్వే ల్యాం డ్ రికార్డ్స్ సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో రిజర్వుయర్, కెనాల్స్, రైల్వే కోసం భూ సేకరణకు సంబంధించిన వాటి పై సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో సర్వే ల్యాం డ్ కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములను పర్యవేక్షించే బాధ్యత మీపై ఉందన్నారు. ప్రతి మం డలంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. సెంటు భూమిని కూడా అన్యకాంతం కాకుండా చూడాలని సర్వేలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డు అధికారి జగన్నాధరావు, ఎస్ఈ ఇరిగే షన్ శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఉపాధిహామీ పనులు

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను పూర్తిస్థాయిలో సమ ర్థవంతంగా అమలు చేసి, అత్యున్నత నాణ్యత ప్రమాణా లతో వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారు లను ఆదేశించారు. బుధ వారం మల్దకల్ మండలం లోని పెద్దొడ్డి, తాటికుంట గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పను లను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రతి పనికి సంబంధించిన వర్క్ ప్రొఫైల్, ఖర్చు అంచనాలు, నిర్వహణ విధానాలను అధికారుల నుండి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతీ కార్యా లయాన్ని సందర్శించి. ప్రొఫైల్ వివరాలు, పనుల నిర్వహణ తీరు వంటి అంశా లను సమగ్రంగా పరిశీలించారు. తదనంతరం, కలెక్టర్ ద్విచక్ర వాహనంపై వెళ్లి నర్సరీని పరిశీలించారు. మొక్కల పెరుగుదల కోసం సరైన సంరక్షణ చర్యలు తీసు కోవాలని, రోజూ నీరు పోసి సంరక్షించాలని సూచించారు. కంపోస్ట్ పిట్ పను లను పరిశీలించి వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచాలని అధికారులకు సూచిం చారు. అనంతరం మల్దకల్ అమరాయి గ్రామాలను సందర్శించి అక్కడ జరుగు తున్న సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. కుర్వపల్లి గ్రామంలో నిర్మా ణంలో ఉన్న పౌల్ట్రీ షెడ్ల పనులను పరిశీలించి, పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు ఆంజనేయ రెడ్డి, ఉమాదేవి, పంచాయతీ రాజ్ డి.ఈ.కబీర్ దాస్, ఏ ఈ బషీర్, ఏపీఎం సుజాత, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాపక్షం/ మానవపాడు/ఎర్రవల్లి : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియో జకవర్గం మానవపాడు మండలం జల్లాపురం ఈ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు జల్లా పురం గ్రామం నుండి మిరప కాయల హమాలి పనుల నిమిత్తం కొరకు ఆయా గ్రామాలకు ఏక్సల్ టూ విల్లర్ బైక్ మీద వెళ్తుంటారు. అలాగే నిన్న రాత్రి వెళ్తున్నా క్రమంలో 1112 గంటల సమయంలో ఎన్ హెచ్ 44 నేషనల్ హైవే రోడ్డు మార్గంలో కోదండాపురం స్టేజి దగ్గర దాస్ గ్రూప్ కంపె నీకి చెందిన వెన్యూ కేఏ 53 ఎంహెచ్ 9097 నెంబర్ గల కారు దీనికి ముందుగా వెళ్తున్నా టీవీఎస్ టూ విల్లర్ ఎక్సల్ టైక్ ను కారు గుద్దడంతో స్పాట్ నా అక్కడికి అక్కడె హరి జన్ బీసన్న అలియాన్ (ఎలీషా), మహ్మద్ రఫీ అక్సిడెంట్ లో మరణించడం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహా లను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తర లించారు. ఈ ఘటన పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. హరిజన్ బీసన్న వయస్సు 30 ఇతని భార్య పేరు స్వప్న వీరికి చిన్న పిల్లలు ఇద్దరు కుమార్తెలు ఒక కుమా రుడు. అలాగే మహ్మద్ రఫీ వయస్సు 62 ఇతనికి ముగ్గురు కుమార్తెలు ఇద్దరికి వివాహం అయింది చిన్న కుమార్తెకు వివాహం కాలేదు 5 సంవత్సనాల కిందట మహ్మద్ రఫీ భార్య అనారోగ్యంతో మరణిం చడం జరిగింది. ఇప్పుడు మహ్మద్ రఫీ కారు ఆక్సిడెంట్ లో మరణించడంతో ఇతని పిల్లలు అనాధలుగా మిగిలిపోయారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఏవిధముచేతనైన ఈ కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకో వాలని గ్రామ సామాజిక కార్యకర్త శాంతకు మార్ డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

ప్రజాపక్షం/వలిగొండ : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ ఏఐకెఎస్ వలిగొండ మండల 2వ మహాసభ వేములకొండ గ్రా మంలో అంబటి అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎలగందు అంజయ్య హాజరయ్యి సంయుక్తంగా మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు కావలసిన నిధులు ప్రభుత్వం వెంటనే విడు దల చేసి టెండర్లు పిలిచి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభిం చాలి వ్యవసాయరంగానికి సాగునీరు అందించాలని రైతు పండిం చిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని స్వామినాథన్ కమి షన్ను తక్షణమే అమలు చేయాలని అన్నారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలి ఎన్నికల హామీలను అన్నింటినీ అమలు జరపాలి అని అన్నారు. వేములకొండ పెద్ద చెరువు కాల్వను వెడల్పు చేసి సీసీ వేయాలి. తూములకు కల్వవట్లు షెటర్లు ఏర్పాట్లు చేయాలి అని అన్నారు. అనంతరం నూతన మండల రైతు సంఘం సమితి అధ్యక్షులుగా అంబటి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా నరిగ యాదయ్య 13 మంది సభ్యులతో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, సిపిఐ మండలం కార్యదర్శి పోలేపాక యాదయ్య, డిహె చ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సలిగంజి వీరస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, రైతు సంఘం నాయకులు ఆకుల శ్రీను, పగిడి వెంకటయ్య, భీమగాని శ్రీను, కావటి సుదర్శన్, యాస జనార్దన్ రెడ్డి, ఏనుగుల రాములు, రాసాల మల్లయ్య, ఏలం నరసింహ, నాగుల మల్లయ్య, బుంగ చక్రం పాల్గొన్నారు.

చక్రయ్యగౌడ్ హత్య కేసును త్వరలో ఛేదిస్తాం

ఇప్పటికే తొమ్మిది మందిని అదుపులో తీసుకున్నాం

మిర్యాల గ్రామాన్ని సందర్శించిన మల్టీజోన్(-)2 ఐజి సత్యనారాయణ

ప్రజాపక్షం/నూతనకల్: మిర్యాల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు మెంచు చక్రయ్య గౌడ్ హత్య నేపథ్యంలో శాంతిభద్రత లను పర్యవేక్షించేందుకు మల్టీజోన్(-)2 ఐజి సత్యనారాయణ జిల్లా ఎస్‌పి కె నర్సింహతో కలిసి బుధవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ పోలీస్ పరాహారాను పర్యవేక్షించిన ఆయన చక్రయ్య గౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి హత్యకు దారితీసిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హత్య కేసులో ప్రత్యేక్షంగా, పరోక్షంగా ప్రమే యం ఉన్న ప్రతి ఒక్కరిని వదిలి పెట్టమని చెప్పారు. కేసు వేగవంతంగా దర్యాప్తు చేస్తున్నామని ఇప్ప టికే తొమ్మిది మంది నిందితులను అదుపులో తీసుకున్నట్లు చెప్పారు. హత్య కేసులో స్వంత అల్లులు, మనుమండ్లతో పాటు మరి కొంత మంది బంధువులు ఇప్పటికే ప్రాథమిక దర్యా ప్తులో తేలిందన్నారు. హత్యానేరానికి పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పా రు. 19 మందిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు. పథకం ప్రకారమే ఈ హత్య అత్యంత దారుణంగా చేశారన్నారు. ప్రభుత్వం, రాష్ట్ర డిజిపి దీనిని సీరియస్‌గా తీసుకున్నారని చెప్పారు. జిల్లా ఎస్‌పి కె నర్సింహ ప్రత్యేక పర్య వేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టిందన్నారు. ఈ హత్యకు దారి తీసిన కార్యకలాపాలకు సంబం ధించి అనేక వివరాలు అధికారుల దృష్టికి వచ్చా యని చెప్పారు. చక్రయ్య గౌడ్ అల్లుడు కనకటి వెంకన్న గ్రామంలో భూముల అమ్మకాలు, కొనుగోలుల విషయంలో కలిగించిన ఇబ్బందు లను కూడా తమ దృష్టికి బాధితులు తీసుకవ చ్చారని అన్నారు. వెంకన్న చేసిన ప్రతి అఘా యిత్యాన్ని వెలికితీస్తామని స్పష్టం చేశారు. ఈ కేసులో పోలీస్ అధికారుల అలసత్వం వహిస్తే వారిపై కూడా శాఖపరమైన చర్యలు తీసుకుం టామన్నారు. కొంత మంది అధికారులకు మెమోలు జారీ చేస్తామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు జరగడం బాదాకరమని చెప్పారు. కేసును పూర్తిగా చేధించిన తరువాత కోర్టులో కూడా త్వరితగతిన వాదనలు జరిగేలా కృషి చేస్తామన్నారు. గ్రామస్తులు శాంతియుతంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, సూర్యాపేట డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగ భూషణం, తుంగతుర్తి సిఐ శ్రీను నాయక్, నాగారం సిఐ రఘువీర్‌లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్రపవర్

ప్రజాపక్షం/ నల్లగొండ (కట్టంగూర్): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రమాదాలు ఎక్కువగా జరిగే నేషనల్ హైవే,స్టేట్ హైవేల పైన యాక్సిడెంట్ ఫ్రోన్,బ్లాక్ స్పాట్ ఏరియాలను గుర్తించి, రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రత్యేక చర్యలు చేపడు తున్నామని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. ఎన్ హెచ్ 65 నేషనల్ హైవే పైన గల కట్టంగూర్ నల్లగొండ ఎక్స్ రోడ్ ,కురుమర్తి ఎక్స్ రోడ్డు,నకిరేకల్ నగేష్ హోటల్ సమీపంలో గల బ్లాక్ స్పాట్ వద్ద అక్కడి చుట్టూ పక్కల గ్రామ ప్రజలు సర్వీస్ రోడ్డు లేనందున వ్యతిరేక దిశలో ప్రయాణించడం ద్వారా ప్రమా దాలకు గురి అవుతున్నారనే కారణంతో జిల్లా ఎస్‌పి నాయి చౌదరి కంపెనీ, రాం కుమార్ కన్స్ట్రక్షన్ అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించి ప్రమాదాలు జర గకుండా ఇరువైపులా సర్వీస్ రొడ్డులు, కురుమర్తి క్రాస్ రోడ్డు నుంచి కట్టంగూర్ అండర్ పాస్ వరకు సర్వీస్ రోడ్డు వేయాలని అలాగే అన్ని జంక్షన్ ల వద్ద హై మాక్స్ లైట్స్,సెంట్రల్ లైటింగ్,బ్లింకర్స్,జీబ్రా క్రాసింగ్ లైన్స్ , రంబుల్ స్టిక్స్,మొద లగు వేగ నియంత్రణ సూచికలు వెంటనే పెట్టే విధంగా అధికారులకు ఆదేశిం చారు. రాత్రి సమయంలో రహదారిపై వాహనాలు నిలిపి ఉండడం వల్ల ఎక్కువ గా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ రోడ్డుపై ఎలాంటి వాహనాలు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నమని అన్నారు. రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా హైవే వెంట ఉన్న గ్రామ ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కల్పించి రోడ్డు భద్రత పట్ల చైతన్య పరచా లని పోలీసు అధికారులకు ఆదేశించారు. నల్లగొండ డీఎస్‌పి శివరాం రెడ్డి,శాలి గౌరారం సిఐ కొండల్ రెడ్డి, కట్టంగూర్ ఎస్ఐ రవీందర్, రెసిడెంట్ ఇంజనీర్ కిషన్ రావు, జోగేంద్ర చౌదరి కంపని ప్రాజక్ట్ మేనేజర్ నాగ కృష్ణ , రాం కుమార్ కన్స్ట్రక్షన్ సంజీవ చౌదరి, డిటిఆర్‌పి టైర్ సిఐ అంజయ్య పాల్గొన్నారు.

సంక్షేమానికి కేటాయింపులు తగ్గడం శోచనీయం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

ప్రజాపక్షం/ఖమ్మం : సంక్షేమ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గడం శోచనీయమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. బడ్జెట్‌పై జిల్లా ప్రజలు అనేక ఆశలు పెంచుకున్నారని ఆశలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన జరగ లేదని ఆయన తెలిపారు. బడ్జెట్‌పై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పక్షాన సురేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ఈ బడ్జెట్ దోహదం చేసే దిశగా లేదన్నారు. గత బడ్జెట్‌తో పోల్చినప్పుడు వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెరిగినా రైతు భరోసాకే సగం బడ్జెట్ సరిపోతుందని గ్రామ పంచాయతీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వేళ పంచాయతీ రాజ్ శాఖకు నిధుల కేటాయింపు తగ్గించడం శోచనీయమన్నారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన బడ్జెట్‌ను చూస్తే సీతారామ ప్రాజెక్టు నిర్మాణం మరి కొంత కాలం జాప్యం జరిగే అవకాశం కనిపిస్తుందన్నారు. బడ్జెట్‌లో అంకెల గారడీ లేకపోయినా వాస్తవ కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు మహిళలకు పేద, మధ్యతరగతి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేవిధంగా బడ్జెట్ రూపకల్పన చేసి ఉండాల్సి ఉందన్నారు. మరో పక్క కేంద్రం వివక్ష ప్రదర్శిస్తున్న తరుణంలో హామీల అమలు కూడా ఒక సవాల్‌గానే మారుతుందని సురేష్ అభిప్రాయపడ్డారు. సంక్షేమ రంగాలకు కేటాయించిన దానిలో ఎటువంటి కోతలు లేకుండా చూడాలని సురేష్ కోరారు. వ్యవసాయ, వైద్య, విద్య, సంక్షేమ రంగాలకు కేటాయింపులపై కమ్యూనిస్టు పార్టీ అసంతృప్తి వ్యక్తం చేస్తుందని ఆయన తెలిపారు. ఇప్పటికీ గత బడ్జెట్‌తో పోల్చినప్పుడు ఫర్వాలేదనిపించినా ప్రజల ఆశలు ప్రతిఫలించే అవకాశం కనిపించడం లేదని సురేష్ అభిప్రాయపడ్డారు.

ప్రజారంజక బడ్జెట్

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : తెలంగాణ శాసన సభలో డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బుధవారం బడ్జెట్ ప్రజారంజక బడ్జెట్‌గా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పునర్జీవానికి పునాది వేసిందన్నారు. బడ్జెట్‌లోఅన్ని వర్గాలను కలుపుతూ అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని పువ్వాళ్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క రాజ్యాంగబద్ధంగా భావిభారత పౌరుల మనుగడను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపుదిద్దారన్నారు. గత దశాబ్ద కాలం పాలించిన ప్రభుత్వం ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించి రాష్ట్రాన్ని అదోగతిపాలు చేశారన్నారు. నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ప్రజలకు సుపరిపాలనను అందిస్తుందన్నారు. ప్రజారంజకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు కాంగ్రెస్‌పార్టీ తరుపున, జిల్లా ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు రూ.24,438 కోట్లు, విద్యుత్ శాఖకు రూ. 21,221 కోట్లు, ఆరు గ్యారెంటీల అమలుకు బడ్జెట్‌లో అధిక మొత్తం కేటాయించిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి రంగాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు పునరంకితం

ప్రజాపక్షం/ఖమ్మం : భగత్‌సింగ్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ యువతకు విజ్ఞప్తి చేశారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని కానీ ప్రస్తుత పాలకులు జనాభాలో 50శాతం పైబడిన యువతను విస్మరించి పాలన కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో త్యాగానికి, పోరాటానికి ప్రతీకగా భగత్‌సింగ్ నిలిచారన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో తనదైన పంథాలో పోరాటం సాగించి నునూగు మీసాల ప్రాయంలోనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహోన్నతుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల 23న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధి వట్టిపోయి నిరుద్యోగం తారాస్థాయికి చేరిన ప్రస్తుత పరిస్థితుల్లో భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం పోరాడాలన్నారు. ఏఐవైఎఫ్ యువజన సమస్యల పరిష్కారం కోసం, హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తుందని రామకృష్ణ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథరెడ్డి, భూక్యా రవీంధర్, జి.ఉపేందర్, కటుకూరి సతీష్‌రెడ్డి, ఉసికల రవి, దండి రమేష్, నామ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐకెఎస్ 21వ మహాసభ

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: నేడు వైరాలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 21వ మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్నవెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్ గల సిపిఐ పార్టీ కార్యాలయంలో ముఖ్యులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు సంఘాలు, రైతులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రైతుల హక్కుల సాధనతో పాటు పరిరక్షించేందుకు ఈ సభా వేదికపై శంఖారవం పూరించబోతున్నట్లు తెలిపారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన సదస్సుకు రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ రాంకోటి, రైతు సంఘం మండల సమితి సహాయకార్యదర్శి వెన్నం భాస్కర్, రైతు సంఘం నాయకులు వెంపటి సురేందర్, రామిడి రమేష్, గూడా బాబురెడ్డి, కొనకటి అశోక్‌రెడ్డి, ఏఐవైఎఫ్ యువజన సంఘం సభ్యులు మిరియాల నరుణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాపక్షం/పాల్వంచ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వలన వ్యవసాయ రంగం దెబ్బతిని సంక్షోభంలో ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు ఆరోపించారు. బుధవారం పాల్వంచ మండల పరిధిలోని జగన్నాధపురంలోని ముంతాజ్ ఫంక్షన్ హాల్‌లో రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత రైతు సంఘం జెండాను భాగం హేమంతరావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు అనుకూలంగా మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. వ్యవసాయం రంగం దెబ్బతింటే అన్ని రంగాలు మీద నష్టాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాలు గమనించి స్వామినాధన్ సిఫార్సులు తక్షణమే అమలు చేసి రైతాంగ వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. వ్యవసాయ రంగం బలంగా ఉంటేనే అన్ని రంగాలు బాగా ఉంటాయని తెలిపారు. పంటలు మద్దతు గ్యారెంటీ చట్టం అమలు చేస్తే తప్ప వ్యవసాయంలో రైతు నిలబడగలుగుతాడని పేర్కొన్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా శక్తివంతమైన ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల ముందు రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామని రైతులకు ఇచ్చిన హామీని సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీరు ప్రాజెక్ట్ ప్రాధాన్యత కల్పించి పంటలకు సాగునీరు అందించే విధంగా పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇచ్చి రైతులకు ఇచ్చేవారని గత పదిహేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేసిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇచ్చి రైతులకు అందించాలని కోరారు. అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాల్సిందేనని, ఫారెస్ట్ అధికారులు కవ్వింపు చర్యలకు పాల్పడద్దని, రైతులు, పోడు సాగుదారులు పట్ల గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే పోరాటాలు చేయక తప్పదని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, నారాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, అడుసుమల్లి సాయి బాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, భూక్యా దసురు, కుమారి హనుమంత రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, డి.సుధాకర్, ఎండి యూసఫ్, వాకబోయిన రమేష్, వాడే లక్ష్మి, భిక్షం, నరాటి రమేష్, విజయ లక్ష్మి, రవికుమార్, వేణు, ఇమ్మానియేల్, బానోత్ రంజిత్, కొంగర అప్పారావు, శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, వైఎస్ గిరి, చెన్నయ్య, నిమ్మల రాంబాబు, మన్నెం వెంకన్న, ఇట్టి వెంకట్రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, బివి సత్యనారాయణ, ఆదినారాయణ, బిక్కులాల్, వేములపల్లి శ్రీనివాసరావు, జకరయ్య, ఆడకు పెద్ద వెంకటరామయ్య, వజ్ర వాసు, బాదవత్ శ్రీను, లావుడియా చందులాల్, భూక్యా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సకాలంలో సర్టిఫికెట్లు

ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్

ప్రజాపక్షం/బూర్గంపాడు:ఓటర్ల సవరణ జాబితా, గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు, యువతి యువకులకు వివిధ రకాల సర్టిఫికెట్లు జారీ విషయంలో జాప్యం లేకుండా సకాలంలో అందించాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియను ఆయన పరిశీలించి, ఓటర్ సవరణ జాబితా రివిజన్ ఏ విధంగా జరుగుతున్నదని తహసీల్దార్ ముజాహిద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ సవరణ రివిజన్ నేడు చివరి రోజు ఉన్నందున 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఫామ్ 6 ద్వారా నూతనంగా ఓటు హక్కు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని, ఫార్మ్ 7 ద్వారా తొలగించాలని, అభ్యంతరాలపై దరఖాస్తులు చేసుకోవచ్చని, ఫామ్ 8 ద్వారా తప్పుల సవరణ, ఫోటో మార్పు, ఓటు తరలింపు ప్రక్రియ చేపట్టాలని, ఓటర్లు నూతన ఓటు హక్కు రిజిస్ట్రేషన్ మార్పులు చేర్పులు తదితర సేవలకు ఎక్కడకు తిరిగే అవసరం లేకుండా బిఎల్ఓ యాప్ ద్వారా అన్ని సేవలు చేసుకోవచ్చని ఓటర్లకు సిబ్బంది తెలియజేయాలన్నారు. అలాగే నిరుద్యోగ యువకులకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినందున తప్పని సరిగా కులం సర్టిఫికెట్లు, ఆదాయం సర్టిఫికెట్లు, నివాసం ఇతర సర్టిఫికెట్లు అవసరం ఉంటుందని, ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే జాప్యం చేయకుండా సకాలంలో అందించాలని అన్నారు. మండలంలో ఇసుక రీచ్‌లు ఉన్న ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇసుక కొరత ఉన్నదని, అక్రమ రవాణా జరగకుండా తమ సిబ్బందిని ఇసుక ర్యాంపుల వద్ద 24గంటలు కాపలా ఉంచడం జరుగుతుందని, తమ సిబ్బందిలో కొంత మందిని ఐటిసి గెస్ట్ హౌస్ వద్ద ఉండాల్సి వస్తుందన్నారు. సర్టిఫికెట్లు విషయంలో జాప్యం లేకుండా పూర్తి చేయటానికి కృషి చేస్తున్నామన్నారు. ఓటర్లు సవరణ ప్రక్రియ పూర్తవుతుందని బూర్గంపాడు తహసీల్దార్ ముజాహిద్ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారికి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'చలో అసెంబ్లీ' కార్యక్రమం: నిమ్మటూరి

ప్రజాపక్షం/సత్తుపల్లి:మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న నిర్వహించనున్న చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, సిబ్బందికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 54 వేల మంది కార్మికులు అతి తక్కువ వేతనంతో మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్నారని, వారి సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించట్లేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈనెల 26న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్న బోజన పథకం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన హామీ రూ.10 వేల వేతనాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. అదే విధంగా పెరిగిన నిత్యవసరాలు, సరుకుల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను తరగతులకు సంబంధం లేకుండా ప్రతి పిల్లవాడికి రూ.25 పెంచాలని, రాగిజావ కాసినందుకు ప్రతి పిల్లవానికి రూ.2 గ్యాస్ బిల్లు ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఎగ్ బిల్లులను ఈ నెలాఖరు వరకు వంట ఏజెన్సీ ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఉంటా వెంకమ్మ, ఎస్కే రహిమున్నీసా, చంటమ్మ, కారం నాగలక్ష్మి, బొమ్మల సుజాత, జక్కంపూడి వెంకటల, పంతంగి సుశీల, శ్యామల, నాగేశ్వరమ్మ, కృష్ణవేణి, కనకదుర్గ, ఏఐటియుసి సత్తుపల్లి మండల కార్యదర్శి తెలగారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదవ తరగతి పరీక్షలు

డిఇఒకు ఎఐఎస్ఎఫ్ వినతి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి సమర్థవంతంగా పరీక్షలను నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 21 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టిసి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఎఎన్ఎంలు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, ప్రతాప్, గణేష్, రాజేష్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు ముస్తాబు' వైరా'

ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభలకు వైరా ముస్తాబైంది. ఎన్నో ప్రజా ఉద్యమాలకు కేంద్రబిందువైన వైరా రైతు సంఘం మహాసభలకు మరో మారు వేదిక కానుంది. స్థానిక కమ్మ వారి కళ్యాణ మండపంలో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఖమ్మంజిల్లా 21వ మహాసభలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 20 మండలాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 500 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరుకానున్నారు. మహాసభలను పురస్కరించుకుని నగరాన్ని రైతు సంఘం తోరణాలతో అలంకరించారు. ప్రధాన వీధుల్లో రైతు సంఘం డిమాండ్లతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గత మహాసభ బోనకల్‌లో జరగగా ఆ మహాసభ నుండి ఈ మహాసభ వరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం పట్ల అనుసరిస్తున్న వైఖరి, అమలు చేస్తున్న సంక్షేమ, చేయూత పథకాల గురించి మహాసభలలో చర్చించనున్నారు. గడచిన రెండేళ్ల కాలంలో రైతు సంఘం నిర్వహించిన ఆందోలన, పోరాట, సదస్సులకు సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. రోజు రోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయ రంగ పరిరక్షణకు పాలకులు అనుసరించాల్సిన వైఖరి రైతాంగ పోరాటాలపైన ఈ మహాసభలలో పలు తీర్మానాలను చేయనున్నారు. మహాసభలకు ముఖ్య అతిథుగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాగం హేమంతరావు, పశ్య పద్మ హాజరుకానున్నారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు అడపా రామకోటయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు , స్థానిక నాయకులు గడిచిన పది రోజులుగా మహాసభల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. స్థానికంగా పార్టీ నాయకులు, రైతు సంఘం కార్యకర్తలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

విద్యార్థులు పరీక్షలపట్ల భయం వీడాలి :కలెక్టర్

పజాపక్షం/కొణిజర్ల :పదోతరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో భయం వీడాలని భయంతో పరీక్షరాయడానికి వెళితే చదివింది కూడా రాయలేరని ఖమ్మం జిల్లా కలెక్టర్ మిజుమ్మిల్ ఖాన్ అన్నారు. మండల పరిదిలోని తనికెళ్ల హైస్కూల్‌ను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి కూర్చుని వారితో కలివిడిగా మెలిగారు. విద్యార్థులను ఆంగ్లంలో చదివించారు. 10వ తరగతి పరీక్షను విద్యార్థులు సులువుగా రాసేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతు విద్యార్థులంతా ప్రణాళిక ప్రకారం సిద్ధమవ్వాలని అన్నారు. భయం ఉంటే చదివిందికూడా మర్చిపోతారని తెలిపారు. మనసు ప్రశాంతంగా ఉంటేనే పరీక్ష బాగా రాసే అవకాశం ఉంటుందని అన్నారు. చదువుతోపాటు విద్యార్థులు రోజు నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. తగినంత సమయం నిద్రపోవాలని మన శరీరానికి అవసరమైన విశ్రాంతి అవసరమని స్పష్టం చేశారు. పరీక్ష హాల్ లో ఉత్సాంగా పరీక్ష రాయాలని తెలిపాఢ. సంవత్సరం పాటు చదివిన చదువు పరీక్షల్లో వచ్చే ఫలితాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. బాగా చదివి జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. మనం ఒక స్థాయికి వచ్చిన తర్వాత మరో 10 మందికి మనం ఉపయోగపడాలని అన్నారు. వుయ్ కెన్ లెర్న్ ఇంగ్లీష్ తరగతి నిర్వహణ విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడిస్తు గ్రూప్‌గా ప్రదర్శనలను పిల్లల మధ్యలో కూర్చొని ఆసక్తిగా తిలకించారు. అనంతరం తనికెళ్ల గ్రామ సెంటర్ ప్రధానరహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంబించారు. అధికారులు, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యువజన రంగానికి అన్యాయం జరిగింది

ఎస్‌కె. చాంద్ పాషా

ప్రజాపక్షం/జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో యువజన రంగానికి అన్యాయం జరిగిందని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్‌కె. చాంద్ పాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు . రాష్ట్ర ప్రభుత్వం యువజన కమీషన్ ను ఏరా ్పటు హామీని ప్రకటించకపోవడం బాధాకరం అన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాలకు అధిక నిధు లు మంజూరు చేయకపోవడం సిగ్గు చేటు అన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం తరపున నేడు అసెంబ్లీలో ఆ ర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువజన రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం యువజన కమీషన్ ను ఏర్పాటు హామీని ప్రకటించకపోవడం బాధాకరమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రచారా ఆర్భాటాలకు ఇస్తున్న ప్రాధాన్యత ఉద్యోగాల భర్తీపై లేదన్న విమర్శలు వస్తున్నాయన్నారు. పేరుకు మాత్రమే జాబ్ క్యా లెండరు ప్రకటించిందని వారు విమర్శించారు. యూత్ డిక్లరేషన్లో జాబ్ క్యాలెండర్‌తో పాటు నిరుద్యోగ భృతి రూ. నాలుగు వేలు ఇస్తామని ప్రకటించిందని, విద్య, ఉపాధి కల్పనకు యూత్ కమీషన్‌ను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. యూత్ కమిషన్ వెంటనే ఏర్పా టు చేయాలని, ఆ కమీషన్ కు 1000 కోట్ల గ్రా ంట్ ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించే నిరుద్యోగులపై బీఆర్ఎస్ తరహాలోనే నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని మా నుకోవాలని లేదంటే యువత ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంక్షలు ఎత్తివేయాలి

ప్రజాపక్షం/పాల్వంచ: తెలంగాణ రాష్ట్రంలో వి ద్యార్థి, ప్రజా పోరాటాలకు ఉస్మానియా కేంద్ర ంగా విశ్వ విద్యాలయంలో విద్యార్థి హక్కుల కో సం కాకుండా క్యాంపస్ వెలుపల జరిగే పోరాటాలకు వెన్నుదన్నుగా ఉస్మానియా నిలుస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వర్క అజిత్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..వందేమాతరం ఉద్యమం మొదలు తెలంగాణ ఉద్యమం వరకు పోరాటాలకు కేంద్రం ఉస్మానియా విశ్వవిద్యాలయమని, ఇప్పుడు రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఇచ్చి తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ మా ఏడవ గ్యారంటీ అని ప్రకటించి నియంతృత్వ పోకడలు ఇక్కడ చెల్లదంటూ నాడు ప్రగతి భవన్ కంచెలు తీసిన రాష్ట్ర ప్రభుత్వం నేడు క్యాంపస్ నినాదాలు, పోరాటాలు, ధర్నాలు ఉండకూడదని అప్రజాస్వామిక, నియంతృత్వ సర్క్యూలర్ జారీ చేయించారని విమర్శించారు. ఈ సర్క్యూలర్ అప్రజాస్వామ్యం, అనైతికమని తక్షణమే ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితిగా డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు అనేకం ఉన్నాయని, మెస్ బకాయిలు, స్కాలర్‌షిప్స్, హస్టల్స్ రీపేర్లు, నూతన భవనాలు, రెగ్యూలర్ కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు పేరుతో వేలాది రూపాయలు ఫీజులు పెంపు ఈ అంశాలపై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. ప్రజాపాలన పేరుతో నియంతృత్వం అమలు చేయడాన్ని వెనక్కి తీసుకుని, తక్షణమే ఈ సర్క్యూలర్ వెనక్కి తీసుకోవాలని, లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు , జిల్లా సహాయ కార్యదర్శి , తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం

నిర్వాసితులకు న్యాయం చేసేందుకు
భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి
పనులు పరిశీలించిన కలెక్టర్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మున్నేరునదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బుధవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పోలేపల్లి వద్ద మున్నేరుపై జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, భూ సేకరణ పురోగతి, మున్నేరు భూ నిర్వాసితులకు ప్రభుత్వం ఇచే స్థలం, మున్నేరు యాక్విడెట్‌ను పరిశీలించారు. రోజువారి ఎంత మేరకు పని జరగాలో ప్రణాళిక, కార్యాచరణ చేసి పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసుకుని పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలించి వరదలు వస్తే ఎంత మేరకు నీరు చేరుతుంది. రిటైనింగ్ వాల్‌లో నాణ్యత, నిర్మాణంలో మెటీరియల్, వాల్ క్యూరింగ్ విషయాలలో పాటించాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ అధికారులకు, గుత్తేదారులకు వివరించారు. రిటైనింగ్ వాల్ పక్కన మున్నేరు ఉన్నది అనే ఆనవాళ్లు పోకుండా నిర్మాణంలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎక్కువ మొత్తంలో వరదలు వచ్చినా కూడా ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ప్రవాహ సామర్థ్య అంచనాతో శాస్త్రీయంగా నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మున్నేరు వాల్‌కు అనుకుని రోడ్డు, రోడ్డు పక్కన డ్రైనేజీ కాలువను నిర్మిస్తున్నామన్నారు. భూములు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూమిని ఇచ్చి భూసేకరణ చేసేలా అధికారులు, రైతులతో చర్చలు జరుపుతున్నారన్నారు. భూ నిర్వాసితులకు అభివృద్ధి చేసిన భూములు ప్రత్యామ్నాయంగా అందించి అవసరమైన భూమి సేకరణ చేస్తామని తెలిపారు. మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూరైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, డిఇ రమేష్, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్ఐ క్రాంతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నా రు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:ములుగు జిల్లా కేంద్రంలో మాజీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు స్వర్గీయ నల్లెల కుమారస్వామి జ్ఞాపకార్థం ములుగు జిల్లా హాస్పటల్ ముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చంటదర్ ఆధ్వర్యములో చలి వేంద్రం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా హాజరై చలి వేంద్రాన్ని ప్రారంభించిన రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఈ సందర్భంగా జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగి, వడగాలులు వీస్తున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలో బయట తిరగొద్దని, వడదెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. ప్రజలు వీలైనంత వరకు పగటి పూట ఇంటి వద్దనే గడపాలని, అత్యవసర పనులకు మాత్రమే బయటకు రావాలని అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు, చేతి రుమాలు, టవల్ వినియోగించాలని, బయటి పదార్థాలు తినకూడదని, ఎక్కువగా నీళ్లను తాగాలని, పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ లాంటి ద్రవ పదార్థాలను తీసుకోవాలన్నారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి సకాలంలో చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా, బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు

ములుగు ఎస్పి డా॥ శబరీష్ పి, ఐపిఎస్

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి : జనజీవన స్రవంతులు ఉండాలని ఉద్దేశంతో ఇద్దరు మావోయిస్టు రాళ్లు ములుగు జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్ వద్ద లొంగిపోయారు. ఎస్పి మాట్లాడుతూ, ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్ట్ పార్టీ నేషనల్ పార్క్ ఏరియా కమిటీకి చెందిన సభ్యురాలు అయిన అలువ స్వర్ణ స్వర్ణక్క పొట్టేరు గ్రామం, కలిమెల మండలం, మల్కాన్ గిరి జిల్లా, ఒడిస్సా రాష్ట్రం, పుల్సం పద్మ, గంగక్క గ్రామం దివంగత కటకం సుధర్షన్ ఆనంద్ (సెంట్రల్ కమిటీ సభ్యుడు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి పిఎం) యొక్క భార్య, ములుగు జిల్లా, కన్నాయి గూడెం మండలం, తుపాకులగూడెం గ్రామం, లకు ములుగు వారిగా గుర్తించి వారికి ప్రభుత్వం తరపున అందవలసిన రివార్డును అందజేశారు. స్వర్ణక్క కు 4,00,000/ విలువ కలిగిన డిడి ని పుల్సం పద్మ ఊరే గంగ (డివిసిఎం) కు 5,00,000/ విలువ కలిగిన డిడి ని అందజేశారు. వారికి భవిష్యత్తులో ఏ అవసరం కలిగిన ప్రభుత్వం తరపున అండగా ఉంటామని, సహకరిస్తామని ఎస్పి అన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి : సిపిఐ

ప్రజాపక్షం/జఫర్‌గడ్: మండలంలోని తమ్మడపల్లి ఐ, ఉప్పుగల్లు, తమ్మడపల్లి జి గ్రామాలలో ఈ నెల 23, 24వ తేదీలలో ముగ్దుం తండా గ్రాం నుండి జరుగు సిపిఐ పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మండల కార్యదర్శి జువారి రమేష్, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండి యాకూబ్ పాషా, పెండ్యాల సమ్మయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు మారుతున్నారు, ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ రైతులకు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్నారు. తక్షణం దేవాదుల వరద కాలువ నిర్మాణ పనులు పూర్తిచేసి రైతులకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఎండిన పంటలకు రూ.50వేల నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. పాదయాత్రను విజయవంతం చేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రడపాక సత్తయ్య, మంద బుచ్చయ్య, కూరపాటి చంద్రమౌళి, అన్నెపు అజయ్, నక్కా రాజేంద్రం, ఎర్రం మధు, గద్దం రాజు, పద్మ, ఎర్రం సతీష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాభివృద్ధికి మరిన్ని కేటాయింపులు అవసరం

ఎస్‌టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య

ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక విద్యాభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల బదిలీలు, నూతన ఉపాధ్యాయుల నియామకం, పాఠశాలలకు ఉచిత విద్యుత్, స్కావెంజర్ల నియామకం, ఉపాధ్యాయుల ప్రమోషన్ల ద్వారా నూతన ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషిచేసిందని ఎస్‌టియూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కానీ మెనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 15 శాతం హామీకి బడ్జెట్ ఆమడ దూరంలో నిలిచిందని, విద్యాశాఖకు గత ఏడాది అంటే 0.20 శాతం కేటాయింపులు తగ్గాయని, ఈ సంవత్సరం 3,04,965 కోట్ల బడ్జెట్లో రూ. 23108కోట్ల నిధులు (7.57శాతం) విద్యకు కేటాయించిందన్నారు. గత సంవత్సరం రూ. 2,74,058 కోట్ల బడ్జెట్లో విద్యకు కేటాయించింది రూ. 21,292 (7.77శాతం) కోట్లు మాత్రమేనని, అంకెల్లో రూ. 1816 కోట్లు పెరిగినట్లుగా ఉన్నప్పటికీ ఖాతాల్లో చూస్తే గత సంవత్సరం కంటే తగ్గిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలలు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ అలాగే ఉపాధ్యాయులకు ఇయ్యాల్సిన పెండింగ్ బిల్లులు మరియు పే రివిజన్ కమిషన్ (పిఆర్‌సి) కేటాయింపులు, ప్రభుత్వ జిల్లా పరిషత్ మండల పరిషత్ పాఠశాలలో చదివే విద్యార్థులు 16 లక్షలు వారిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాల వారు, బాలికలు ఉన్నారని, వీరికి నాణ్యమైన విద్య అందించడానికి ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవు అని పేర్కొన్నారు.

రామప్ప దేవాలయాన్ని సందర్శించిన అమెరికా దేశస్తులు

ప్రజాపక్షం/వెంకటాపూర్ : మండలంలోని పాలపేట గ్రామంలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంను అమెరికా దేశానికి చెందిన సామ్, నైట్ లు సందర్శించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమా శంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు అనంతరం ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ గోరంట్ల విజయకుమార్ వివరించగా రామప్ప టెంపుల్ అమేజింగ్ గా ఉందని కొనియాడారు అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : ఈ నెల 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలను అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. బుధవారం కలెక్టరేట్లో సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 పరీక్షలు నిర్వహిస్తారని, జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 49 పంది ముఖ్య పర్యవేక్షకులు 49 మంది శాఖ అధికారులు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, నలుగురు కస్టోడియన్లు 461 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, నిరంతర విద్యుత్ కల్పించడంతోపాటు ఎఎన్ఎం, ఫస్ట్ ఎయిడ్, ఒఆర్ఎస్ తో అందుబాటులో ఉండాలని, ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన రూట్లలో ప్రశ్న, జవాబు పత్రాలు తరలింపు సమయంలో పోలీస్ అధికారులు తప్పనిసరిగా ఉండాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని అన్నారు. విద్యార్థులు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, డిఇఒ జ్ఞానేశ్వర్, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ కె అరుణ, డిఎంహెచ్ఒ డాక్టర్, ఆర్‌డిఒలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. బుధవారం జనగామలోని సాంఘీక సంక్షేమ పాఠశాల, కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల తనిఖీ చేసి పరిశీలించారు. ప్రతి గదిలో పరీక్షల నిర్వాహణ తీరును నిశితంగా పరిశీలించి విద్యార్థుల హాజరై ఆరా తీశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు, పరీక్ష కేంద్రంలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగాచ జరుగుతున్నాయన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు వ్రాస్తున్నారని, కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య పరీక్షల సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యాశాఖకు తగ్గింపు నిధుల శోచనీయం : చంద్రశేఖర్‌రావు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :గత బడ్జెట్‌తో చూస్తే ఈ ఏడాది విద్యాశాఖకు 0.20 శాతం నిధులు తగ్గాయని యూటిఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులు పి చంద్రశేఖర్‌రావు అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన 15శాతం హామీ గంగలో కలిసిందన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది 2లక్షల 74వేల 58 కోట్ల బడ్జెట్‌లో 21వేల 292(7.77శాతం) కేటాయిస్తే ఈ ఏడాది 3లక్షల 4వేల 965 కోట్ల బడ్జెట్‌లో 23వేల 108 కోట్లు (7.57 శాతం) మాత్రమే కేటాయించారన్నారు. అంకెల్లో 1816 కోట్లు పెరిగినా గత బడ్జెట్‌తో చూ స్తే తగ్గిందన్నారు. విద్యాశాఖ పరిధిలో 26వేల 67 పాఠశాలలను గాలికి వదిలేసి, రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ప్రభుత్వం చెబుతుందన్నారు. గురుకులాల్లో చదివేది 5.5లక్షల మంది విద్యార్థులు కాగా ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్‌లో చ దివే విద్యార్థుల సంఖ్య 16లక్షలు అని వీరంతా బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేన్నారు. విద్యకు మెరుగైన బడ్జెట్ కేటాయింపులు ఉంటేనే పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడంతో పాటు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు.

ఎస్ఆర్ఎఫ్ 'ఎక్సలెంట్ అవార్డ్స్-2025' ప్రదానం

ప్రజాపక్షం/హసన్ పర్తి : రవీంద్రభారతిలో అవార్డు తీసుకున్న వాళ్ళు భారత దేశం గర్వించే స్థాయిలో ఉన్నారని, ఎస్ఆర్ఎఫ్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటి ఇక్కడికి వచ్చిన వారు కూడా సర్వోన్నతమైన స్థాయిలో నిలుస్తారని ఉమ్మడి రాష్ట్రాల ఐటి కమిషనర్ జీవన్ లాల్ ఆకాంక్షించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఎస్ఆర్ఎఫ్ ఎక్సలెంట్ అవార్డ్స్ 2025ల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి రాష్ట్రాల ఐటి కమిషనర్ జీవన్ లాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్ఆర్ఎఫ్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థిని విద్యార్థులకు డిస్టిక్, రాష్ట్రస్థాయి అవార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీవనలాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎవరికైనా ఒక్క స్టేజిపై అవార్డు తీసుకోవాలని ఆశ ఉంటుంది అది ఒక్క రవీంద్ర భారతి అని, ఇక్కడ అవార్డు తీసుకోవడం మామూలు విషయం కాదని ఈ అవకాశం కల్పించిన ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మ అమరేష్ ను మనం గొప్పగా ప్రశంసించాలని అన్నారు. ఈ అవకాశం అందరికీ రాదని మీకు వచ్చిందని మీరు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని, మీ గెలుపు లోనే మీ తల్లిదండ్రులు సంతోషాన్ని వెతుక్కుంటారన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద కంపెనీలను నడిపించేది మన భారతీయులేనని, నాసాలోనూ మనోళ్లే ఉన్నారని గుర్తు చేశారు. ఇలాంటి పిల్లలే రేపటి భవిష్యత్తులో ప్రపంచాన్ని ఏలుతారని, స్వార్థంగా పనిచేసే ఈ రోజుల్లో నిస్వార్థంగా విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు గత 22 సంవత్సరాలుగా ఎస్ఆర్ఎఫ్ చేస్తున్న కృషి అమోఘం అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐటీ కమిషనర్ జీవన్ లాల్ తో పాటు అవార్డుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్ రావు, పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, కెయు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చిర్రా రాజు గౌడ్,డబ్ల్యూఈఒ జాతీయ అధ్యక్షులు సిహెచ్ భద్ర, ఎస్సార్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేష్, స్వరాజ్ న్యూస్ సిఇఒ, ఎస్ఆర్ఎఫ్ అడ్వైజర్ పులికంటి రాజేందర్, ఎస్ఆర్ఎఫ్ బృందం తోట రాజు శశి, దిలీప్, బాలు, రమేష్, సన్నీ పాల్గొన్నారు.

చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ల ప్రైవేట్ ఆలోచనను విరమించుకోవాలి

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఎఐటియుసి గని మేనేజర్లకు మెమోరండం

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : సింగరేణిలోచీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్లను ప్రైవేటుపరం చేయడాన్ని సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో అన్ని గనుల డిపార్ట్మెంట్లపై మేనేజర్లకు మెమోరండంలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సింగరేణిలో అధికారులను చీఫ్ మెడికల్ ఆఫీసర్ ను అట్లాగే చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ప్రైవేట్‌పరం చేయడంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ యాజమాన్య, ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కెటికె 1 ఇంక్లైన్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జి.శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ సదయ్య, కొమురయ్య, దే కెటికె ఒసి 2 లో ఫిట్ సెక్రటరీ కరిముల్లా, చేరాలు, కృష్ణ, నారాయణ, కెటికె 5 ఇంక్లైన్ లో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా, దోర్నాల తిరుపతి, ఫిట్ సెక్రటరీ రాజేందర్, నారాయణ మూర్తి, కెటికె 6 ఇంక్లైన్ లో బ్రాంచ్ నాయకులు నూకల చంద్రమౌళి, ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్, రాజన్న, రాంబాబు, కెటి కె 8 ఇంక్లైన్ లో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మధు గాని విజేందర్, ఫిట్ సెక్రటరీ శంకర్, శ్రీనివాస్, జగత్ రావు, కేటీకే ఓసి త్రీ లో ఫిట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, మహేందర్, ఏరియా హాస్పిటల్ లో బ్రాంచ్ నాయకులు తాళ్ల పోచం, ఫిట్ సెక్రటరీ రమేష్, సతీష్, ఏరియా వర్క్ షాప్, స్టోర్స్ లో టెక్నికల్ ఇంచార్జ్ రవికుమార్, శ్రీనివాస్ లు సేఫ్టీ, మైనింగ్, టెంపుల్ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీచేసిన ఎస్పి

ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పి సుధీర్ రాం నాథ్ కేకన్ అన్నారు. జిలాలోని నర్సింహులపేట పోలీస్టేషన్‌ను మంగళవారం ఎస్పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ, సిబ్బంది బసచేసే ప్రాంతాలు, స్టేషన్ గదులు పరిశీలించి పరిశుభ్రతపై ఆరా తీశారు. స్టేషన్ రికార్డులు పరిశీలిస్తూ ప్రస్తుతం ఉన్న కేసుల విచారణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి దర్యాప్తు వేగవంతం చేసేందుకు ప్రత్యేక కార్యచరణ ఉండాలని, ప్రతి కేసు నిష్పక్షపాతంగా, నాణ్యతతో దర్యాప్తు చేయాలని ఎస్‌హెచ్‌ఒకు సూచించారు. జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, విద్యావంతులు ఎక్కవగా ఈ నేరాలకు గురవుతున్నారని, ఎస్పి ఆందోళన వ్యకత చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్స్,ఫేక్ లింక్స్, మోసపూరిత యాప్స్ ద్వారా యువత నష్టపోతున్నారని,అందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పి ఈ సందర్భంగా సూచించారు. పాఠశాల, కళాశాలలు, సోషల్ మీడియా వేదికగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పి ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ నుంచి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలు ట్రాఫిక్‌రూల్స్ పాటించే లా సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూ చించారు. స్టేషన్ సిబ్బంది ప్రజలకు 24/7అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రయాణాలు చేయాలని చెప్పారు. తొర్రూర్ డిఎస్పి కృష్ణకిషోర్, తొర్రూర్ సిఐ గణేష్, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ సిఐ వెంకశ్వర్లు, ఎస్ఐ సురేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో నీరు వృథా చేయొద్దు

మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : వేసవికాలంలో పట్టణ ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ బిరుదు శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డు పుల్లూరి రామయ్య పల్లిలో వాటర్ సప్లై పై మున్సిపల్ కమిషనర్ కాలనీ ప్రజలను నీటి సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ, రానున్న వేసవికాలం దృష్టిలో ఉంచుకొని నీటి గూర్చి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండుటకు ఎప్పటికప్పుడు వాటర్ లీకేజీలు లేకుండా వెంటనే మరమ్మత్తులు చేపించాలని మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ బి మానస, వాటర్ సప్లై సిబ్బందిని ఆదేశించారు. నీటిని వృథా చేయకుండా ట్యాపు ఆఫ్ చేసుకోవాలని, నీటి కులాయికి మోటారు బిగించరాదని ఒకవేళ బిగించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీ కాలనీలో ఎలాంటి నీటి సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురావాలని కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. మున్సిపల్ ఎఇ బి మానస,మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఓటర్ నవీకరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :ఓటరు జాబితా రూపకల్పన, నవీకరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఐడిఓసి కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా పరిశుద్ధత చాలా ముఖ్యమైనదని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిదని ఆయన సూచించారు. గత సంవత్సరం నవంబర్ నుండి ఈ నెల 18వ వరకు నూతన ఓటరు నమోదుకు ఫారం 6 ద్వారా 1040 దరఖాస్తు లు రాగా 973 విచారణ పూర్తి చేశారని, 67 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఫారం 7 కు 859 రాగా 791 విచారణ జరిగిందని 68 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. చిరునామా మార్పు కు 950 దరకాస్తులు వచ్చాయని వాటిలో 916 విచారణ పూర్తి కాగా 34 పెండింగ్ ఉన్నాయన్నారు. కరెక్షన్స్ కొరకు 1962 దరఖాస్తులు వచ్చాయని వాటిలో ఇప్పటి వరకు 1846 విచారణ పూర్తి కాగా 116 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాభితా తయారుకు రిటర్నింగ్ అధికారి ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూతు స్థాయి ఏజెంట్లను నియమించి జాభితా అందచేయాలని సూచించారు. ఫారం 7 ద్వారా నోటీస్ జారీ తదుపరి మాత్రమే ఓటు హక్కు తొలగించాలని, సుమోటో గా తొలగించడానికి అవకాశం లేదని తెలిపారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, రెండు ఓట్లున్న ఓటర్లను తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ కార్యకర్తల ద్వారా సరైన ఓటరు వివరాలను అందించేందుకు ముందుకు రావాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా సహకరించాలని ఆయన సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు కాబట్టి, ప్రతి అర్హుడు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, ఇమామ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధించడం గురించి అవగాహన

డిఎస్పి రవీందర్

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మాదకద్రవ్యాల నిరోధకత గురించి ములుగు ఎస్పి శబరీష్ పి ఐపిఎస్ ఆదేశాల మేరకు డిఎస్పి రవీందర్ ఆధ్వర్యంలో ములుగు మండల కేంద్రం లోని సాధన హై స్కూల్ నందు, నిర్వహించడం జరిగింది. డిఎస్పి మాట్లాడుతూ, విద్యార్థులు మారకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అదే విధంగా తోటి విద్యార్థులు ఎవరైనా మారకద్రవ్యాలకు అలవాటు పడినట్లయితే వారి యొక్క సమాచారాన్ని పోలీసులకు గాని లేదా స్కూల్ నందు ఏర్పాటుచేసిన యాంటీ డ్రగ్ కమిటీకి ప్రిన్సిపాల్‌కి గాని తెలియజేయాలని అన్నారు. తెలియజేసినట్లయితే వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, వారికి నగదు బహుమతి ఇవ్వబడుతుంది అని తెలిపారు. విద్యార్థి జీవితం మళ్ళీ మళ్ళీ రాదని జీవితంలో మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడినట్లయితే మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుతారని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. 1)సోషల్ మీడియా, 2)మొబైల్ ఫోన్ వాడకం, 3) పొక్సో చట్టం, 4) బాల్యవివాహలు, 5)సైబర్ క్రైమ్ ల పైన కూడా అవగాహన, కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమములో ములుగు సిఐ వి.శంకర్, ములుగు ఎస్సై సిహెచ్ వెంకటేశ్వరరావు పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం పాల్గొనడం జరిగింది.

25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి : దివాకర టి.ఎస్

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: అనధికారలే ఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ప్రస్తుతం ఫీజు చెల్లించుటకు రాష్ట్ర ప్ర భుత్వం కల్పించిన 25 శాతం రాయితీ అవకాశా న్ని జిల్లాలోని అర్హులైన వారందరూ గడువులోగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని, ఎఫ్‌టిఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్. ఆర్.ఎస్ 2020కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించామని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించవచ్చని అన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఎవరైనా ఈనెల 31వ తేదీ లోగా చెల్లిస్తే 25 శాతం మినహాయింపు ఉంటుందని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తు అధికారులు పరిశీలించి రెండు రోజుల్లోనే అనుమతి మంజూరు చేస్తారని తెలిపారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ఫ్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని అన్నారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25 రాయితీ పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆల్ ఇండియా 35వ ర్యాంకర్ సిరి సహస్రకు సన్మానం

ప్రజాపక్షం/ కమలాపూర్: ఇటీవల వెలువడిన సిఏ ఫలితాల్లో ఆల్ ఇండియా 35వ ర్యాంక్ సాధించిన హన్మకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన చేరాల సిరి సహస్రని ఉమ్మడి రాష్ట్రాల ఐటి కమిషనర్ జీవన్ లాల్ ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ లోని రవీంద్ర భారతీలో ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటి కమీషనర్ మాట్లాడుతూ.... గ్రూప్ 1, 2 రెండు గ్రూపులలో కలిపి 48 వేల 261 మంది హాజరు కాగా 6 వేల 780 మంది ఉత్తీర్ణత సాధించారు. కానీ ఆల్ ఇండియా లెవెల్ లో 35 వ ర్యాంకు సిరి ప్రతిభ కనపరచడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని, మంచి స్థానంలో నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్ రావు, పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, కేయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చిర్రా రాజు గౌడ్, డబ్ల్యూఓ జాతీయ అధ్యక్షులు సిహెచ్ భద్ర, ఎస్సార్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేష్, ఎస్ఆర్ఎఫ్ అడ్వైజర్ పులికంటి రాజేందర్, ఎస్ఆర్ఎఫ్ బృందం తోట రాజు, శశి, మధు, బాలు, సన్ని లు పాల్గొన్నారు.

ఫోకస్

కళారంగం

శామ్యూల్ బెకెట్

నాటకీయతను చేర్చుకున్న జానపద నృత్యం 'స్వాంగ్'

నృత్యాలు సాధారంగా సంగీత ప్రధానమైనవి. వాయిద్యాలు, పాటలే నృత్యాల్లో ప్రధాన భూమిక పోషిస్తాయి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో దుస్తులు లేదా ఆభరణాలు కూడా ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. అయితే, నాటకాన్ని తనలో ఇముడ్చుకొని లేదా నాటకీయతను చేర్చుకున్న నృత్యాలు చాలా అరుదు. అలాంటి అరుదైన నృత్యాల్లో ఒకటి 'స్వాంగ్'. హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో బహుళ ప్రచారంలో ఉన్న ఈ నృత్యాన్ని 'సాంగ్ నృత్యం' అని కూడా పిలుస్తారు. ఎంపిక చేసుకున్న కథలను ప్రేక్షకుల హృదయాంతరాలలో బలంగా నాటుకు పోయేలా చేసే శక్తి వంతమైనది కళారూపంగా స్వాంగ్‌ను పేర్కొవాలి. ప్రదర్శనకారులు, నర్తకులు అందమైన రంగు రంగు జిలుగు దుస్తులు ధరించి పాట, నృత్యంతో పాటు పౌరాణిక గాథలు, చారిత్రాత్మక సంఘటనలను తమ ప్రదర్శనలో సందర్భోచితంగా జొప్పించి, నృత్యనాటకాన్ని రక్తి కట్టిస్తారు. ఈ బహుముఖ ప్రదర్శన హర్యానా సంస్కృతిక వారసత్వంలో అంతర్లీనంగా అంతర్భాగంగా విరాజిల్లుతున్నది. కథను సంగీతానికి జోడించి చెప్పుతూ దానికి తగుపాళ్ళల్లో నృత్యాన్ని అందించడం ఈ నృత్య రూపకం విశిష్టత. అనేకరాష్ట్రాల్లో ప్రాంతీయ జానపద నృత్యంగా ఉన్న స్వాంగ్ నృత్యరూపం మాల్వా ప్రాంతం లో ఉద్భవించింది. ఈనృత్యాన్ని రంగస్థల వేదికపై ప్రదర్శిస్తారు. రంగస్థల ప్రదర్శన కోసం ముందుగా ఒక ప్రదర్శనకు స్క్రిప్ట్ తయారు చేస్తారు. ఇది కొన్నిసార్లు సంగీతం లేకుండా నృత్యం యొక్క సాధారణ శైలి యొక్క సరిహద్దుల మీద చేసే అసాధారణమైన నృత్యం కూడా. జానపద కథలు, కల్పితాలు, ఇతిహాసాల ఆధారంగా ప్రదర్శన స్క్రిప్ట్ ఉంటుంది. మిమిక్రీ ద్వారా, సామాజిక అవగాహనను వ్యాప్తి చేసే అద్భుతమైన విషయాలను ఈ నృత్యరూపంలో కలిగి ఉంటుంది. ఈ ప్రదర్శనను స్థానిక మాండలికంలో 'నాకల్కర్ణ' లేదా 'రంగ భర్ణ' అని కూడా పిలుస్తారు.

వేదికపై ఈల వేయడం నిషిద్ధం



రంగస్థలంపై ప్రదర్శనలు జరిగే సమయంలో వేదికపై ఈల వేయడాన్ని చాలా ప్రాంతాల్లో నిషేధించారు. ఆ ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగుతున్నది. చాలామంది దీనిని దురష్టకరమైన చర్యగా పేర్కొంటాయి. అయితే, స్టేజీపై ఈల వేయకూడదని అనడానికి కారణం వేరే ఉంది. రంగస్థలంపై ప్రదర్శన కోసం తెర అత్యవసరమయ్యేది. కానీ, తెర వేసి, తీయడానికి ప్రత్యేకమైన శిక్షణ పొందిన వారు ఉండేవారు కాదు. అంతేగాక, నాటకాలకు అవసరమైన దృశ్యాలను ఎప్పటికప్పుడు సిద్ధం చేయడానికి తాళ్లతో స్క్రీన్లను చాకచక్యంగా అమర్చాల్సి వచ్చేది. ఇలాంటి పనులను నావికులు సులభంగా చేస్తారు కాబట్టి, వారితోనే రంగస్థలానికి అవసరమైన ఏర్పాట్లు చేయించేవారు. తెరచాపకు అవసరమైనప్పుడు కుట్లువేయడం, తాళ్లు కట్టి, గాలికి అనువుగా దానిని తిప్పడం వంటి నైపుణ్యాలు వారికి ఉండేవి. పడవలు, ఓడల్లో ఈ పనులు చేసే సమయంలో, ఒకరికొకరు సమాచారాన్ని అందించుకోవడానికి ఈల వేసేవారు. ఆ రోజుల్లో హెడ్‌సెట్లు ఉండేవి కాబట్టి, ఒకరితో మరొకరు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి 'ఈల' వేయడం ఒక్కటే మార్గాంతరంగా ఉండేది. అదే అలవాటు కొద్దీ స్టేజీపైన కూడా ఈలవేస్తే, ఒక్కోసారి అనుకోకుండానే కర్టెన్లు వేసేయడం లేదా తెర వెనుక పనిచేస్తున్నవారు హడావుడిగా స్టేజీపైకి రావడం జరిగేది. ఈ సమస్యను నివారించడానికే స్టేజీపై ఈల వేయడాన్ని నిషేధించారు. ఇప్పుడు పరిస్థితులు మారినా, ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చినా, 'ఈలపై నిషేధం' చాలా దేశాల్లో అమలవుతునే ఉంది.

సమాజ రూపురేఖలు మార్చిన 'కెటాస్ట్రోఫ్'

అత్యంత ప్రభావమంతమైన కళారూపాల్లో 'నాటకం' ఒకటి. సామాజిక రుగ్మతలను ఎండగట్టి, సమాజ రూపురేఖలను మార్చిన నాటకాలు ఎన్నో ఉన్నాయి. ప్రత్యేకించి రాజకీయాల నేపథ్యాన్ని ఇతివృత్తంగా చేసుకున్న నాటకాలు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది పాఠకులను, ప్రేక్షకులను ఒకేరీతిలో అలరిస్తున్నాయి. అలాంటి రాజకీయ నాటకాల్లో శామ్యూల్ బెకెట్ రచించిన చిన్న నాటకం 'కెటాస్ట్రోఫ్' (విపత్తు)ను ప్రత్యేకంగా పేర్కోవాలి. అసోసియేషన్ ఇంటర్నేషనల్ డి డిఫెన్స్ డెస్ ఆర్టిస్ట్స్(ఎఐడిఎ) కోరిక మేరకు, 1982లో బెకెట్ ఫ్రెంచ్ భాషలో రాసిన ఈ నాటకాన్ని అదే ఏడాది జులై 21న అవిగ్నాన్ ఫెస్టివల్‌లో మొదటిసారి ప్రదర్శించారు. బెకెట్ రాసిన అత్యంత ఆశావద రచనల్లో ఇది ఒకటి. రాజకీయాలు సమాజాన్ని ఏ విధంగా నియంత్రిస్తున్నాయి? సెన్సార్‌షిప్ ఏ విధంగా ప్రజాహక్కులకు కళ్లెం వేస్తున్నది? అనే అంశాలను బెకెట్ ఈ నాటకంలో ప్రస్తావించాడు. 2022లో, ఇరానియన్ నాటక రచయిత రెజా షిర్మార్జ్ ఈ నాటక పునర్ముద్రణకు ముందుమాట రాయడం విశేషం. అప్పట్లో జైల్లో ఉన్న చెక్ నాటకకారుడు వాక్లావ్ హావెల్‌కు ఈ పుస్తకాన్ని బెకెట్ అంకితం చేసిన విషయాన్ని కూడా అతను ప్రత్యేకంగా ప్రస్తావించాడు. కెటాస్ట్రోఫ్ అనేది సెన్సార్ చేతుల్లోపడిన సమాచార వ్యవస్థ ఏవిధంగా మూలాలను కోల్పోతుందో ఈ నాటకంలో వివరిస్తాడు బెకెట్. నాటకంలోని కథానాయకుడు తన చుట్టూ ఉన్న వ్యవస్థలు, అమలవుతున్న క్రమబద్ధమైన నియంత్రణ కారణంగా స్వేచ్ఛను కోల్పోతాడు. ప్రేక్షకులను చూస్తూ, నిశ్శబ్దంగా తన అభిప్రాయాలను వ్యక్తీకరిస్తాడు. సామాజిక కారకాల్లో ఒకటైన రంగస్థలం కూడా రాజకీయ పంజరంలో చిక్కుకొని, బయటపడలేక పోతున్న వైనాన్ని అద్భుతంగా వివరిస్తాడు. ఈ నాటకం కథాంశం వినూత్నంగా ఉంటుంది. దర్శకత్వం కూడా అంతే విలక్షణంగా కనిపిస్తుంది. అప్పటివరకూ నాటకరంగంలో ఎవరూ చేయని ప్రయోగాలను బెకెట్ చేశాడు. కథానాయకుడి పాత్రను సామాజిక, రాజకీయ వ్యవస్థల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న సామాన్యుడి జీవన గమనంగా మలిచాడు. ఈనాటకాన్ని నిరంకుశత్వ శక్తి, దానిని వ్యతిరేకించే పోరాటం, నియంతలు(దర్శకుడు, అతనిసహాయకుడు) పాలించిన ప్రజలకు ఉపమానంగా ప్రాతినిధ్యం వహిస్తున్న కథానాయకుడిని పేర్కోవచ్చు. అతని దుస్తులు భంగిమలో దయనీయమైన నిరుత్సాహం కనిపిస్తుంది. 'సర్దుబాటు' గుణం ఒక సామాన్యుడి వ్యక్తిత్వానికి, సగటు జీవి పరిస్థితులకు అద్దం పడుతుంది. అయితే, నాటకం చివరలో, అతను మానవత్వాన్ని చాటుతాడు. వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటాడు. పరిస్థితులు ఎలావున్నా, కష్టనష్టాలను ఎంతకాలం భరించినా... ఏదో ఒక సమయంలో తిరుగుబాటు తప్పదన్న సారాంశాన్ని బెకెట్ తననాటకం ద్వారా చాటిచెప్పాడు. చాలా సందర్భాల్లో రచయిత బెకెట్ స్వయంగా సామాన్యుడి పాత్రను పోషిస్తే, దర్శకుడు రాజకీయ నాయకుడిగా నటిస్తాడు. అందుకే, ఈ నాటకం ఒక ప్రత్యేక దృశ్యకావ్యంగా పేరు సంపాదించింది. పలు భాషల్లోకి అనువాదమైన 'కెటాస్ట్రోఫ్'ను ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఎన్నోదేశాల్లో ప్రదర్శిస్తున్నారు.

గిరిజన వారసత్వ ప్రతీక 'ఆది మహోత్సవ్'



ప్రపంచ వ్యాప్తంగా వేలాది గిరిజన జాతులు ఉన్నాయి. వాటివాటి ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. ఈ గిరిజన సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించేందుకు నిర్వహిస్తున్న 'ఆది మహోత్సవ్' గిరిజనుల వారసత్వానికి ప్రతీకగా నిలుస్తున్నది. ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియంలో ఈ నెల 24వ తేదీ వరకూ జరిగే ఆది మహోత్సవ్‌లో గిరిజనుల హస్తకళలు, సంస్కృతి, వారసత్వాన్ని గుర్తుచేసుకోవడంతోపాటు, వారి స్థిరత్వం, ఆర్థిక సాధికారత పైన కూడా ఈ మహోత్సవం దృష్టి కేంద్రీకరించింది. అదే విధంగా జీవావరణ శాస్త్రంపై ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి, సాధించాల్సిన లక్ష్యాలను వివరిస్తున్నది. ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (టిఆర్ఐఎఫ్ఇడి) పర్యవేక్షణలో ఇప్పటికే రెండు పర్యాయాలు ఆది మహోత్సవ్ వేడులు నిర్వహించారు. వరుసగా మూడో సంవత్సరం కూడా ఈ ఉత్సవం జరుగుతున్నది. సుమారు రెండున్నర నెలలపాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, హస్తకళలు, చేనేత, కలంకారీ ప్రదర్శనలు కూడా ఉన్నాయి. గిరిజనుల వంటకాలు, వాణిజ్య స్ఫూర్తికి కూడా ఈ వేడుక వేదికైంది. గ్రామీణ, అటవీ ఆధారిత వ్యవస్థాపకతను పెంచి, గిరిజన సమాజాలను అవిశ్రాంతంగా సంరక్షించడమే లక్ష్యంగా ఎంచుకున్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది సందర్శకులను ఆకర్షించే ఈ వార్షిక సాంస్కృతిక, వాణిజ్య ప్రదర్శనలో 600 మందికి పైగా గిరిజన కళాకారులు తమ చేతి పనులను ప్రదర్శిస్తున్నారు. సరస్ ఆజీవిక మేళా, సూరజ్‌కుండ్ క్రాఫ్ట్స్ మేళా వంటి ప్రధాన పండుగలతో పాటు నిర్వహించే ఈ కార్యక్రమం, కళ, వారసత్వ ఉత్సవాలకు కేంద్రంగా విరాజిల్లుతున్నది. గ్రామీణ, అటవీ ప్రాంతాల వారి జీవనోపాధికి, వారి వికాసానికి తోడ్పడుతున్నది. ఆర్థిక సాధికారత కార్యక్రమాల ద్వారా గిరిజన చేతివృత్తులవారి సామాజిక, ఆర్థిక పరిపుష్టికి మద్దతు ఇస్తున్నది. ఇండోనేషియా, శ్రీలంక తదితర దేశాల నుండి అంతర్జాతీయ భాగస్వామ్యంతో కళాకారులు సేంద్రీయ ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, ఆభరణాలు, పెయింటింగ్‌లు, పర్యావరణ అనుకూల హస్తకళలను ప్రదర్శించారు. మహువా ఆధారిత ఉత్పత్తులను మార్కెట్ చేయడమే కాకుండా చిన్నరైతులు, వ్యాపారాలకు మూలికా ఉత్పత్తుల ప్రాసెసింగ్‌లో శిక్షణ ఇస్తున్నది. మొత్తం మీద ఆది మహోత్సవ్ వేలాదిగా సందర్శకులను ఆకర్షిస్తున్నది. ఇలాంటి ఉత్సవాలు అన్ని రాష్ట్రాల్లోనూ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చూస్తే అర్థమవుతుందని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం రూ.7.57 శాతం నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అవగతమవుతుందన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో డొల్లతనం కనిపిస్తుందని విద్యా రంగానికి కేటాయించాల్సిన కనీస బడ్జెట్‌ను కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం గత సంవత్సరం, ఈ సంవత్సరానికి 0.2 శాతం మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వ విద్యాలయాలకు తక్కువ నిధులు కేటాయించడం తగదన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి ప్రస్థావనే లేదని ఆయన విమర్శించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు సుమారుగా రూ.11,600 కేటాయిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, గురుకులాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఊసేలేదని, డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, సొంత భవనాల నిధులు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు కౌశిక్, నాయకులు మనోజ్, గణేష్, ప్రతాప్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

యువజనరంగాన్ని విస్మరించిన రేవంత్ సర్కార్ : ఎఐవైఎఫ్





ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువజన రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బోనగిరి మహేందర్‌లు సంయుక్త ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్‌లో జాబ్ క్యాలెండర్‌తో పాటు నిరుద్యోగ భృతి రూ.4వేలు ఇస్తామని ప్రకటించిందని, విద్య, ఉపాధి కల్పనకు యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఉపాధి రంగానికి కేవలం రూ.900 కోట్ల నిధులు కేటాయించడం సరికాదన్నారు. నిరుద్యోగ యువతకు వారి భవిష్యత్తుపై ప్రభుత్వం ఆశను రగిల్చిందని, కానీ వాస్తవ అమలులో తేడాలున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల సత్వర భర్తీతో పాటు ఇతర రంగాలలో ఉపాధి కల్పించే దిశగా మహిళలు, వెనుకబడిన వర్గాల యువత కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పి బడ్జెట్‌లో కేవలం రూ.465 కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తే సవతి తల్లి ప్రేమ కనబడుతున్నదన్నారు. కేటాయింపులు, నిధుల మంజూరుకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రశ్నించే నిరుద్యోగులపై నిర్బంధాన్ని మానుకోవాలని, లేనిపక్షంలో యువత ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

ఆశాజనకంగా లేదు..

సిపిఐ భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



ప్రజాపక్షం/భువనగిరిరూరల్ : రాష్ట్ర బడ్జెట్ అంత ఆశాజనకంగా లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. యాదాద్రి జిల్లాలోని రైతులకు సరిపడా నీటి వనరులకు నిధులు కేటాయింపు స్పష్టత లేదన్నారు. నక్కలగండి ప్రాజెక్టు, బునాదిగాని కాలువ, మూసి ప్రక్షాళన, బస్వాపురం రిజర్వాయర్ ద్వారా సాగునీరు పూర్తి చేయటం ముంపుకు గురైన రైతులను ఆదుకోవడానికి అలాగే గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తి చేయుటకు అన్నిటికి నిధులు సరిపడా ఇవ్వవలసి ఉందని తెలిపారు. యాదగిరిగుట్ట మిగిలిన పనులు తక్షణమే పూర్తి చేయుటకు బడ్జెట్లో నిధుల కేటాయింపు లేదన్నారు. జిల్లాలోని 6 మున్సిపాలిటీలకు సరిపడ నిధులు బడ్జెట్లో పెట్టలేదు. జిల్లాలోని ప్రధాన రహదారులకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం బడ్జెట్లో లేదన్నారు. మన జిల్లా శాసనసభ్యులు ప్రభుత్వ మీద ఒత్తిడి తీసుకువచ్చే జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం నిధులు తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విద్యారంగానికి బడ్జెట్‌లో నిరాశే

సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వాస్తవానికి దగ్గరలో ఉందని, గత బడ్జెట్ కంటే 14,505 కోట్లు తగ్గుదలతో బడ్జెట్ ప్రెవేశపెట్టడం ఇందుకు నిదర్శనమని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. ఆరు గ్యారంటీల కోసం 56 వేల కోట్లు కేటాయించడం ఆహ్వానించదగిందే అయినప్పటికీ ఆచరణ అనుమానమేనన్నారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్ పెంచి సాగునీటి ప్రాజెక్టులకు కేవలం రూ.23వేల కోట్లు మాత్రమే కేటాయించడం సరైంది కాదన్నారు. విద్య, వైద్య రంగాలకు, సంక్షేమ రంగానికి అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోండని, అప్పులు తెస్తేనే రాష్ట్ర నడిచే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎస్సి, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమని, ఐతే ఆయా రంగాలకు కేటాయించిన బడ్జెట్లోని ప్రతి పైసా పూర్తి స్థాయిలో ఖర్చు చేస్తేనే ప్రజలు హర్షిస్తారన్నారు.

వాస్తవాలను తెలిపే బడ్జెట్

సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : తెలంగాణ బడ్జెట్‌లో రూ.3.04.965 కోట్లు కేటాయించినప్పటికి అందులో విద్యారంగానికి 7.57 శాతం , వైద్య రంగానికి 6శాతం నిధులు కేటాయించటం విద్యా, వైద్యరంగాలకు అభివృద్ధి చెందే అవకాశం తక్కువగా ఉందని, ఈ రెండు అధిక ప్రాధాన్యత గల రంగాలకు అధిక నిధులు కేటాయిస్తే భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రం దేశంలో ప్రథమ స్థానంలో నిలిచే అవకాశం ఉండేదని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలను ప్రతిబింబించే బడ్జెట్ అన్నారు. గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో కేవలం రూ.10వేల కోట్లు మాత్రమే పెంచారన్నారు. ఏది ఏమైనా ఈ బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి దిశగా ప్రయాణం చేయాలని, ప్రజల మీద ఆర్థిక భారం మోపకుండా ఉండాలని మంద పవన్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి విద్యారంగానికి భరోసా కల్పించాలన్నారు.

ప్రజల ఆశలు ప్రతిబింబించని రాష్ట్ర బడ్జెట్

సిపిఐ నేత బాగం హేమంతరావు



ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ మూడు లక్షల కోట్ల రూపాయలు దాటినప్పటికీ బడ్జెట్‌ను పరిశీలిస్తే ప్రజల ఆశలు ప్రతిభింబించేలా లేవని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజల ఆశలను ఈ బడ్జెట్ నెరవేర్చదని ఆయన స్పష్టం చేశారు. బడ్జెట్‌పై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హామీల అమలుకు రూ. 56వేల కోట్లు కేటాయించినప్పటికీ హామీల అమలు నెరవేర్చే పరిస్థితి లేదన్నారు. సాగునీటికి రూ. 23వేల కోట్లు మాత్రమే కేటాయించడం వల్ల ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యే పరిస్థితి లేదన్నారు. విద్య, వైద్య రంగాలకు కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. గత ఏడాది కంటే విద్యా రంగానికి బడ్జెట్ పెరిగిన ఆశించిన స్థాయిలో లేదన్నారు. పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్ కేటాయింపుల్లో గతేడాది కంటే తగ్గాయని హేమంతరావు తెలిపారు. వ్యవసాయ శాఖకు గతేడాది కంటే బడ్జెట్ పెంచడం ఆహ్వానించదగిన పరిణామమే అయిన ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగానికి మరిన్ని కేటాయింపులు జరపాల్సి ఉందన్నారు. విద్య, వైద్య రంగాలను విస్మరించినట్లుగానే సంక్షేమ రంగం పట్ల కూడా బడ్జెట్‌లో వివక్ష ప్రదర్శించారని హేమంతరావు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రం ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయిందని రాష్ట్ర బడ్జెట్ పరిశీలిస్తే అప్పులు తేస్తేనే రాష్ట్రం నడిచే పరిస్థితి ఉందన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయించిన దానిలో రైతుభరోసాకు, విద్య, వైద్య రంగాలకు కేటాయించిన దానిలో జీత భత్యాలకే సింహ భాగం ఖర్చు అవుతుందని హేమంతరావు తెలిపారు. ఎస్సి, ఎస్టిలకు కేటాయింపులు ఉన్న నిధులు ఖర్చు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఎస్సి, ఎస్టి కేటాయింపులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని నిధుల మళ్లింపు ప్రక్రియకు స్వస్తి పలకాలన్నారు. ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులను తూచ తప్పకుండా అమలు చేయాలని హేమంతరావు సూచించారు.

బిసిలను నిరాశపరిచిన భట్టి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల



ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : బుధవారం రాష్ట్ర శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలు బిసిలను నిరాశపరిచిందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. రూ. 3లక్షల 4 వేల 965 కోట్ల బడ్జెట్లో 56 శాతానికి పైగా ఉన్న బిసిల సంక్షేమానికి కేవలం రూ.11, 405 కోట్లు మాత్రమే ప్రతిపాధించడం అన్యాయమన్నారు. బిసిలకు స్థానిక సంస్థలలో, విద్యా ఉద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ బిల్లులు శాసనసభలో చేసి బిసిల విశ్వాసాన్ని చూరగొని అభినందనలు అందుకున్న ప్రభుత్వం బడ్జెట్లో తగిన విధంగా నిధులు కేటాయిస్తుందని ఆశించడం జరిగిందన్నారు. కామారెడ్డి డెకరేషన్‌లో బిసిలకు సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల రూపాయలు కేటాయించి వారి సంక్షేమానికి కృషి చేస్తామని వాగ్దానం చేశారని, కానీ గత సంవత్సర బడ్జెట్‌లో రూ. 9,200కోట్లుమాత్రమే కేటాయించారని ఈ సంవత్సర బడ్జెట్‌లోనైనా గతంలోని రూ.10,800 కోట్లు మరియు ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.20,000 కోట్లు మొత్తంగా రూ.30,800 కోట్లు కేటాయించాలని బిసి సంఘాలు డిమాండ్ చేస్తే పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలోని చేతి వృత్తిదారులకు కూడా బడ్జెట్లో తగిన విధంగా నిధులు ప్రతిపాదించలేదన్నారు. చేనేత, గీత, మత్స్య, రజక, క్షౌర, గొర్రెల పెంపకం దారుల, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి మొదలైన వారికి తగిన విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు.

విద్యారంగానికి తీవ్ర అన్యాయం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు



ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 23,108 కోట్లు (7.57%) నిధులు కేటాయించడం విద్యార్థి లోకానికి తీవ్ర అన్యాయం చేస్తుందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రభుత విద్యారంగం అభివృద్ధి నోచకోదా.? ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తాం అన్న మాట ప్రభుత్వం మార్చిపోయిందన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి 30% నిధులు కేటాయించాలి అఖిల భారత విద్యార్థి సమైక్య డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయిన ఇప్పటికీ విద్యారంగా సమస్యలు పరిష్కారం కాలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 15 నెలలు కానున్న విద్యాశాఖ మంత్రి లేకపోవడం చాలా విచారకరం. ఇది విద్యా రంగంలో పాలనాపరమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించి ఉంటే బాగుండేది

సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : విద్యా, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించి ఉంటే సబ్బండ వర్గాల ప్రజలు బడ్జెట్‌గా ఉండేదని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అభిప్రాయపడ్డారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల మెనిఫెస్టో ప్రకారం విద్యారంగానికి 15 శాతం వైద్య రంగానికి 20 శాతం నిధులు కేటాయించి ఉంటే బాగుండేదన్నారు. మధ్య తరగతి పేదల కుటుంబంలో ఎంత పని చేసినా సుమారు 80 శాతం విద్యా వైద్యానికే ఖర్చవుతున్నాయని ఎన్నికల్లో గెలుపు కోసం ఇస్తున్న వాగ్దానాలను ఉచితాలను పక్కన పెట్టి విద్యా, వైద్య రంగానికి పెద్దపీట వేసి ఉంటే మధ్య తరగతి పేద ప్రజలు సంతోషించే వారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలుకు ఈ బడ్జెట్‌లో కూడా పూర్తిస్థాయి నిధుల ప్రస్తావన లేదని విమర్శించారు.

బిసిలకు అన్యాయం

సిపిఐ గద్వాల జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి : తెలంగాణ అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క 3,04,965 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్లో బిసిలకు కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని జోగులాంబ గద్వాల జిల్లా సిపిఐ కార్యదర్శి బి.ఆంజనేయులు విమర్శించారు. కొన్ని రంగాలకు సరైన కేటాయింపులు జరిగినా, ఎస్సీ, ఎస్టీల కన్నా అధిక జనాభా ఉన్న బిసిలకు కేవలం రూ.11వేల కోట్లు కేటాయించడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమన్నారు. రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న రైతు రుణమాఫీ 2 లక్షల పైనున్న వారికి మాఫీకి బడ్జెట్లో ఊసేలేదన్నారు. యూత్ పాలసీ, నిరుద్యోగ భృతికి బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపునకు నిధులు కేటాయింపులు లేవన్నారు. గట్టు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించలేదన్నారు. ర్యాలంపాడు ప్రాజెక్టు మరమ్మతులకు నిధుల ప్రస్తావన లేదు ప్రభుత్వం ఎంత జాగ్రత్తలు తీసుకొని బడ్జెట్ ప్రవేశ పెట్టినా కొన్ని రంగాలకు సరైన న్యాయం చేయలేకపోయారన్నారు.

నిధుల కేటాయింపులో విద్యారంగంపై నిర్లక్ష్యం

ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటా యించాల్సి ఉండగా కేవలం 7.57 శాతం నిధులు మాత్రమే కేటాయించారని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐ ఎస్ఎఫ్)జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ పేర్కొన్నారు. ఫలితంగా రాష్ట్రంలో అన్ని వర్గాల విద్యార్థులకు విద్యను అందించడం సాధ్యం కాదన్నారు. కేవలం కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెటని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభు త్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పక్కనపెట్టి ప్రజలను మో సం, ప్రజాపాలన పేరుతో కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వానికిస్పష్టమైన అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని ఎద్దేవా చేశారు. పేద వర్గాలందరికీ ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండాలం టే బడ్జెట్‌లో 30 శాతం నిధులు వెంటనే కేటాయిం చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బడ్జెట్‌పై సమీక్షించి సవరణ చేసి నిధులు కేటాయిం పు పట్ల ఆలోచించాల్సిన అ వసరముందని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తం గా పెద్ద ఎత్తున విద్యార్థులు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమ, అభివృద్ధికి కేరఫ్ రాష్ట్ర బడ్జెట్

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మ

ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంక్షే మం, అభివృద్ధికి కేరాఫ్‌గా మారిందనీ మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవందర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యం గా ప్రభుత్వం ముందుకు సాగుతుందనీ, విద్యా, వైద్య, వ్యవసాయం, గృహ నిర్మాణం(ఇందిరమ్మ ఇళ్లకు) కూ పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. బడ్జెట్ పై ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితమని చెప్పారు. వ్యవసాయం రంగానికి రాష్ట్రం ప్రభుత్వం పెద్ద పీట వేయడం సంతోషకరంమన్నారు. ప్రతి నియోజకవర్గం కూ 3500 ఇల్లు కేటాయిస్తామని పేర్కొని, అందుకు అవసరమైన బడ్జెట్ కేటాయించడం హర్షనీయమని పేర్కొన్నారు. పేదల కల సాకరం అయ్యేలా బడ్జెట్ కేటాయించినా రేవంత్ రెడ్డి ప్రభుత్వనికి రాజన్న ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన బడ్జెట్

సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్

ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025 బడ్జెట్ ప్రజాపాలన బడ్జెట్‌గా ఉందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ఆయన బడ్జెట్‌పై మీడియాతో మాట్లాడుతూ రైతులకు, విద్య, గ్రామాల అభివృద్ధికి,స్త్రీ శిశు సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అంకెల్లో గారడీ చేయటం తప్పా రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ అంకెల్లో గారడీల కాకుండ చేతల్లో చేసి చూపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంతో ముందుకు వెళ్తు న్నారని ఆయనకు ప్రజల ఆశీర్వాదం అందచేయాలన్నారు. మరో పదేళ్ల పాటు కాంగ్రెస్ ఉంటే రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

యువతను విస్మరించిన ప్రభుత్వం

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం బుధవారం నాడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో యువతను విస్మరిం చిందని సిపిఐ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025–26కు సంబంధిం విద్యా, వైద్యానికి సంబంధించిన బడ్జెట్‌లో నామినెల్ ప్రవేశపెట్టారన్నది సిపిఐ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో విద్యారంగానికి సంబంధించి 7.3 శాతం ఇస్తే ఈ బడ్జెట్‌లో 7.5%మాత్రమే అంటే 0.2% మాత్రమే పెంచినట్లు తెలిపారు. యువజన రంగానికి సంబంధించి కనీసం కమిషన్ వేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రూ.3వేలు నిరుద్యోగులకి నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్య, వైద్యం యువజన రంగాలకు సంబంధించిన నామినల్ బడ్జెట్‌గా ప్రవేశపెట్టినదని ఈ సందర్భంగా సిపిఐ భావిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థి దశలోనే అవకాశాలను అందిపుచ్చుకోవాలి

యువజనోత్సవంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : విద్యార్థి దశలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని పలు రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవం కార్యక్రమం తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ విద్యార్థి దశలో స్వేచ్ఛ, అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ దశలోనే చదువుతో పాటు సమాజ సేవను అలవర్చుకోవాలని, విద్యార్థులు వాలంటీర్లుగా, లీడర్లుగా సేవలు అందించడం సైతం ముఖ్య మేనన్నారు. ఈ సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో వారు ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. నెహ్రూ యువ కేంద్ర కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు మాట్లాడారు. జిల్లా స్థాయి విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. అనంతరం చిత్రలేఖనం, కవిత్వం వంటి వివిధ రంగాల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ బహుమతులు ప్రదా నం చేశారు. అంతకు ముందు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వాగేశ్వరి విద్యా సంస్థల జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీనివాస్, ప్రకాష్ రెడ్డి,పాల్గొన్నారు.

కల్వల ప్రాజెక్టు కట్టకు గండి

ప్రజాపక్షం/శంకరపట్నం : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కల్వల ప్రాజెక్టు కట్టకు బుధవారం మళ్లీ గండి పడింది. రెండేళ్ల క్రితం కల్వల ప్రాజెక్టుకు గండిపడగా రైతులు ఇటీవల తాత్కాలికంగా గండిపడిన మత్తడి వద్ద నీటి నిల్వ కోసం ట్రాక్టర్లతో మట్టి పోసి కట్ట నిర్మించారు. తాత్కాలికంగా నిర్మించిన కట్ట నిర్మాణంతో నీరు నిల్వ ఉండగా రైతులు వరి సాగు చేశారు. రెండు రోజుల క్రితం నీటిని వదలడంతో బుధవారం తెల్లవారుజామున మత్తడి వద్ద కట్ట తెగి నీరంతా వృధాగా వెళుతోందని కల్వల గ్రామ రైతులు వాపోతున్నారు.

ఖనిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మించాలి

నిధులు తీసుకురావడంలో ప్రత్యేక చొరవ చూపాలి

ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సింగరేణి సంస్థ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం కావడానికి సెంట్రల్ లైబ్రరీని నిర్మించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పవర్ హౌస్ కాలనీలో ఉన్న జిల్లా గ్రంథాలయాన్ని ఏఐవైఎఫ్ నాయకులు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా అక్కడున్న నిరుద్యోగ యువతతో గ్రంథాలయ సమస్యలు తెలుసుకోవడం జరిగింది. అనంతరం ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వేలాదిమంది నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధ మవుతున్న వారికి సరిపడే వసతులతో కూడిన లైబ్రరీ పారిశ్రామిక ప్రాంతంలో లేదని అవేదన వ్యక్తం చేశారు. కేవలం అరకొర వసతులతో సింగరేణి క్వార్టర్లో అద్దె ప్రాతిపదికన లైబ్రరీ నడుస్తుందని, దీన్నిబట్టే ప్రభుత్వానికి, సింగరేణి సంస్థకు నిరుద్యోగ యువత పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో కనబడుతుందన్నారు. సింగరేణి సంస్థ ప్రభుత్వం కలిసి పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ లైబ్రరీని అన్ని వసతులతో కూడిన భవంతిని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులకు సింగరేణి నిధుల నుండి తలా లక్ష రూపాయలు ఇస్తున్న సింగరేణికి సింగరేణి కార్మికుల పిల్లల భవిష్యత్తు పట్టదా అని ప్రశ్నించారు. రామగుండం ఎమ్మెల్యే ఆర్జీ.వన్ జీఎం చొరవ తీసుకొని వెంటనే సింగరేణి సిఎస్ఆర్ నిధులనుండి పారిశ్రామిక ప్రాంతానికి లైబ్రెరీ కోసం నిధులు మంజూరు చేసి అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విధంగా నూతన లైబ్రరీని వెంటనే నిర్మించాలని లేనిపక్షంలో నిరుద్యోగ యువతతో జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రంథాలయంలో అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని సరియైన స్టడీ మెటీరియల్ స్టడీ పాడ్స్ వంటి సౌకర్యాలు లేవని అలాగే లైబ్రరీ చుట్టూ కొంత చెట్లు ఉండడం వల్ల పరి శుభ్రంగా లేదని ఈ సమస్యలన్నింటినీ కూడా జీఎంకి దృష్టికి తీసుకుపోతామని వివరించారు.ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి సురేందర్, రాణవేణి సుధీర్ కుమార్, పోతరాజు నాగరాజు, పాల్గొన్నారు.

అర్హులకు డబుల్‌బెడ్ రూమ్ అందాలి

* సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు వెంటనే అమలు చేసి బడుగు బలహీన వర్గాల ప్రజలకు సమన్యాయం చేయాలని జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సిపిఐ నాయకులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అమలు చేసినప్పటికి వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టితో ఎస్సీ రిజర్వేషన్లు వెనుకబడిన వారికి త్వరితగతిన అందజేసి వారికి న్యాయం చేయాలన్నారు. గత ప్రభుత్వం పేదల అభివృద్ధే ధ్యేయంగా వాళ్లకు పకడ్బందీ ఇల్లు ఉండాలని నిర్మించిన డబుల్ బెడ్ రూం పథకాన్ని సరైన అర్హులను ఎంపిక చేసి అర్హులకు మాత్రమే అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యవర్తులతో కమిషన్‌లకు డబుల్ బెడ్ రూం ఇళ్లను అమ్ముకోవద్దని హెచ్చరించారు. ప్రతి పేదవాడికి ఇల్లు అందే విధంగా చూడాలన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియలోనూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రతి విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుధర్శన్, మీసం లక్ష్మ ణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్ తదితరుల పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలి

ఎఐటియుసి నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్ డిమాండ్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ప్రభుత్వ మెడికల్‌లో పని చేసే సెక్యూరిటీ,శానిటేషన్, స్కావేంజర్లకు ఎలైన్ సాఫ్ట్ ప్రయివేట్ లిమిటెడ్ కాంట్రాక్టర్ తరుణ్ కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం జీతాలు ఇవ్వకుండా శ్రమ, ఆర్థిక దోపిడీ చేస్తూ అన్యాయంగా కార్మికులను పనులలో నుండి తొలగించారాని కార్మికుల్ని భయభ్రాంతులకు గురి చేస్తు న్నా కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్రశేఖర్‌లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి రామ గుండం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ జిల్లా సహాయ కార్మిక కమిషన్ ఎస్ వెంకటరెడ్డిని కలిసి పత్రంఅందజేశారు. అనంతరం వారుమాట్లడుతూ గోదావరిఖనిలోని మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వ జిఒ ప్రకారం వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక, శ్రమ దోపిడీ చేస్తూ నెలకు పదకొండు వేలు మాత్రమే ఇస్తూన్నా కాంటాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని, ఇప్పటి వరకు కార్మికులకు ఎంత పిఎఫ్ కట్ చేస్తున్నారో చెప్పడ్డం లేదనీ, కనీసం ఇఎస్ఐ కార్డ్ కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితి ఉందని, కార్మికులకు ఇప్పటి కైనా జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని తొలగించినా కార్మికులను ఉద్యోగం లోకి తీసుకోవాలని లేకుంటే మెడికల్ కాలేజ్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించ్చారు. కాంట్రాక్టర్‌పై విచారణ చేసి ప్రభుత్వ నిబం ధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న సదరు కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలనీ ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం శనిగరపు చంద్ర శేఖర్‌లు డిమాండ్ చేశారు.

ఆహార నాణ్యత పాటించేలా చర్యలు

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ హాస్టళ్లు, హోటళ్లు, ఆహారం తయారు చేసే కేంద్రాల్లో విరివిగా తనిఖీలు చేసి ఆహార నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యతపై ఫుడ్ సేఫ్టీ జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఆహారకల్తీ, నాసిరకమైన ఆహారం తయారు చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ విషయంలో అను బంధ శాఖల సమన్వయంతో కొన్ని బృందాలను నియమించుకోవాలని, వాటి ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యంగా హోటళ్లు, ఐస్ పాయింట్లు, పండ్ల మార్కెట్లలో తనిఖీలు చేయాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఆహార వస్తువులు, వంటకు వినియోగిస్తున్న సరుకులను పరిశీలించాలని సూచించారు. పోలీసు కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేట్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆహార తయారీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, డిఆర్వో వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సునీత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, డిప్యూటీ డిఎంహెచ్‌వో సుజాత, డిడబ్ల్యూవో సబిత, డిఎస్‌వో శ్రీనివాస్, డిపివో భాగ్యలక్ష్మి , డిఈవో జనార్దన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జిల్లాలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత కలెక్టరేట్ లో 10వ తరగతి పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 ఉదయం 9.30 గం టల నుంచి 12.30 గంటల వరకు జరిగే 10వ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వ హించాలన్నారు.పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.పరీక్షలకు హాజరయ్యే సుమారు 7 వేల మంది విద్యార్థుల కోసం 41 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో అంతరా యం ఉండవద్దన్నారు. విద్యార్థులకు పరీక్షహాల్స్‌లో పరీక్ష కేంద్రాలకు తాగునీటి సరఫరా ఉండే విధంగా మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాలలో ఎక్కడ మాస్ కాపీంగ్ జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి వెంటనే సాగునీరు అందించాలి

వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించిన సిపిఐ బృందం

రైతుకు రూ.5వేల చెక్కు అందజేత

ప్రజాపక్షం/చిగురుమామిడి: అడుగంటిన భూగర్భజలాలతో సాగునీరు అందక వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతుండడంతో రైతులు విలవిలలాడుతున్నారని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ జడ్పిటిసి అందె స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లోని లంబాడిపల్లె, గాగిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో సాగునీరు అందక ఎండిన వరి, మొక్కజొన్న పంటలను బాధిత రైతులతో కలిసి సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడుగంటిన భూగర్భజలాలతో చేతికి వచ్చే సమయంలో పంటలు ఎండిపోతున్నాయని గౌరవెల్లి నీటితో భూములు తడిసేదెప్పుడంటూ వారు ప్రశ్నించారు. ఎన్నో అప్పులు చేసి పంటలు వేసిన రైతులకు చివరి దశలో పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేసినా ఫలితం లేదని మండిపడ్డారు. రాష్ట్రరవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి చిగురుమామిడి మండలంలో ఎండిపోయిన వరి, మొక్కజొన్న పంటలను వ్యవసాయశాఖ అధికారులచే సర్వే చేసి వరి పంటకు రూ.40 వేలు, మొక్కజొన్నకు రూ.30 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. లంబాడిపల్లె గ్రామంలో చేతికొచ్చిన వరి పంట ఎండిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన రైతు చందబోయిన బాలయ్యకు రూ.5వేల చెక్కును సిపిఐ పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అందజేశారు. రైతులు అధైర్యపడొద్దని సిపిఐ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఎనగందుల రాజయ్య, గోలి బాపు రెడ్డి, అందె చిన్నస్వామి, విలాసాగరం అంజయ్య, మంద ఎల్లయ్య, కయ్యం తిరుపతి, కయ్యం వీరన్న, బింగి స్వామి తదితరులున్నారు.

కాళేశ్వరం నీటితో చెరువులను నింపాలి

-బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పాదయాత్ర ద్వారా తహసీల్దార్‌కు వినతి

ప్రజాపక్షం/వీర్నపల్లి: కాళేశ్వరం9వ ప్యాకేజీ పనులు వెంటనే పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని రైతుల మద్దతుతో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మద్దిమల్ల రాయిని చెరువు నుండి తహాశీల్దార్ కార్యాలయం వరకు పాద యాత్ర నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ మల్కపేట డ్యామ్ నుండి అల్మాస్‌పూర్ పంప్‌హౌస్ ద్వారా మద్దిమల్ల రాయిని చెరువుకి నీరు ఎత్తిపోయడం, తద్వారా వీర్నపల్లి వెంకటరాయిని చెరువు, కంచర్ల పోతరాయిని చెరువు, రంగంపేట మార్గండి చెరువులకి , అలాగే నిమ్మపల్లి పంప్‌హౌస్ ద్వారా వన్‌పల్లి హన్మాయి చెరువు, గర్జనపల్లి చెరువు, అడవి పదిర ధర్మా రం చెరువుకి పైప్‌లైన్ ద్వారా సాగు నీరు అందించడం కోసం గత ప్రభుత్వం రూ.166 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పైప్‌లైన్ పనులు జరుగుతున్న సమయంలో ఫారెస్ట్ మూలంగా సుమారు ఒక కిలోమీటరు మేర అల్మాస్‌పూర్ కంచర్ల మధ్యలో పనులు నిలిచిపోవడం జరిగిందని, అట్టి పనులు పూర్తిచేసి నిమ్మపల్లి వన్‌పల్లి హన్మాయి చెరువు పైప్‌లైన్ పనులు మొదలుపెట్టి రైతులకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, మండల అధ్యక్షులు గుజ్జుల రాజిరెడ్డితో పాటు మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గోదారి కన్నీటి గోసకు కారణం కాంగ్రెస్

కోరుకంటి చందర్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : గోదారి కన్నీటి గోసకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వం.. తొలి సిఎం కెసిఆర్ రైతుల కళ్లల్లో ఆనందం నింపితే రేవంత్‌రెడ్డి రైతులకు సాగునీరు అందించకుండా అరిగోస పెడుతున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. గోదావరి గోస మహాపాద యాత్ర మూడవ రోజు కరీంనగర్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. కరీంనగర్‌లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం సేఫ్‌గా ఉందని మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ గోదావరి నది ఎందుకు ఎండిందని ప్రశ్నించారు? మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మరమ్మతు చేయడం లేదో చెప్పాలన్నారు. వృధాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను ఒడిసి పట్టి ఎంతో గొప్పగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి తెలంగాణ తొలి సీఎం కెసిఆర్ గోదావరినదికి జీవం పోస్తే అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు గోదావరినదిని ఎండబెట్టి రైతులను, ప్రజలను అరిగోస పెడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లను ఆపి రివర్స్ పంపింగ్ చేసి గోదావరి నదిని నిండుకుండలా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కరీంనగర్ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, రఘువీర్ సింగ్, శంకర్, బొడ్డు రవీందర్, బండారి ప్రవీణ్, మెతుకు దేవరాజ్, నారాయణదాసు మారుతి, ఇరుగురాళ్ల శ్రావణ్, కోడిరామకృష్ణ, చింటూ, ఆవునూరి వెంకటేష్, బుర్రం వెంకన్న, కిరణ్‌జీ, బచ్చాల రాములు తదితరులున్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికే 'పోలీస్‌దర్బార్'

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

అందరం సమన్వయంతో కలిసి పని చేద్దాం

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్ ఏర్పాటు చేసినట్టు రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝు అన్నారు. బుధవారం ఏఆర్ సిబ్బంది, అధికారులకు రామగుండం కమి షనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపి హాజరై ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలను, వినతిలను ఒక్కొక్కరిని అడిగి తెలుసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. ఎటువంటి సమస్య ఉన్న దర్బార్ లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్‌కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చన్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ అం దరూ సమన్వయంతో క్రమ శిక్షణ, ప్రణాళికబద్ధంగా డ్యూటీ లను నిర్వర్తించాలని రామగుండం కమిషనరేట్‌కి, తెలంగాణ పోలీస్ మంచిపేరు తీసుకురావాలన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో, మంచి ప్రవర్తనతో విధులు నిర్వర్తిం చిన పుడు అధికారులు తమ వెంట ఉంటామన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉండాలనీ ,క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని , తద్వారా మానసిక శారీర ఒత్తిడి నుండి దూరం కావచ్చన్నారు ప్రతి రెండు నెలలకు ఒక సారి మెడికల్ క్యాంపు నిర్వహించి సిబ్బంది అధికారులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, వామన మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ నీటీ సరఫరాలో ఆటంకాలొద్దు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

ప్రజా పక్షం/వేములవాడ టౌన్: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరాలో ఆటంకాలు ఉండకుండా చూసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం అగ్రహారం సమీపంలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, నీటి శుద్ధి, సరఫరా, ల్యాబ్ ను పరిశీలించారు. నీటిని శుద్ధి చేసే ప్రక్రియను క్షుణ్ణంగా కలెక్టర్ కు మిషన్ భగీరథ ఇంజనీర్లు వివరించారు. పంపింగ్ సామర్థ్యం, స్టోరేజి వంటి వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుత వేసవి ఉన్నందున ప్రతి ఇంటికి నల్ల నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోజు నీటి శుద్ధి కేంద్రాల నుండి నీరు సరఫరా జరిగేలా మిషన్ భగీరథ ఇంజనీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ రెండు సార్లు జిల్లాలోని ఓ హెచ్ ఎస్ ఆర్ లను మిషన్ భగీరథ గ్రిడ్ ఇంజనీర్ నింపాలన్నారు. నీటి నాణ్యతను ప్రతి రోజూ నాలుగు సార్లు పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ఏఏ గ్రామాలకు త్రాగునీరు వెళ్లడం లేదు. పూర్తిగా తెలుసుకోవాలన్నారు. త్రాగునీరు వెళ్లని గ్రామాలకు.మిషన్ భగీరథ నీరు వెళ్లేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ కార్య నిర్వాహక ఇంజనీరులు జానకి, శేఖర్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కల సాకారమైంది

క్లబ్ నూతన భవన నిర్మాణం ప్రారంభం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లా జర్నలిస్ట్‌ల కళ సాకారమైందని మెదక్ జిల్లా ప్రెస్ క్లబ్ నూతన భవనంను ప్రారంభించడం సంతోషకరమని మెదక్ ఎమ్మెల్యే డా॥ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని స్టేడియం దగ్గరలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ భవనాన్ని క్లబ్ అధ్యక్షులు దొంతి నరేష్, కార్యదర్శి ప్రసాద్‌లతో పాటు సీనియర్ జర్నలిస్టులతో కలిసి ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రారంభించారు. అనంతరం జర్నలిస్ట్‌లు ఎమ్మెల్యే డా॥ మైనంపల్లి రోహిత్‌కు శాలువా కప్పి, మెమోంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ళ కల ప్రెస్ క్లబ్ భవనం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం సంతోషమన్నారు. జర్నలిస్టుల సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ భాద్యులు కామాటి కిషన్, నర్సింహా చారి, సంగ మేశ్వర్, శంకర్ దాయల్ చారి, శ్రీధర్, చంద్రశేఖర్ రావు, అశోక్, నాగరాజు,గోపాల్ గౌడ్, రామకృష్ణ, రాజగౌడ్, కానుగు రాము, సందీప్, సిద్దేశం, రహమత్, రియాజ్, శేఖర్, ఫసి యుద్దీన్, రామకృష్ణ, కార్తిక్, మల్లికార్జున్, సుభాష్, అంజనేయులు తో పాటు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ, అమ్మకంపై కఠిన చర్యలు

ప్రజాపక్షం/ఖానాపూర్: ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామనికి చెందిన మాసం రాజేశ్వర్ అనే వ్యక్తిని బైడోవర్ ఉల్లాగిచ్చినందుకు జైలుకి పంపినట్లు ఎక్సేంజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ మాసం రాజేశ్వర్ అనే వ్యక్తి గతంలో నాటు సారాయి విక్రయస్తూ పట్టుబడగా అతని పై కేసు నమోదు చేసి ఖానాపూర్ మండల్ తహసీల్దార్ ముందు 2,00,000 రూపాయలు జరిమానా, 2సంవత్సరలా జైలు శిక్షకి బైడోవర్ చేసారు. మాసం రాజేశ్వర్ మళ్ళీనాటు సారాయి అమ్ముతు పట్టుబడిన కారణంగా అతనిపై కేసు నమోదు చేసి ఖానాపూర్ తహసీల్దార్ సుజాతకు తెలిపి అతనిని రిమాండ్‌కు పంపమని, ఎక్సేంజ్ అధికారుల ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జైలుకి పంపినట్లు ఎక్సేంజ్ ఎస్సై తెలిపారు. అదేవిధంగా, కడెం మండలం లక్ష్మిపూర్ గ్రామంలో పోడేటి సత్య గౌడ్ దగ్గర 120కేజీల నల్ల బెల్లం పాకం చేసి అతడి మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నాటుసారాయి తయారు చేసిన అమ్మిన, రవాణా చేసిన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. వీరితో పాటు సిబ్బంది వెంకటేష్, హరీష్, సాయి, రాజేందర్, కల్పనా పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా కొనసాగేలా కృషి

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : యాసంగిలో రైతులు పండించిన ధాన్యాన్నికొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు, కేంద్రాల నిర్వాహకులు అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. రైతులు ఎక్కడ కూడా ఏ దశలోనూ ఇబ్బందులు తలెత్తకుండా నిర్ధిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. రబీ వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో బుధవారం ఆయా శాఖల అధికారులతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈఓలు, ఐకెపి సిసిలు, మెప్మా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఈనెల 20 నుండి జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను రైతులకు అందుబాటులో ఉంచేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులు దళారులకు ధాన్యం కట్టబెట్టి మోసపోకుండా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, జడ్పీ సీఈఓ సాయగౌడ్, సివిల్ సప్లయిస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు:ఎస్పి జానకి షర్మిల

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లా పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.9129 విద్యార్థులకు 47 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండారాదని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద ఏలాంటి సభలు,సమావేశాలు,ర్యాలీలకు,మైకులు,డిజేలతో ఉరేగింపులు,ధర్నలు,ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు.పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్,జిరాక్స్ షాపులు,స్టేషనరీ దుకాణాలు ముసివేయాలని సూచించారు.పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు.ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు,రాజకీయ పార్టీలు,వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు.ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాపక్షం/బోథ్ ఃబోథ్ లోని పలు కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరించాలని పలు పార్టీల నాయకులు బుధవారం బోథ్ ఎంపిడిఓ రమేష్, బోథ్ గ్రామ పంచాయితీ కార్యదర్శి అంజయ్యకు వినతి పత్రం సమర్పించారు. అయితే తాగునీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని అధికారికి వారికి హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో పలువురు మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుల చిత్రపతాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే రోజు మూడు ఘన విజయాలను ప్రజాప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాస పథకం కింద నిరుద్యోగులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఈ మూడు బిల్లులు ప్రవేశపెట్టడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ యువజన అధ్యక్షుడు ఇంరోజ్, ప్రతాప్‌రెడ్డి, జి.జగన్, ప్రజాపందరి, కిష్టారెడ్డి, వెంకట్‌రాం రెడ్డి, గౌస్, అనీస్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని యువకుడు మృతి

ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట్ గ్రామానికి చెందిన గరుగుల భాను తండ్రి రాజు వయస్సు 18 సం॥ అతను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి ఇంటివద్దనే ఉంటున్నాడు. దాంతో చదువుకొమ్మంటే చదువుకోలేదు, పనికి వెళ్లడం లేదు, అని భానుతల్లి తండ్రులు మందలించడం తో నిన్న రాత్రి ఇంట్లో ఎవరూ లేనిది చూసి చీరతో ఉరివేసుకున్నాడని, అది చూసి అతను బ్రతికి ఉన్నాడేమోనని అనుమానంతో క్రిందికి దించి దుబ్బాక ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయినాడు. అని అతని తండ్రి గరుగుల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించనైనది.

సేఫ్టీని విస్మరించిన స్టోర్స్ యాజమాన్యం

ప్రజాపక్షం/శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని స్టోర్స్ యాజమాన్యం భద్రతా ప్రమాణాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి) నాయకులు ఆరోపించారు. బుధవారం యూనియన్ అధ్వర్యంలో స్టోర్స్‌ను సందర్శించిన వారు అక్కడి అసౌకర్యాలను తీవ్రంగా విమర్శించారు. డిప్యూటి ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా మాట్లాడుతూ స్టోర్స్‌లోని షెడ్లలో ఎలక్ట్రికల్ వైరింగ్ అస్తవ్యస్తంగా ఉందని, షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఏరియా స్టోర్స్‌లో అర్హత గల సూపర్వైజర్లు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, గతంలో మందమర్రి ఏరియా స్టోర్స్‌లో టెండల్ సూపర్వైజర్ లేకపోవడం వల్ల ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయినప్పటికీ ఇప్పటికీ టెండల్ సూపర్వైజర్ నియామకం చేయలేదని ఆరోపించారు. స్టోర్స్‌లోకి వచ్చే మెటీరియల్ నాణ్యత ప్రమాణాలను తూతూ మంత్రంగా పరిశీలించి అనుమతులు ఇస్తున్నారని, దీని వల్ల యాజమాన్యానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లే అవకాశముందని పేర్కొన్నారు. మెటీరియల్ నిల్వ చేసే షెడ్లలో ఫ్యాన్స్, లైటింగ్, ఉద్యోగులకు కుర్చీలు, సరైన మరుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేవని విమర్శించారు. శ్రీరాంపూర్ ఏరియాలో 7 భూగర్భ, 2 ఓపెన్ కాస్ట్ గనులు, వివిధ డిపార్ట్మెంట్లు ఉన్నప్పటికీ కార్పొరేట్ నుంచి రావాల్సిన మెటీరియల్ సరిపడా అందడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా చాలాన్ బుక్స్, షార్ట్ ఫైర్ బుక్స్, సర్దార్, ఓవర్ మెన్ బుక్స్ అపసరమైన వాటి కంటే 10 శాతం మాత్రమే వస్తున్నాయని తెలిపారు. మెటీరియల్ తరలింపు కోసం ఉపయోగించే చాలాన్ బుక్స్ లేకపోవడంతో వాటి జిరాక్స్ తీసి వాడుతున్నారని ఆరోపించారు. ఈ సమస్యలపై చర్చించేందుకు గత రెండు నెలలుగా వర్క్స్ కమిటీ సమావేశాలను గుర్తింపు సంఘంతో నిర్వహించడం లేదని, అలాగే సేఫ్టీ కమిటీ మీటింగ్ కూడా ఏర్పాటు చేయడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శులు కుమారస్వామి, ఎర్ర సమ్మయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అప్రోజ్ ఖాన్, నాయకులు రాజ్ కుమార్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాజగోపురం–గుడి వరకు చలువపందిళ్ళు

కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/పాపన్నపేట: వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంగా రాజగోపురం నుండి గుడి వరకు చలువ పందిళ్లు, ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టామని, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాపన్న పేట మండలం ఏడుపాయల వనదుర్గా మాత అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని కలెక్టర్ సంబంధిత తహసిల్దార్, ఆలయ అర్చకులు, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. దేవాలయ ప్రాంగణం అంతా కలియతిరిగి భక్తులు దర్శనానికి ఏ రోజు ఎంత మంది వస్తున్నారు. మంగళ, శుక్ర, ఆదివారం భక్తుల రద్దీ, సౌకర్యాల గురించి కలెక్టర్ ఆలయ నిర్వాహకులు, తహసిల్దార్స్ ను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి కాలంలో భక్తులకు ఎండ నుండి ఉపశమనం కలిగించడం కొరకు త్రాగునీరు చలువ పందిళ్లు నిర్మాణం ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు ఉపయోగాలకు తీసుకురావాలని, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని, సౌకర్యాలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట తహసిల్దార్ సతీష్, ఆలయ ప్రధాన పూజారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలకు జాతీయ నాణ్యతా ప్రమాణాల సర్టిఫికెట్

కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్: జిల్లాలోని నాలుగు ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ లభించిందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాల వైద్యులు,సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలియజేశారు.జిల్లాలోని సారంగాపూర్ మండలం చించోలి(బి),లక్ష్మణచందా మండలం మల్లాపూర్,ముధోల్ మండలం తరోడ,బాసర మండలంలోని కౌట నాలుగు ఆరోగ్య కేంద్రాలకు ఈ జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు లభించినట్లు తెలిపారు.జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ లభించడం పట్ల ఆరోగ్య కేంద్రాల వైద్యులు,సిబ్బందిని అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,పట్టణంలో బస్టాండ్,ప్రధాన కూడళ్ళు, మార్కెట్లు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలంతా చలివేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎండలు విపరీతంగా ఉన్నాయని, వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,అర్బన్ తహసిల్దార్ రాజు, మున్సిపల్ డి.ఈ హరిభువన్, ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 3న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్

ప్రజాపక్షం/గజ్వేల్ : ఏప్రిల్ 3వ తేదీన సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే భవన మరియు ఇతర నిర్మాణాల కార్మికుల యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ కోరారు. బుధవారం ఏఐటీయూసీ నియోజకవర్గ ఇంచార్జి శివలింగు కృష్ణ అధ్యక్షతన గజ్వేల్ పట్టణ శివారులోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పల్లెహాడ్, వేముల గట్టు, లింగరాజుపల్లి, ముట్రాజుపల్లి, సింగారం గ్రామాల కార్మికులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. గత కొన్ని నెలలుగా పెండింగ్ లో ఉన్న ఫైల్స్ క్లియర్ చేయాలని, సహజ మరణానికి రూ 5 లక్షలు, ఆక్సిడెంట్ రూ.10 లక్షలు, 55 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5 వేల పెన్షన్, మహిళ కార్మికులకు డెలివరీ కోసం రూ 50 వేలు, మ్యారేజ్ ఒక లక్ష, అర్హులైన కార్మికులకు డబల్ బెడ్ ఇండ్లు, అడ్డాల వద్ద విశ్రాంతి గదులు, మౌలిక వసతులు కల్పన చేపట్టాలని ఆన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పాత లేబర్ కార్డులను రెన్యూవల్ చేయాలని, రేషన్ కార్డునే ఫ్యామిలీ మెంబర్ కార్డుగా గుర్తించాలని తెలిపారు. కార్మికుల నామినికి బెనిఫిట్స్ అందించాలని, దహన సంస్కారం ఖర్చు రూ 20 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏప్రిల్ 3న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్ లో జరిగే జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి అందే అశోక్, సంఘం జిల్లా అధ్యక్షుడు బెక్కంటి సంపత్, బాబు, కనకయ్య, పోతుల శంకరయ్య, రాములు, యాదగిరి, పాల్గొన్నారు.

విచారణపేరిట రైల్వే పోలీసుల వేధింపులు

న్యాయం కావాలని బాధిత కుటుంబం డిమాండ్

ప్రజాపక్షం / మందమర్రి: మంచిర్యాల జిల్లా మందమర్రి కు చెందిన నస్పూరి వినయ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుని భార్య భాగ్యలక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి మందమర్రి ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు. మమత అనే మహిళ తన భర్తను వలలో వేసుకుని మానసికంగా వేధించిందని, ఇందుకు సంబంధించిన ఫోటోలను మీడియా ముందు ప్రదర్శించారు. అలాగే, మమత భర్త శ్రీనివాస్ మిత్రులు నరేందర్, సురేందర్, రాజిరెడ్డి కలిసి పలుమార్లు వినయ్ పై దాడులు చేసినట్లు తెలిపారు. ఈ వేధింపుల కారణంగా వినయ్ మానసికంగా కుంగిపోయి పలుమార్లు ఆత్మహత్యాయత్నం చేశారని, చివరికి ఈ పరిస్థితులను తట్టుకోలేక గత నెలలో ప్రాణాలు తీసుకున్నారని ఆమె కన్నీటి మధ్య వివరించారు. వినయ్ మృతి కేసులో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మందమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశామని, మంచిర్యాల రైల్వే పోలీస్ స్టేషన్ లోనూ ఫిర్యాదు చేసినట్లు భాగ్యలక్ష్మి తెలిపారు. అయితే, విచారణ పేరిట రైల్వే ఎస్ఐ సాక్షులను దురుసుగా తిట్టినట్లు, వారి ప్రవర్తనపై అనుమానం కలిగిందని పేర్కొన్నారు. ఈ కేసును రైల్వే పోలీసుల నుండి మందమర్రి పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయాలని కోరిన ఆమె, తమకు న్యాయం జరగకపోతే సామూహిక ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై పోలీసులు సత్వర చర్యలు తీసుకోవాలని, వినయ్ మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

ఆరు గ్యారంటీలకు కేటాయించి చిత్తశుద్ధిని నిరూపించుకున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా రూ.304965 లక్షల కోట్లతో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టగా, అభివృద్ధి, సంక్షేమం, సాగునీరు, నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. రైతు సంక్షేమాన్ని కాంక్షిస్తూ నీటిపారుదల రంగానికి రూ 23373 కోట్లు, వ్యవసాయానికి రూ.24439 కోట్లు వర్తింపజేసినట్లు చెప్పారు. సకలజనుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్న కాంగ్రెస్ బిసి సంక్షేమానికి రూ.11405 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.40232, ఎస్టి సంక్షేమానికి రూ 17 169 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ 3591 కోట్లు, చేనేత రంగానికి రూ.371 కోట్లు కేటాయించడంతోపాటు పాటు విద్య, వైద్యం, ఆరోగ్యం, పశు సంవర్ధక శాఖలకు ప్రాముఖ్యత కల్పించినట్లు తెలిపారు. అంతేకాకుండా రైతుల నుండి సన్నధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్, వడ్డీ లేని రుణాలు, మహిళ సంక్షేమం, కార్మిక, పర్యాటక, గృహజ్యోతి పథకాలతో పాటు బియ్యం రాయితీకి రూ.3 వేల కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి రూ.600 కోట్లు కేటాయించగా, యువత, విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో యంగ్ ఇండియా, రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.2900 కోట్లు కేటాయించి పేదల అభ్యున్నతికి సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి పనిచేస్తున్నట్లు వివరించారు.

ఎల్ఆర్ఎస్ రుసుము వసూలు వేగవంతం

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ప్రజాపక్షం/కాగజ్ నగర్: ఎల్ఆర్ఎస్ 2020 పథకంలో అర్హులైన అభ్యర్థుల నుంచి రుసుము వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధికారులను ఆదేశించారు. బుధవారం కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 31లోగా పూర్తిస్థాయిలో రుసుము చెల్లించే అభ్యర్థులకు 25 శాతం మినహాయింపు లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని, చెల్లింపులను ప్రోత్సహించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. చెల్లింపు గడువుకు ఇంకా 10 రోజులు మాత్రమే ఉన్నందున రుసుము వసూలు ప్రక్రియను మరింత వేగంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం కలెక్టర్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి కాగజ్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో చల్లని త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సిబ్బంది, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని, ఈ నెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, వార్డు అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకూ సాగునీరు

కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి: జిల్లాలోని ప్రాజెక్టుల క్రింద సాగు చేయబడే చివరి ఆయకట్టు వరకు పంట సాగుకు నీరు అందించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ చాంబర్‌లో నీటిపారుదల శాఖ ఇఇడి ఇఇ, ఎఇఇ లతో సాగునీటి నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాజెక్టు పరిధిలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ 11.4 టిఎంసి ఉందని, కార్యచరణ ప్రకారం నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. నుందిళ్ళ, అన్నారం, గూడెం ఎత్తిపోతలు, ఇతర మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, నీల్వాయి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జూన్ 15వ తేదీ వరకు జిల్లాలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పంట సాగులో నీటి అవసరం తక్కువగా ఉండే వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, కెనాల్లు, ట్యాంకులు, చెరువుల శుద్ధీకరణ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సిర్సా ఎత్తిపోతల పథకం, అర్జునగట్ట, కిష్టాపూర్ ప్రాజెక్టులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాన్స్‌టిట్యూషన్ క్లబ్‌కు బడ్జెట్‌లో రూ.30 కోట్లు

ఢిల్లీ తరహాలో హైదరాబాద్‌లో కూడా కాన్స్‌టిట్యూషన్ క్లబ్ నిర్మించాలని గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా తాజా బడ్జెట్‌లో రూ.30 కోట్లు కేటాయించింది. ఆదర్శనగర్ న్యూ ఎంఎల్‌ఏ క్వార్టర్స్ ప్రాంగణంలో ఈ భవనాన్ని నిర్మించే అవకాశాలు ఉన్నాయి. అలాగే అసెంబ్లీ ప్రాంగణంలో పాత అసెంబ్లీ సమావేశ మందిరాన్ని కూడా ఈ ఏడాదిలోనే బాగు చేయనున్నారు. అందులో శాసనమండలి సమావేశాలను నిర్వహిస్తారు. పాత సమావేశ స్వరూపాన్ని మార్చకుండా, హెరిటేజ్ స్ట్రక్చర్‌ను పరిరక్షిస్తూ దానిని పునరుద్ధరించే పనులు సాగుతున్నాయి.

బడ్జెట్ రోజూ కెసిఆర్ గైర్హాజరు

శాసనసభలో 2025–26 బడ్జెట్ ప్రవేశపెట్టిన బుధవారం నాడు శాసనసభ ప్రతిపక్ష నాయకులు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గైర్హాజరయ్యారు. గత ఏడాది బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు ఆయన సభకు వచ్చారు. ఇటీవల బడ్జెట్ సమావేశాల ప్రారంభ సూచికగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం చేసిన రోజున మళ్లీ కెసిఆర్ హాజరయ్యారు. కాగా, ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్కకు ఇది మూడవ బడ్జెట్. కాగా, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తాజా బడ్జెట్‌తో కలిపి వరుసగా 14 బడ్జెట్‌ల రూపకల్పనలో పని చేశారు. వాటిలో రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లు ఉన్నాయి.

రియల్ ఎస్టేట్‌పై భారీ ఆశలు

ఏడాదికి పైగా స్తబ్ధుగా ఉన్న రియల్ ఎస్టేట్ పుంజుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకే భూముల నుంచి వచ్చే ఆదాయంపై భారీ అంచనాతో ఉంది. భూములు, మద్యం విక్రయాలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగంపైనే రాబడిపై అధిక ఆశలు పెట్టుకుంది. మద్యంపై ద్వారా సుమారు రూ.46,800 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఎక్సైజ్ డ్యూటీ కింద రూ. 27,623 కోట్లు, వ్యాట్ ద్వారా రూ.19వేల కోట్లకు పైబడి రాబడి రానుంది. అలాగే భూములు, ఓపెన్ ప్లాట్లు, ఫ్లాట్లు, ఇళ్ళ విక్రయం ద్వారా రూ.10 వేల కోట్లు, అదనపు ఆదాయ వనరుల ద్వారా రూ.10 వేల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసుకుంది. పెట్రోలు వ్యాట్ ద్వారా రూ.18వేల కోట్లు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. అలాగే ఖనిజాలపై రాయల్టీ కింద రూ. 6,135 కోట్లు, ఇసుక అమ్మకం ద్వారా రూ.1,200 కోట్లు వస్తాయని అంచనా. రియల్ ఎస్టేట్ ఊపు పెరుగుతుందనే ఆశలతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ద్వారా 19,176 కోట్లు వస్తాయని భావిస్తోంది. సుమారు రూ.3.04 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.2.29 లక్షల కోట్లు రెవెన్యూ రాబడి ద్వారా వస్తుందని అంచనా వేసింది. అందులో కేంద్ర పన్నుల వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ల రూపంలో రూ.52 వేల కోట్లు రానున్నాయి. ఇక రాష్ట్రం స్వంత ఆదాయ వనరుల ద్వారా రూ.1.78 లక్షల కోట్లు రాబట్టుకోవాల్సి ఉంది. అందులో పన్ను రాబడి ద్వారా రూ.1.45 లక్షల కోట్లు, పన్నేతర రాబడి ద్వారా రూ.31,618 కోట్లు వస్తాయని అంచనా. రాష్ట్ర పన్నులు, పన్నేతర రాబుడులు 2024–25 బడ్జెట్ కంటే సుమారు రూ.23 వేల కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

స్టాంప్స్ , రిజిస్ట్రేషన్స్ ఫీజులు ద్వారా రూ.19,087 కోట్లు లక్ష్యం
భూమి విక్రయాల ద్వారా రూ.10 వేల కోట్లు
అదనపు వనరుల నుంచి రూ.10 వేల కోట్లు
మద్యంపై ఎక్సైజ్ డ్యూటీ రూ.27,623 కోట్లు, వ్యాట్ ద్వారా రూ.19వేల కోట్లు

పెరిగిన రుణ భారం

రాష్ట్ర ప్రభుత్వం రుణభారం మరింత పెరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి రూ.4.03 లక్షల కోట్లు అప్పులు, సుమారు 3 లక్షల కోట్లు కలిపి రూ.7 లక్షల కోట్లకు పైగా రుణాలు ఉండేవి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అప్పులు రూ.4.51 లక్షల కోట్లు అవుతుంది. ఇది 2025–ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.5.05 లక్షల కోట్లకు చేరుకుంటుంది. దీనికి ఎఫ్ఆర్‌బిఎం పరిధిలో లేని బడ్జెటేతర రుణాలు రూ.3.01 లక్షల కోట్లు అదనం. వెరసి రెండు కలిసి రాష్ట్ర అప్పులు రూ.8 లక్షల కోట్లు కానున్నాయి.

సంక్షేమానికి భారీగా నిధులు..

ఎస్‌సి సంక్షేమం రూ. 40,232 కోట్లు
ఎస్‌టి సంక్షేమం రూ. రూ.17,169 కోట్లు
బిసి సంక్షేమం రూ. 11,405 కోట్లు
ఎంబిసి సంక్షేమం రూ. 400 కోట్లు
మొదటి సారి సబ్ ప్లాన్ చట్టం అమలుకు చర్యలు



రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఎస్‌సి,ఎస్‌టి,బిసి,మైనార్టీ సంక్షేమ శాఖలకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులను ప్రతిపాదించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్ని మొదటి సారి అమలుకు చర్యలు చేపట్టింది. ఈ చట్టం ప్రకారం ఆర్థిక సంవత్సరంలో మిగిలిన నిధులను ఆ తర్వాత వచ్చే ఆర్థిక సంవత్సరంలో కలుపాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ఎస్‌సి సంక్షేమానికి రూ. 40,232 కోట్లను ప్రతిపాదించగా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం ప్రకారం ఖర్చు చేయాల్సిన నిధులలో ఎస్‌సి సంక్షేమానికి రూ.13,617 కోట్లు ఖర్చు చేయకుండా బకాయి పెట్టారు. ఈ నిధులను 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన నిధులకు అదనంగా సబ్‌ప్లాన్ నిధులను కూడా కలిపారు. దీంతో రూ.26,615 కోట్లకు అదనంగా రూ.13,617 కోట్లతో కలిపి మొత్తం రూ.40,232 కోట్లను ప్రతిపాదించారు. అలాగే ఎస్‌టి సంక్షేమ శాఖలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం ప్రకారం ఖర్చు చేయాల్సిన నిధులలో రూ.1,317 కోట్లు ఖర్చు చేయలేదు. దీంతో ఈ నిధులతో కలిపి మొత్తం రూ.17,169 కోట్లను ప్రతిపాదించారు. మైనార్టీ సంక్షేమానికి రూ.3,591 కోట్లను ప్రతిపాదించగా ఇందులో రూ.840 కోట్లను స్వయం ఉపాధి పథకాలకు ప్రతిపాదించారు. బిసి సంక్షేమానికి రూ.11,405 కోట్లను ప్రతిపాదించారు. ఇందులో ఎంబిసిలకు రూ. 400ల కోట్లను, చేనేత కార్మిక సహాయార్థం రూ. 450 కోట్లను ప్రతిపాదించారు.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు అధిక ప్రాధాన్యం

రాష్ట్రంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణకు ఊతం ఇచ్చేలా బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై కాంగ్రెస్ సర్కార్ వరాల జల్లు కురిపించింది. తెలంగాణలోని పట్టణాలు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి వైపు దూసుకపోతున్న నేపథ్యంలో ఆ స్థాయిలో బడ్జెట్‌లో ప్రాధాన్యతను ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వద్ద ఉన్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.17,677 కోట్లు నిధులను ప్రతిపాదించింది. 202324 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ లో రూ.11,372 కోట్లు కేటాయించగా, ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం దాన్ని సవరించిన బడ్జెట్‌లో రూ.7441 కోట్లకు తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024–25 బడ్జెట్‌లో రూ.15 వేల 594 కోట్లను కేటాయించగా, ఈ సారి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.17,677 కోట్లు కేటాయించింది. వీటిలో జిహెచ్ఎంసి చేపట్టనున్న హెచ్ సిటీ పనులకు రూ. రూ.2654 కోట్లను కేటాయించగా, 10 లక్షల జనాభా దాటిన నగరాలకు 15 ఆర్థిక సంఘం చెల్లించే నిధుల్లో ఈ సారి .419 కోట్లు ప్రతిపాదించింది. దీనికి తోడు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వ వసూలు చేసుకుంటున్న ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లలో జిహెచ్ఎంసి వాటాగా రూ. 10 కోట్లు, వెహికల్ ట్యాక్స్ వాటాగా రూ. 10లక్షల 11 వేలతో కలిపి జిహెచ్ఎంసికి మొత్తం రూ.3101.21 కోట్లను కేటాయించింది. గ్రేటర్ హైదరాబాద్‌లో వరదనీటిని నివారించేందుకు రూ. 5,942 కోట్లను వ్యయంతో సమగ్ర వరద నీరు పారుదల ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. జలమండలికి సుంకిశాల స్టోరేజ్ రిజర్వాయర్‌కు రూ.3085, గోదావరి జలాల తరలింపునకు ప్రాజెక్టు3కు రూ. 1450 కోట్లు, నగరంలో అమలు చేస్తున్న ఉచిత తాగునీటి సరఫరా పథకానికి రూ. 300 కోట్లు, జలమండలిలో ఇతర అభివృద్ధి పనుల కోసం రూ. 635 కోట్లను కేటాయిస్తూ ఒక్క జలమండలికి రూ. 5470 కోట్లను కేటాయించింది. హెచ్ఎండిఏకు రూ. 500 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ. 200 కోట్లతో కలిపి మొత్త రూ. 700 కోట్లు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుకు రూ. 1500 కోట్లను బడ్జెట్‌లో కేటాయింపులు జరిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు గత సంవత్సర బడ్జెట్ రూ. 200 కోట్లను కేటాయించిన సర్కారు ఈ సారి రూ.121.86 కోట్లను కేటాయించింది. గత ఏడాదితో పోల్చితే జిహెచ్ఎంసి కేటాయించిన నిధులు తక్కువే అయినా, హెచ్ సిటీ పనులకు ఏకంగా రూ. 2654 కోట్లను కేటాయిచింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన పురపాలక సంఘాలు, పట్టణాభివృద్ధి సంస్థలలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి కోసం రూ. 4,500 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామని, ఈ మొత్తాన్ని వచ్చే మూడేళ్లలో ఖర్చు చేసి, వాటికి కావలసిన సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం బడ్జెట్‌లో స్పష్టం చేసింది.

పర్యావరణ పరిరక్షణ పేరుతో ఆర్‌టిసి నిర్వీర్యానికి కుట్ర

రౌండ్ సమావేశంలో పలువురు వక్తలు ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్ : పర్యావరణ పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆర్‌టిసిని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా రవాణ వ్యవస్థ అయిన ఆర్‌టిసిని దొడ్డి దారిన ప్రైవేటీకరించేందుకే ఎలక్ట్రికల్ బస్సులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని వారు ఆరోపించారు. అనేక వ్యవ ప్రయాసాలకు తట్టుకుంటూ రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్న ఆర్‌టిసికే కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో బుధవారం సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆర్‌టిసిని పరిరక్షిద్దాం ప్రజా సేవను కొనసాగిద్దాం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగి న ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ స్వాగతం పలికారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్, నూతనంగా ఎన్నికైన సిపిఐ ఎంఎల్‌సి, నెల్లికంటి సత్యం, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి.నరసింహారావు, సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యుసుప్, వామపక్ష పార్టీలు నాయకులు, జానకిరాములు(ఆర్ఎస్‌పి), సి.హెచ్.మురహరి (ఎస్‌యుసిఐ), ఎం.హన్మేష్(మాస్ లైన్), కె.గోవర్ధన్ (న్యూడెమోక్రసీ), ఆర్‌టిసి జెఎసి ఛైర్మన్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ.వెంకన్న, కోఛైర్మన్, థామస్‌రెడ్డి, ఆర్‌టిసి ఎంప్లాయిస్ అధ్యక్షులు ఎస్.బాబు, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.

అంజయ్య నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.కాంతయ్య, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం, ఆర్‌టిసి జెఎసి నాయకులు చల్లారాంరెడ్డి, సత్యపాల్, జ్యోతి , భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ఆర్‌టిసికి సంబంధించి ప్రధానంగా మూడు సమస్యలు ఉన్నాయని, అందులో మొదటిది ఆర్థిక సమస్యలు, రెండవది యూనియన్ల పునరుద్ధరణ, మూడవది ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ అని వివరించారు. ఇప్పుడు మరింత పెద్ద సమస్య దొడ్డి దారిన ఆర్‌టిసిని ప్రవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం అన్నారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో తీసుకువస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్రాల్లో అతి పెద్ద ప్రజా రవాణా సంస్థలైన ఆర్‌టిసికి కాకుండా కార్పొరేట్ సంస్థలకు మాత్రమే కేటాయించడం, ఆ బస్సులను అనివార్యంగా ఆర్‌టిసిలు అద్దె రూపంలో తీసుకుని వాటికి డబ్బులు చెల్లించాల్సి పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని, దీంతో ఆర్‌టిసి సంస్థకు అద్దెలు మరింత భారంగా మారనుందని చెప్పారు. ఆర్‌టిసి ఉద్యోగుల సంఖ్య కూడడా గననీయంగా తగ్గనుండడంతో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఆర్‌టిసి కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కారంగా కేంద్రం ప్రభుత్వం సబ్సిడి కింద ఇస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను ఆర్‌టిసి సంస్థలకే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రోజువారిగా లక్షాలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాల చేరవేయడంతోపాటు ప్రత్యక్షంగా 41 వేల మందికి ఉద్యోగాలను పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నఆర్‌టిసిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రజా రవాణ వ్యవస్థ అయిన రైల్వేకు డిజిల్ పన్ను 4 శాతం ఉంటే , నిరుపేద ప్రజలకు అతి తక్కువ ఛార్జీలతో రవాణాను అందిస్తున్న ఆర్‌టిసి నుంచి మాత్రం 18 శాతం వసూళ్లు చేయడం అన్యాయమన్నారు. ఆర్‌టిసి బస్సులకు టోల్ మినహాయింపులతో పాటు 5 ఏళ్ల పాటు ట్యాక్స్ హాలిడేను ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ఆర్‌టిసి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి వారికి న్యాయం చేయాలని ,యూనియన్లను పునరుద్ధరించడం ద్వారా వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

నెల్లికంటి సత్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రయాణ సౌకర్యాలను అందిస్తున్న అతి పెద్ద సంస్థ ఆర్‌టిసిని ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. ఇందుకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

జాన్ వెస్లీ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఆర్‌టిసిని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. కేంద్రం ఒక ఎలక్ట్రిక్ బస్సుకు రూ.40లక్షల వరకు సబ్సిడి ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ట్యాక్స్‌లను మినహాయింపు ఇస్తున్న నేపథ్యంలో ఈ బస్సులను ఆర్‌టిసికి కేటాయిస్తే ఇటు సంస్థకు అటు ప్రజలకు మరింత మెరుగైన ప్రయాణం అందుబాటులోకి వస్తుందని డిమాండ్ చేశారు.

ఆర్‌టిసి జెఎసి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నా ఆర్‌టిసి విలీనం ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినా ఆ సమస్యను నేటికి పరిష్కరించలేదని, దీంతో చిన్న చిన్న తప్పులకే అధికారులు ఉద్యోగులను తొలగించి, వారి కుటుంబాలను రోడ్డు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె బాట పడుతామని వారు హెచ్చరించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌పార్టీ ఆర్‌టిసి పరిరక్షణతో పాటు కార్మిక సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రతి హామిని నేరవేర్చాలని వివిధ వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు.

ఇజ్రాయెల్ కట్టడికి తక్షణ చర్యలు

అంతర్జాతీయ సమాజానికి సిపిఐ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణహోమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జాతీయ సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మార్చి 18, 2025న గాజాపై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల ఫలితంగా మహిళలు, పిల్లలు సహా 400 మందికి పైగా పలస్తీనియన్లు దుర్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేసింది. అక్టోబర్ 7, 2023 నాటి నుండి పలస్తీనియన్ల మరణాల సంఖ్య 62 వేలు దాటింది. వీరిలో అత్యధికులు అమాయక పౌరులే. ఆందోళన కలిగిస్తున్న ఈ సంఖ్య... కొనసాగుతున్న సంఘర్షణ తీవ్రతకు నిదర్శనం. పలస్తీనియన్లపై జరిగిన మారణహోమంగా గుర్తించబడింది. ఈ దారుణ మారణకాండను ఆపేలా ఇజ్రాయిల్‌ను కట్టడి చేయడానికి తక్షణ, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని సీపీఐ అంతర్జాతీయ సమాజానికి, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి పిలుపునిచ్చింది. ప్రపంచ సంస్థల నిరంతర నిష్క్రియాపర్వం, మౌనం... దురాక్రమణదారుడి (ఇజ్రాయిల్)ని ప్రోత్సహించడమే కాకుండా అంతర్జాతీయ చట్టాలు, మానవ హక్కుల ప్రాథమిక సూత్రాలను కూడా క్షీణింపజేస్తోంది. ఈ తీవ్రమైన సమస్యపై భారత ప్రభుత్వం మౌనం కొనసాగించడం పట్ల తీవ్ర నిరాశ చెందుతున్నట్లు తెలిపింది. న్యాయం, వలసవాద వ్యతిరేక పోరాటం పట్ల చారిత్రక నిబద్ధత కలిగిన భారత దేశం... పలస్తీనా ప్రజల దుస్థితి పట్ల ఉదాసీనంగా ఉండకూడదు. భారత ప్రభుత్వం తన మౌనాన్ని వీడాలి. కొనసాగుతున్న హింసను ఖండించాలి. పలస్తీనాకు మద్దతు ఇవ్వాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. స్వేచ్ఛ, న్యాయం, స్వయం నిర్ణయాధికారం కోసం పలస్తీనా ప్రజలకు అచంచల సంఘీభావంగా నిలుస్తామని ప్రకటించింది. పలస్తీనా ప్రజలకు తమ మద్దతు, సంఘీభావం తెలియజేయాలని భారత ప్రజలను సిపిఐ కోరింది.

దాడుల విరమణ

పిలుపును పుతిన్ స్వాగతించారని క్రెమ్లిన్ వర్గాలు చెప్పాయి. ఈ విధమైన ఒప్పంద వివరాలపై తదుపరి కసరత్తు చేసేందుకు సంప్రదింపులు చేయడానికి పుతిన్ అంగీకరించారని చెప్పాయి. ఈ చర్చలతో సర్వసాధారణంగానే నల్లసముద్రంలో కూడా కాల్పుల విరమణ జరుగుతుందని, ఇది క్రమంగా పూర్తిస్థాయి యుద్ధ విరమణకు దారితీయగలదని వైట్‌హౌస్ యంత్రాంగం ఆశాభావం వ్యక్తం చేసింది. నల్లసముద్రంలో కూడా కాల్పుల విరమణ జరగాలని ఉక్రేన్ ఇప్పటికే అమెరికాకు ఒక ప్రతిపాదన చేసింది. ''అన్ని ఇంధన వనరులు, మౌలిక సదుపాయాలపై తక్షణం కాల్పుల విరమణకు అంగీకరించాం,పూర్తి కాల్పుల విరమణకు సత్వరం మేం పని ప్రారంభిస్తాం'' అని సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టింగ్ పెట్టారు. పాశ్చాత్యదేశాలు ఉక్రేన్‌కు సైనిక, గూఢచారి పరమైన సహాయ సహకారాలు, మద్దతు ఇవ్వడం ఆపేసినప్పుడే ఉక్రేన్‌లో యుద్ధపరిష్కారం సాధ్యమవుతుందని ట్రంప్‌కు పుతిన్ స్పష్టం చేశారు. ''ఉక్రేన్‌కు విదేశాల నుండి గూఢచర్య సమాచారం, విదేశీ సైనిక సహాయం పూర్తిగా నిలిపివేసినప్పుడు మాత్రమే రాజకీయ, దౌత్య మార్గాలలో యుద్ధ విస్తృతిని అడ్డుకోవడం సాధ్యపడుతుంది'' అని కీలక షరతు పెట్టారు. ఉక్రేన్‌లో 30 రోజులపాటు కాల్పుల విరమణ చేపట్టాలని ఫోన్‌లో పుతిన్‌కు ట్రంప్ ప్రతిపాదించారు. అందుకు ఆయన అంగీకారం తెలియజేశారు. నాయకులు ఇద్దరూ విస్తృతంగా చర్చించారని క్రెమ్లిన్ ప్రతినిధులు చెప్పారు. గతవారం సౌదీఅరేబియాలో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో ఉక్రేన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ట్రంప్ ప్రతిపాదన ప్రకారం 30 రోజుల కాల్పుల విరమణకు ఉక్రేన్ అంగీకరించింది. ఐతే పుతిన్ ఇంకా తమపై దాడులు చేస్తూనే ఉన్నారనీ, ఆయన శాంతికి సిద్ధంగా ఉన్నట్లేనా? అని జెలెన్స్కీ విమర్శలు చేస్తున్నారు.

372 మంది ఖైదీల పరస్పర మార్పిడి పూర్తి

మరోవైపు ఉక్రేన్–రష్యాలు 372 మంది సైనికులను ఇచ్చిపుచ్చుకున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇంతకుముందు చేసిన మధ్యవర్తిత్వం ప్రకారం జరిగిన ఒప్పందం కింద ఈ ఖైదీల మార్పిడి జరిగిందని బుధవారంనాడు రష్యా రక్షణమంత్రిత్వశాఖ విడిగా ఒక ప్రకటనలో తెలియజేసింది. తీవ్రంగా గాయపడి 23 మంది ఉక్రేన్ సైనికులతోపాటు మొత్తం 175 మందిని రష్యా స్వాధీనం చేయగా, అంతే సంఖ్యలో 175 మంది రష్యా సైనికులను ఉక్రేన్ స్వాధీనం చేసిందని రష్యా రక్షణశాఖ పేర్కొంది.

అమెరికా–రష్యామధ్య సాధారణ సంబంధాలు

అమెరికా–రష్యా దేశాలు రెండూ తమ మధ్య సంబంధాలను సాధారణీకరించుకోవాలని కూడా పుతిన్–ట్రంప్ ఫోన్ సంభాషణలో నిర్ణయించారు. ప్రపంచ భద్రతను కాపాడాల్సిన ప్రత్యేక బాధ్యతలు రెండు దేశాలపైనా ఉన్నందువల్ల రెండు దేశాలూ సంబంధాల సాధారణీకరణపట్ల ఆసక్తి చూపించాయి. పుతిన్‌తో తాను సుదీర్ఘంగా ఫోన్ సంభాషణ చేశాననీ, తద్వారా మంచి ఫలితాలు సాధించామని ఫిబ్రవరి 13న ట్రంప్ చెప్పారు. ఉక్రేన్‌లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని చైనా స్వాగతించింది. నాయకులిద్దరి సంభాషణలో మంచి ఫలితాలు వచ్చాయని పేర్కొంది. రష్యా అంగీకారం తెలియజేయడంపట్ల బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ కూడా హర్షం ప్రకటించారు. ట్రంప్–పుతిన్ చర్చలకు ముందుగా బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ సోమవారం సాయంత్రం టెలిఫోన్‌లో అమెరికా అధ్యక్షుడితో సంభాషించారు. ''రష్యాతో జరిగిన యుద్ధం తర్వాత న్యాయమైన,శాశ్వతమైన శాంతిని సాధించడానికి ఉక్రేన్‌ను సాధ్యమైనంతవరకూ చాలా బలమైనస్థితిలో కొనసాగించాల్సిన అవసరం ఉందని ట్రంప్‌తో స్టార్‌మర్ చెప్పారు. అదేవిధంగా ఉక్రేన్ సాయం చేసేందుకు ఏర్పాటు చేసిన ''ఇష్టపడే వారి కూటమి'' (కొయిలేషన్ ఆఫ్ విల్లింగ్) రాబోయే శనివారంనాడు ప్రపంచ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్న విషయాన్ని కూడా ట్రంప్‌కు చెప్పారు.

ఆర్థిక ఆంక్షలు సమ్మతం కాదు

''ఉక్రేన్‌పై దాడి చేసినప్పుడు మాపై ఆంక్షలు విధించారు, అవి న్యాయసమ్మతం కాదు, ఈ 'ఆంక్షల కత్తి' మా పైన ఎప్పుడూ వేలాడుతూనే ఉంటుంది, ఎందుకంటే మా ప్రత్యర్థులు పోటీదారులు మమ్మల్ని ఎప్పటికీ నియంత్రించాలని కోరుకుంటారు, రాజకీయంగా, వ్యాపారపరంగా, సాంకేతికంగా మమ్మల్ని బలహీనపరచాలని కోరుకుంటారు, అందువల్ల ఈ ఆర్థిక ఆంక్షలు న్యాయసమ్మతం కాదు'' అని ట్రంప్‌తో టెలిఫోన్ సంభాషణకు ముందుగా పుతిన్ వ్యాఖ్యానించారు. ట్రంప్‌తో సంభాషణకు ముందు రష్యా వ్యాపారసంఘ సమావేశంలో పుతిన్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్థికవ్యవస్థలో పాశ్చాత్యదేశాల ఆధిపత్యం తగ్గిపోతోందనీ, ప్రపంచవృద్ధిలో కొత్త కొత్త కేంద్రాలు పుట్టుకువస్తున్నాయని చెప్పారు. జి–7 దేశాలను కూడా ఆయన తోసిపుచ్చారు. ప్రపంచ పటంలో అవి ఎక్కడా పెద్దగా కనిపించినపాపాన పోలేదని నవ్వులమధ్య అన్నారు. పశ్చిమదేశాలు రష్యాపై అలవికాని ఆంక్షలు విధించి ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

రష్యా–ఉక్రేన్ పరస్పర ఆరోపణలు

ఒకవైపు శాంతి చర్చల ప్రక్రియ జరుగుతుంటే మరోవైపు రష్యా–ఉక్రేన్‌లు పరస్పరం బుధరువారంనాడు ఆరోపణలు చేసుకున్నాయి. ఉక్రేన్ దాడులు ఆపలేదని రష్యా ఆరోపించగా, తమపై రష్యా దాడులు చేస్తూనే ఉందని జెలెన్స్కీ ఆరోపించారు. పుతిన్ కార్యదర్శి ద్మీత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ, కాల్పుల విరమణకు పుతిన్ ఆదేశాలు ఇచ్చిన తరుణంలో విద్యుత్ వ్యవస్థలపై ఉక్రేన్ దాడులు చేసిందని విమర్శించారు. పుతిన్ కాల్పుల విరమణకు ఒప్పుకున్నారని ప్రపంచం అంతా తెలిసిందని, ఈ దశలో ఈ దాడి జరిగిందన్నారు. శాంతిసాధనలో పుతిన్ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని జెలెన్స్కీ అన్నారు. అమెరికా నుండి తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నందువల్ల ఉక్రేన్ బేషరతుగా 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి అంగీకరించిందనీ, రష్యా కూడా చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ఎందుకంటే ట్రంప్ కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిన తర్వాత రష్యా కేవలం డిమాండ్లు మాత్రమే చేస్తూ వస్తోంది తప్ప, తనవైపు నుండి ఉక్రేన్‌ను సంతోషపెట్టేవిధంగా ఎలాంటి ప్రకటనా చేయలేదని జెలెన్స్కీ విమర్శించారు. పూర్తిస్థాయి కాల్పుల విరమణను పుతిన్ తిరస్కరించారనీ, ఉక్రేన్‌పై రాత్రికి రాత్రే ఆరు క్షిపణులు, 145 డ్రోన్లతో రష్యా దాడి చేసిందని, కాల్పుల విరమణపట్ల చిత్తశుద్ధిలేదని విమర్శించారు.

సురక్షితంగా సునీత

పునరావాస కేంద్రానికి తరలించారు. సునీతా విలియమ్స్‌తోపాటు బుక్ విల్మోర్, నిక్ హేగ్, అలెగ్జాండర్ గోర్బునోవ్ (రష్యా) భూమికి తిరిగొచ్చారు. ఇప్పుడు ప్రస్తుతం అంతర్జాతీయ అంతరిక్షకేంద్రంలో మరో ఏడుగురు వ్యోమగాములు ఉన్నారు. వారంతా ఆరునెలల పాటు అక్కడే ఉంటారు. ఈ స్పేస్ఎక్స్ డ్రాగన్ అంతరిక్షనౌక విజయవంతంగా భూమికి తిరిగి ఆరవడంతో అంతరిక్షానికి మానవసహిత యాత్రలకు భవిష్యత్‌లో సులభంగా కొనసాగించడానికి ఇదొక మైలురాయి ఘట్టంగా చరిత్రలో నమోదైంది. ఈ ఘటనతో స్పేస్ఎక్స్ పేరు మారుమోగిపోయింది. నాసా స్టార్‌లైనర్‌లో గత ఏడాది జూన్ 5న ఐఎస్ఎస్‌కు వెళ్ళిన సునీతా విలియమ్స్‌ను ప్రైవేటు అంతరిక్ష నౌక భూమికి విజయవంతంగా తీసుకురావడం ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో కొత్త ఘట్టానికి తెరతీసింది. పైగా ఇకమీదట సాధారణ యాత్రికులను అంతరిక్ష కేంద్రానికి తీసుకువెళ్లడానికి ప్రైవేటురంగానికి ఇదొక తొలిమెట్టు విజయంగా నమోదైంది. తొమ్మిదినెలల క్రితం స్టార్‌లైనర్ ద్వారా సునీతా విలియమ్స్ తిరిగి రావాల్సి ఉన్నప్పటికీ ఆ నౌకలో హీలియం వాయువు సమస్యవల్ల ఆ నౌక ఖాళీగా భూమికి తిరిగి వచ్చింది. నవంబరులో మరోసారి కూడా ఆమెను భూమికి తీసుకువచ్చే ప్రయత్నం విఫలమైంది. భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ దీంతో ఇప్పటివరకూ మొత్తం మూడు సార్లు అంతరిక్షయాత్రను పూర్తిచేసినట్లయింది. 62 గంటలపాటు ఆమె స్పేస్‌వాక్ చేసి అత్యధిక గంటలుస్పేస్‌వాక్ చేసిన వ్యోమగాముల జాబితాలో ఆమె నాలుగోస్థానంలో నిలిచారు. అంతరిక్షంలో మారథాన్ చేసిన తొలిమహిళగా ఆమె గణుతికెక్కారు. సునీతా విలియమ్స్ 2006లో మొదటిసారి అంతరిక్షయాత్రకు వెళ్ళారు. తర్వాత 2021లో ఒకసారి, 2024 జూన్‌లో మూడోసారి ఐఎస్ఎస్‌కు వెళ్ళి ఐఎస్ఎస్‌లో పరిశోధనలు చేశారు. గడచిన తొమ్మిది నెలలుగా సునీతా బృందం కేన్సర్ చికిత్సలపైన, స్టెమ్‌సెల్స్‌పైన పరిశోధనలు చేశారు. భారత ప్రభుత్వం ఆమెకు 2008లో పద్మవిభూషణ్ అవార్డు ఇచ్చి సత్కరించింది. ఆమె తండ్రి దీపక్ పాండ్యా గుజరాత్ మెహసనా జిల్లాలోని ఝులసన్‌కు చెందినవారు. ఆమె తల్లి స్లోవేనియాకు చెందిన మహిళ ఉర్సులైన్ బొన్నీపాండే. 1957 అమెరికాకు వలస వెళ్ళి అక్కడే స్థిరపడ్డారు. 1965 సెప్టెంబరు 19న సునీత ఒహియోరాష్ట్రం యూక్లిడ్‌లో పుట్టిపెరిగి స్థిరపడ్డారు. సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమికి రావాలని కోరుకుంటూ కొద్ది నెలలుగా అమెరికాలోని 21 హిందూ ఆలయాలలో నిత్యం పూజలు జరిగాయి.

రాబోయే తరాలకు స్ఫూర్తి రాష్ట్రపతి,ప్రధాని,ఇస్రో హర్షం: సునీతా విలియమ్స్, విల్మోర్ తదితరులు భూమికి సురక్షితంగా తిరిగి రావడంతో ప్రపంచవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ వేడుకలలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా భాగం పంచుకున్నారు. సునీతా రాకపట్ల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రాబోయే తరాలకు ఈ వ్యోమగాములు గొప్పస్ఫూర్తిని ఇస్తారని ద్రౌపదీముర్ము, నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు.వారు ఎంతో ఆత్మవిశ్వాసంతో అంతరిక్షంలో గడిపారనీ, గొప్ప పరిశోధనలు చేసి మానవవాళికి ఎంతో సేవలు చేశారని ప్రశంసించారు. మొదట కేవలం ఎనిమిది రోజులు మాత్రమే ఐఎస్ఎస్‌లో ఉండేందుకు సునీతా,విల్మోర్ వెళ్ళారు. కానీ సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వారు తొమ్మిదినెలలు అక్కడే ఉండి ఎంతో ఆత్మవిశ్వాసంతో పరిశోధనల్లో పాలుపంచుకున్నారు. ఐఎస్ఎస్ వెలుపలి నుండి కూడా వారు కొన్ని నమూనాలను సేకరించారు. ''మన భారతీయుల కుమార్తె, ఆమె సహచర వ్యోమగామి ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు, వారి చిత్తశుద్ధి, విశ్వాసం ఆదర్శనీయం'' అని ముర్ము ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ''మొత్తం వ్యోమగాముల బృందానికి అభినందనలు,

సిబ్బంది సురక్షితంగా భూమికి చేరుకున్నారు, వారి చరిత్రాత్మకమైన ప్రయాణం కృతనిశ్చయగాథగా నిలిచిపోతుంది, వారి సమష్టికృషి, అసాధారణ ధైర్యం...మొక్కవోని వారిదీక్షకు నా శాల్యూట్, వారి ఆరోగ్యం ఎంతో బాగుండాలి'' అని రాష్ట్రపతి తన పోస్టింగ్ ద్వారా ఆకాంక్షించారు. అదేవిధంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో కూడా అభినందనలు తెలయజేసింది. సునీతా విలియమ్స్ అసాధారణ విజయం సాధించారని పేర్కొంది. అంతరిక్ష అన్వేషణలో నాసా నిబద్ధతకు ఈ సురక్షిత తిరుగు ప్రయాణం ఒక నిదర్శనం, ఒక పెద్ద పరీక్షను తట్టుకుని నిలబడిన మీ చిత్తశుద్ధి అంతరిక్ష అన్వేషణలో ప్రపంచవ్యాప్తంగా అందరికీ స్ఫూర్తిగా నిలుస్తుంది'' అని ఇస్రో తన ప్రకటనలో పేర్కొంది. కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, పీయూష్ గోయల్, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేరళముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ, ఢిల్లీమాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మహీంద్ర గ్రూప్ ఛైర్‌పర్సన్ ఆనంద్ మహీంద్ర, సినీ నటులు చిరంజీవి, ఆర్.మాధవన్, జాక్రీ షరీఫ్ తదితరులు సునీతా విలియమ్స్ సాధించిన విజయంపట్ల హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆమెకు ఘన స్వాగతం పలికారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com